15-07Pg1exHMNWJQETCAK_15-07Pg1exHMNWJQETCAK.qxd 15/Jul/26 12:13 AM Page 1




ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు : fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-7-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 165 పేజీలు: 12 వెల: 6.50


## హార్మూజ్ టాక్స్ నిర్ణయంపై ట్రంప్ వెనక్కి

## కేతన్ అగర్వాల్ తల్లి ప్రధాని మోడీకి లేఖ

9లో

### కాపు ఉద్యమ శిఖరం

# ముద్రగడ ఇక లేరు



### హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ కన్నుమూత

### నేడు కిర్లంపూడికి మాజీ మంత్రి పార్థివ దేహం

### ఎంపీ, నాలుగుసార్లు ఎమ్మెల్యే, రెండు సార్లు మంత్రిగా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం

### టిడిపి, తర్వాత వైసిపిలో కీలక నేతగా రాణింపు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై14,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక ఉద్యమ శకం ముగిసింది. ప్రముఖ కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం (73) ఇక లేరు. గత కొంతకాలంగా శ్వాసకోశ, కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన ఇకలేరన్న వార్త వెలువడడంతో రాష్ట్రంలో కాపుసామాజిక వర్గంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. గత నెల రోజులుగా ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ముద్రగడ పరిస్థితి విషమించడంతో మరణించినట్లు >>2

## తలసరి ఆదాయం

# 55 లక్షలకు పెంచుతాం

2047 నాటికి రాష్ట్ర జిఎస్‌డిపి రూ. 308 లక్షల కోట్లకు పెంచే ప్రణాళిక

వచ్చే మార్చిలో పోలవరం ప్రాజెక్టు జాతికి అంకితం

మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఒడిల సమావేశంలో సిఎం చంద్రబాబు



మంగళవారం సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఒడిల సమావేశంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 14, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో 2019-2024 మధ్య అయిదేళ్లపాటు వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయని సిఎం చంద్రబాబు విమర్శించారు. రాష్ట్రంలో ఆ ఐదేళ్లూ విధ్వంసం జరిగిందన్నారు. మంగళవారం మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఒడిల సమావేశంలో సిఎం మాట్లాడుతూ... గడిచిన రెండేళ్లుగా సమష్టిగా పనిచేశామని.. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు అర్థం చెప్పామన్నారు. ప్రభుత్వ ఆలోచనల్ని ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా అమలు చేసిందని కొనియాడారు. ఆశించిన మార్పుల్ని కొంతవరకు సాధించగలిగామని.. మరిన్ని రంగాల్లో మెరుగుపడాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రతి ప్రభుత్వ శాఖ ఎప్పటికప్పుడు తాము సాధించిన ఫలితాలను బేరీజు వేసుకోవాలని సిఎం సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల సదస్సు నిర్వహించటంతో పాటు జిఎస్డీపిని విశ్లేషించుకుంటున్నామని చెప్పారు. 2047 వికసిత్ భారత్ బాటలోనే స్వర్ణాంధ్ర 2047 విజన్ రూపకల్పన చేశామన్నారు. తలసరి ఆదాయం, జిఎస్డీపీ లక్ష్యాలను నిర్దేశించుకున్నామని వెల్లడించారు. ఇప్పటి వరకు 19 >>2

## బిజినెస్ రూల్స్‌లో మార్పులకు కమిటీ

ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ అనుసంధానం ద్వారా అవసరం లేని బిజినెస్ రూల్స్‌ను సంస్కరించుకోవాల్సి ఉందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బిజినెస్ రూల్స్ రీ డ్రాఫ్ట్ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసి సంస్కరణలు తీసుకురావాలని సిఎం నిర్దేశించారు. సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌరసేవలు, రాష్ట్రంలో యూరియా లభ్యతపై సిఎం సమీక్షించారు. దేవాదాయ, రహదారులు భవనాలు, ఎపిఎస్‌ఆర్టీసీ, రవాణా, అగ్నిమాపక, వ్యవసాయశాఖలు అందిస్తున్న వివిధ సేవలు, ప్రజల నుంచి వ్యక్తం అవుతున్న సంతృప్త స్థాయిపై సిఎం సూచనలు జారీచేశారు. ప్రోయాక్టివ్ >>2

## స్వగ్రామాలకు బోటు ప్రమాద మృతదేహాలు



సోమవారం రాత్రి ఎయిర్‌పోర్టులో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

### సోమవారం రాత్రినుంచి ఎయిర్‌పోర్ట్‌లోనే మంత్రి కొండపల్లి

### బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పిన మంత్రి

**విజయవాడ, జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** వియత్నం పడవ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు పర్యాటకుల భౌతికకాయాలు మంగళవారం వారి స్వస్థలాలకు చేరుకున్నాయి. ఉదయం 7.20 గంటలకు ముంబై మీదుగా హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయం కార్గో విభాగానికి ఈ మృతదేహాలు చేరుకోగా.. అక్కడ నుంచి ఎపి ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆంబులెన్స్‌లలో వారి స్వగ్రామాలకు తరలించారు. ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ లావా ఇంటర్నేషనల్ దక్షిణ భారతదేశానికి చెందిన పంపిణీదారులను ప్రోత్సహించే క్రమంలో వీరిని వియత్నాం పర్యటనకు తీసుకువెళ్లింది. శనివారం మధ్యాహ్నం వియత్నాంలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన ఫ్యుకాక్ ద్వీపంలో 32 మంది భారతీయ పర్యాటకులతో వెళుతోన్న బోటు బలమైన గాలులు వీయడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కడపకు చెందిన శ్రీధర్, మచిలీపట్నానికి చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ మృతిచెందారు .మృతుల కుటుంబాలకు తక్షణమే సహాయం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. ప్రమాదం జరిగినప్పటి నుంచి ప్రభుత్వం తరపున సిఎం చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎపి ఎన్నార్టీ అధికారులు ఎప్పటికప్పుడు ఇండియన్ ఎంబసీ, వియత్నాం ఎంబసీ అధికారులతో మాట్లాడుతూ ప్రమాదం నుంచి బయటపడిన వారిని ఇండియాకు >>2

## దాతల విరాళాల నిబంధనల్లో

# టిటిడి మార్పులు

### వేద పారాయణ పథకం కింద 791 మంది వేదపండితులు

### ఒంటిమిట్టలో రూ. 17.84 కోట్లతో 100 గదుల నిర్మాణం

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ ట్రస్టులు, పథాకలకు విరాళాలిచ్చే దాతలకు కల్పిస్తున్న నిబంధనల్లో పలుమార్పులు చేశారు. ఇదివరకు లక్షరూపాయలు ఇచ్చే దాతలు ఇకపై రెండులక్షల రూపాయలు విరాళాలిస్తే వారికి కల్పించే సదుపాయాలను వివరించారు. విరాళాల నిర్వహణలో మరింత పారదర్శకత, ఏకరీతి (యూనిఫార్మిటీ) తీసుకురావడానికి టిటిడికి చెందిన అన్ని ట్రస్టులు, పథకాలకు విరాళాలుఅందించే దాతలకు కల్పించే సదుపాయాల్లో పలు మార్పులు చేపట్టారు. ఈ కొత్త నిబంధనలు మంగళవారం అర్థరాత్రి నుండి అమలులోకి వచ్చాయి. ఇప్పటికే వివిధ ట్రస్టులు, పథకాలకు విరాళాలందించిన దాతలకు ప్రస్తుతం అమలవుతున్న సదుపాయాలు యథావిధిగా కొనసాగుతాయి. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం టిటిడి ధర్మకర్తల మండలి సమావేశంజరిగింది. సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో నిర్ణయించిన పలు అంశాలు, ఆమోదించిన విషయాలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితో కలిసి మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ నాయుడు



మంగళవారం జరిగిన సమావేశంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర,అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి

మాట్లాడుతూ 6.31 కోట్ల రూపాయలతో తిరుమలలో ఎస్ఎస్‌డి టోకెన్లు కలిగిన భక్తులు వేచి ఉండేందుకు ఆళ్వార్ ట్యాంక్ సమీపంలో శాశ్వత షెల్టర్లు, క్యూలైన్లు, మరుగుదొడ్లు నిర్మించేందుకు టెండర్లు ఆమోదించారు. తిరుమలలో కుమారధార, పసుపుధార డ్యామ్‌లు మరింత పటిష్టంగా ఉండేందుకు డబుల్ లేన్ వంతెననిర్మాణానికి 2.77కోట్లుమంజూరు చేయడానికి ఆమోదం తెలిపారు. హరితశక్తి అభివృద్ధి చేయడంలో భాగంగా జిఎన్‌సి సమీ >>2

## తృతీయ భాష

# అసెస్‌మెంట్ తప్పనిసరి

### నిబంధనల్లో మార్పులు చేసిన సిబిఎస్ఇ

**విజయవాడ, జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** సిబిఎస్ఇ 9, 10 బోర్డు పరీక్షల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 కింద 9,10 తరగతుల విద్యార్థులకు మూడో భాషనుతప్పనిసరి క్వాలిఫైయింగ్ సబ్జెక్టుగా మార్చింది. 2027-28వ సంవత్సరం 10వ తరగతి బోర్డు పరీక్షల్లో మూడో భాష (థర్డ్ లాంగ్వేజ్) భాగం కాదని, అయితే ఇంటర్నల్ అసెస్‌మెంట్ మాత్రం తప్పనిసరిగా ఉంటుందని స్పష్టం చేసింది. పదో తరగతి సర్టిఫికెట్ పొందాలంటే ఈ థర్డ్ లాంగ్వేజ్ ఇంటర్నల్ అసెస్ మెంట్ పరీక్ష పాస్ కావడం తప్పనిసరి అని తేల్చిచెప్పింది. విద్యార్థులు ఎంచుకునే మూడు భాషల్లో రెండు కచ్చితంగా భారతీయ భాషలు అయ్యుండాలని స్పష్టం చేసింది.జులై 10న జారీ చేసిన సిబిఎస్ఇ సర్క్యులర్ ప్రకారం, 2027- 28 విద్యా సంవత్సరం నుంచి 10 తరగతి విద్యార్థులు 'థర్డ్ లాంగ్వేజ్‌పై స్కూల్లో అంతర్గతంగా నిర్వహించే అసెస్‌మెంట్‌లో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలి. ఒక వేళ ఎవరైనా విద్యార్థి ఈ ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లో ఉత్తీర్ణత సాధించకపోతే, అతనికి టెన్త్ పాస్ సర్టిఫికెట్ ఇవ్వరు. అందుకే బోర్డు పరీక్షల తుది ఫలితాలు ప్రకటించడానికి ముందే, పాఠశాలలు రీఅసెస్మెంట్ నిర్వహించాల్సి ఉంటుందని సిబిఎస్ఇ తెలిపింది. ఒకవేళ దీనిలో కూడా ఉత్తీర్ణత సాధించకపోతే, టెన్త్ క్లాస్ పాస్ సర్టిఫికెట్ ఇస్తారా, ఇవ్వరా అనే విషయంపై సీబీఎస్ ఈ క్లారిటీ ఇవ్వలేదు. అలాగే విద్యార్థుల ఫలితాలను తాత్కాలికంగా నిలిపి ఉంచుతారా? అనేది కూడా చెప్పలేదు. మొత్తంగా చూసుకుంటే, బోర్డు పరీక్షల్లో థర్డ్ లాంగ్వేజ్ పై పరీక్ష పెట్టనప్పటికీ, అంతర్గత మూల్యాంకనంలో ఉత్తీర్ణత సాధించడం సిబిఎస్ఇ తప్పనిసరి చేసింది. సిబిఎస్ఇ సర్క్యులర్ ప్రకారం, 2026-27 విద్యా సంవత్సరం నుంచి 6వ తరగతి నుంచి 'త్రిభాషా సూత్రం' అమలు చేస్తారు. విద్యార్థులు కనీసం రెండు భారతీయ భాషలను కచ్చితంగా నేర్చుకోవాలి. 7,8,9వ తరగతి విద్యార్థులు ఇంగ్లీష్‌తో పాటు అదనంగా మరో విదేశీ భాషను ఎంచుకోవచ్చు. గతంలో విద్యార్థులు 8వ తరగతి తర్వాత మూడో భాషను వదిలేసేవారు. తాజా విద్యా విధానంలో దీనిని పూర్తిగా మార్చేశారు. 9, 10వ తరగతి విద్యార్థులు కూడా మూడో భాష చదవడం తప్పనిసరి చేశారు. అయితే 202627 బోర్డు పరీక్షలకు హాజరయ్యే 10వ తరగతి బ్యాచ్‌పై ఈ మార్పుల ప్రభావం ఉండదు.ఇక 9వ తరగతి విద్యార్థులు మూడో భాష అసెస్‌మెంట్‌లో ఫెయిల్ అయినప్పటికీ, వారిని 10వ తరగతికి ప్రమోట్ చేస్తారు. వారు టెన్త్ క్లాస్ చదువుతూనే, తమ 9వ తరగతి పెండింగ్ అసెస్‌మెంట్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది.

## మహిళా డాక్టర్‌కు అంతర్జాతీయ గుర్తింపు

### ప్రపంచ పక్షవాత సంస్థ పాలక మండలికి డా. పి విజయ ఎన్నిక



**గుంటూరు మెడికల్, జులై 14 ప్రభాతవార్త :** భారతదేశంలో పక్షవాత వైద్యరంగ అభివృద్ధికి విశేష కృషి చేసి వేలాది మంది రోగులకు ప్రాణ దాతగా నిలిచిన గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్టు, లలిత పి.వి.ఎస్ వైద్య విజ్ఞాన సంస్థ న్యూరోసైన్సెస్ విభాగాధిపతి, అంకినీడు అధునాతన పక్షవాత చికిత్స కేంద్రం సంచాలకురాలు డాక్టర్ పి. విజయకు అత్యున్నత అంతర్జాతీయ గౌరవం లభించింది. ప్రపంచ పక్షవాత సంస్థ పాలక మండలి సభ్యురాలిగా ఆమె ఎన్నిక కావడం దేశ వైద్యరంగానికే గర్వకారణంగా నిలిచింది. ప్రపంచంలోని 95 దేశాలకు చెందిన 3,500 మంది సభ్యుల ఓట్లతో ఎన్నికైన 18 మంది పాలక మండలి సభ్యుల్లో >>2

## ఇండో-బ్రిటన్ వాణిజ్య ఒప్పందం

# నేటినుంచే అమలు

### కార్లు, మద్యం, వెండి దిగుమతులపై సుంకాల తగ్గింపు

**న్యూఢిల్లీ,జులై 14:** భారత్-బ్రిటన్‌ల మధ్య పలుమార్లు జరిగిన చర్చల అనంతరం గత ఏడాది జూలై 25న కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం బుధవారం నుంచి అమల్లోకి రానుంది. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో అమల్లోకి వస్తున్న ఆరో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్టీఏ) ఇదే. అంతకుముందు మారిషస్, యూఏఈ, ఆస్ట్రేలియా, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్, ఒమన్‌లతో ఇలాంటి ఒప్పందాలను భారత్ అమలు చేసింది. గత కొన్నేళ్లలో భారత్ కుదుర్చుకున్న అతిపెద్ద వాణిజ్య ఒప్పందాల్లో ఒకటైన సీఈటీఏ ద్వారా భారత ఎగుమతుల్లో దాదాపు 99 శాతం ఉత్పత్తులకు యూకే మార్కెట్లో సుంకం లేకుండా ప్రవేశం లభించనుంది. దీంతో భారత పరిశ్రమలు, ఎగుమతిదారులు, వినియోగదారులకు గణనీయమైన ప్రయోజనాలు కలగనున్నాయి.

ఈ ఒప్పందం వల్ల, రెడీమేడ్ దుస్తులు, పాదరక్షలు, కార్పెట్లు, ప్రాసెస్డ్ ఫుడ్, ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు, చేపలు, మాంసం, ఇతర ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తులు వంటి శ్రమాధారిత రంగాల ఉత్పత్తులు ఇకపై యూకే మార్కెట్లో సున్నా సుంకంతో ప్రవేశించనున్నాయి. ప్రస్తుతం వీటిపై 4 నుంచి 16 శాతం వరకు దిగుమతి సుంకం అమలులో ఉంది. అదేవిధంగా ఆటోమొబైల్స్, మోటారు సైకిళ్లు, విడిభాగాలు, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్, మెటల్ ఉత్పత్తులు, సిరామిక్స్, గాజు, రాయి, సిమెంట్ ఉత్పత్తుల రంగాలకు కూడా ఈ ఒప్పందం ద్వారా కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. మరోవైపు యూకే నుంచి దిగుమతి అయ్యే సాల్మన్ చేపలు, గొర్రె మాంసం,యంత్రాలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, చాక్లెట్లు, శీతల పానీయాలు, సౌందర్య సాధనాలు, సబ్బులు, సుగంధ ద్రవ్యాలు, షేవింగ్ క్రీములు, నెయిల్ పాలిష్ వంటి ఉత్పత్తులపై సుంకాలు తగ్గడం వల్ల భారత మార్కెట్లో వీటి ధరలు తగ్గే అవకాశం ఉంది. యుకె నుంచి భారత్ దిగుమతి చేసుకునే అతిపెద్ద ఉత్పత్తి అయిన వెండిపై దిగుమతి సుంకాన్ని పదేళ్లలో పూర్తిగా సున్నాకు తీసుకురానుంది. యూకేలో తయారైన పూర్తిస్థాయి కార్లు, ట్రక్కులపై భారత్‌భారీగా దిగుమతి సుంకాలను తగ్గించేందుకు అంగీకరించింది.

## రూ. కోటి బంగారం మాయం!

### కాకినాడలోని బ్యాంక్‌లో భారీ గోల్‌మాల్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 14 ప్రభాతవార్త:** కాకినాడ నగరంలోని ప్రభుత్వ సర్వజన హాస్పటల్ ప్రాంగణంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో భారీ ఎత్తున గోల్ మాల్ జరిగింది. బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టిన ఖాతాదారులను మోసం చేస్తూ దాదాపు రూ. కోటి విలువైన అసలు బంగారాన్ని మాయం చేసి, వాటి స్థానంలో నకిలీ నగలను ఉంచినట్లు తేలింది. బ్యాంకు గోల్డ్‌అప్రైజర్‌గా పనిచేస్తున్న నవర సూరి బాబు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు.సాధారణంగా ఖాతాదారులు తెచ్చిన బంగారాన్ని పరీక్షి ంచి, మేనే జర్ సమక్షంలో లాకర్‌లో భద్రపరచడం అప్రైజర్ సూరిబాబు విధి. అయితే, ఇటీవల కొంతమంది ఖాతాదారులు తమ రుణాలు చెల్లించి బంగారం వెనక్కి తీసుకునేందుకు రాగా, సూరిబాబు పొంతనలేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేశాడు. దీనితో అనుమానం వచ్చిన ఖాతాదారులు అతడిని గట్టిగా నిలదీశారు. రికార్డుల ప్రకారం ఉండాల్సిన 789 గ్రాముల బంగారానికి బదులుగా కేవలం 589 గ్రాముల బంగారమే ఉంది. అంతేకాకుండా, లాకర్‌లో ఉన్న ఆ ఆభరణాలు కూడా నకిలీవని తేలింది.

## హత్యకేసు నిందితుడు కుటుంబంతో ఆత్మహత్య

### సింగరాయకొండ స్టేషన్‌లో విషాద ఘటన

### భార్య, ఇద్దరు చిన్నారులతో కలిసి హరికృష్ణ బలవన్మరణం

### బావ శ్రీహరి హత్యకేసులో హరికృష్ణ ప్రధాన నిందితుడు

**సింగరాయకొండ / బుచ్చి (నెల్లూరు) జులై 14, ప్రభాత వార్త :** సింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో హృదయ విదారక ఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన భార్యాభర్తలు, ఇద్దరు చిన్నారులు గూడ్స్ రైలు కిందపడి మృతి చెందారు. మృతులు నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలం ఆర్.ఎన్. కండ్రిగ గ్రామానికి చెందిన కుడుముల హరికృష్ణ (32), అతని భార్య ప్రణిత (30), కుమారుడు కౌనిక్ కృష్ణ (3), కుమార్తె మూగాంబిక (5)గా గుర్తించారు.పోలీసుల వివరాల ప్రకారం నెల్లూరు జిల్లా తోట పల్లి గూడూరు మండలం ఆర్.ఎన్ కండ్రిగ గ్రామానికి చెందిన కుడుముల హరికృష్ణ కుటుంబ సభ్యులు భార్య ప్రణిత, ఇద్దరుపిల్లలతో కలిసి మంగళవారం మధ్యాహ్నం సింగరాయకొండ రైల్వేస్టేషన్ తూర్పువైపు రెండో ప్లాట్‌ఫారంపై కొంతసేపు ఉన్నారు. అనం >>2



హరికృష్ణ ప్రణిత మూగాంబిక కౌనిక్ కృష్ణ

# రాష్ట్రంలో 'సర్' పొడిగింపు

**విజయవాడ. జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం(సర్)కు భారత ఎన్నికల సంఘం గడువును పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ సందీప్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఒలు) ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని జులై 24 వరకు కొనసాగించనున్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా జులై 24లోపు పూర్తి చేయాలని నిర్ణయించారు.
ఓటర్ల ముసాయిదా జాబితాను జులై 31న ప్రచురించనున్నారు. అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ చేపట్టనున్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ జులై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు కొనసాగుతుంది. అనంతరం అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. సవరించిన షెడ్యూల్‌ను అన్ని అధికారులకు తెలియజేయడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. రాజకీయ పార్టీలకు కూడా ఈ మార్పులను లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించింది.

# మార్పులకు కమిటీ

>> గవర్నెన్స్ అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సిఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులు సరైన నాయకత్వం అందిస్తేనే చిట్టచివరి వ్యక్తి వరకూ పాలనా ఫలితాలు అందుతాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో మెరుగైన ఫలితాలు అందేలా నిర్ణయాలు ఉండాలని సిఎం సూచించారు. దేవాదాయశాఖలో ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మికతను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాల్లో విస్తృతమైన పొటెన్షియల్ ఉందని .. సరైన ప్రణాళిక ద్వారా వీటిని గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సూచనలు ఇచ్చారు. ఈ దేవాలయాలను ఆనుకుని ఆర్థిక కార్యకలాపాలు విస్తృతంగా పెరగాలన్నారు. పర్యాటక కార్యకలాపాలు పెరిగేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇక నుంచి అన్ని ఫిర్యాదులకు సంబంధించి క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ అర్జీదారుకూ తగిన సమాధానం కూడా ఇవ్వాలని సిఎం సూచించారు. అగ్నిమాపక శాఖలో సేవల ప్రమాణాల్ని పెంచాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యూరియా సరఫరాపై రైతు సంఘాలు, ఆర్ఎస్‌కేల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని... యూరియా దుర్వినియోగం కాకుండా చూడాలని సిఎం ఆదేశాలు జారీ చేశారు.

**మానవీయ కోణంలో అర్జీల పరిష్కారం**

క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, అధికారులు తప్పుచేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని.. దీన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని సిఎం సూచించారు. అన్నిబస్టాండ్‌లలోనూ ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. బస్సులు ఖచ్చితమైన సమయానికి వచ్చే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సిఎం సూచించారు.

# మహిళా డాక్టర్‌కు అంతర్జాతీయ గుర్తింపు

>> డాక్టర్ విజయ స్థానం దక్కించుకోవడం ఆమె ప్రతిభకు నిదర్శనం. ఆసియా-ఓషియానియా ప్రాంతానికి భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఆమెకు లభించింది. పక్షవాత వైద్యానికి జీవితాన్నే అంకితం చేసిన వైద్యురాలు పక్షవాతానికి అత్యాధునిక చికిత్సలు అందించడం, శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వైద్యవిధానాల రూపకల్పనలో విశేష కృషి చేసినందుకే ప్రపంచ పక్షవాతసంస్థ ఈ అత్యున్నత బాధ్యతలను డాక్టర్ విజయకు అప్పగించింది. భారతదేశంలో ఆధునిక పక్షవాత చికిత్సకు శ్రీకారం చుట్టిన వైద్యుల్లో డాక్టర్ విజయ అగ్రగణ్యులు. 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి పక్షవాత ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించి చరిత్ర సృష్టించారు. ముంబై, చెన్నై తర్వాత దేశంలో ఏర్పాటైన మూడో ప్రత్యేక పక్షవాత కేంద్రం ఇదే కావడం విశేషం. ఆమె నాయకత్వంలో ఈ కేంద్రం దేశంలోనే తొలి గుర్తింపు పొందిన అధునాతన పక్షవాత చికిత్స కేంద్రంగా నిలిచింది.

# బోటు ప్రమాద మృతదేహాలు

>> తీసుకువచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇక ముగ్గురు పర్యాటకుల మృతదేహాలకు ముంబై విమానాశ్రయంలో అన్ని రకాల చట్టపరమైన లాంఛనాలను వేగంగా పూర్తి చేసి, భౌతికకాయాలను నేరుగా శంషాబాద్‌కు తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం రాత్రి 8 గంటలకే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని రాత్రంతా ఆయన అక్కడే ఉండి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పడంతో పాటు విమానాశ్రయానికి వచ్చిన భౌతికాయాలను దగ్గరుండి కిందకు దింపించి.. వారి స్వగ్రామాలకు పంపే ఏర్పాట్లు పర్యవేక్షించారు. బాధితులను పరామర్శించి, ప్రభుత్వంవారికి అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. బాధితులనుంచి పూర్తివివరాలు, వారి కుటుంబనేపథ్యం వివరాలు అడిగి మంత్రి తెలుసుకున్నారు.

# 55 లక్షలకు పెంచుతాం

>> ఎస్ఐపిబి సమావేశాలు, 57 కేబినెట్ సమావేశాలు నిర్వహించామన్నారు. గత పాలనలో ఎపిపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం పోయిందన్నారు. కానీ ఆ పరిస్థితిని పునరుద్ధరించామని.. మళ్లీ ఎపి మోస్ట్ ప్రిఫర్డ్ డెస్టినేషన్‌గా అవతరించిందని వెల్లడించారు. పెద్దఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని.. తద్వారా ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయన్నారు. వనరుల్ని సమర్థంగా వినియోగించుకోవాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. యేళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాం. శెట్టిపల్లిలో 60, 70 యేళ్లుగా ఉన్న భూసమస్య పరిష్కరించాం. ప్రాపర్టీని అన్‌లాక్ చేస్తే ప్రభుత్వానికి 90 ఎకరాల భూమి వచ్చింది. వట్టిచెరుకూరులో ఎప్పుడో కట్టుకున్న ఇళ్లకు పట్టాలు ఇచ్చాం. సమస్యలను విభాగాల వారీగా విభజించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొన్ని విభాగాల్లో స్థిరంగా, మరికొన్ని విభాగాల్లో అనూహ్య వృద్ధి. లక్ష్యాల మేరకు ముందుకెళ్తే 15 శాతం వృద్ధిరేటు సాధ్యమవుతుంది. స్థిరమైన ఆర్థిక వ్యవస్థ కోసం రెవెన్యూ రిసిప్ట్స్ చాలా ముఖ్యం. ఈ ఏడాదిలో జిఎస్డీపీ 20.4 శాతంగా నమోదైంది. కొందరు వ్యక్తులు కీలక విభాగాల్లో నెగెటివ్ రోల్ చేస్తే ఇబ్బంది వస్తుంది. రాబోయే రోజుల్లో కేపిఐ ఇండికేటర్ల ద్వారా నెలవారీ ఆర్థిక నివేదిక తయారీ. మంత్రులు, కార్యదర్శులు, హెచ్ఒడిల క్షేత్రపర్యటనపై షెడ్యూల్ ఇచ్చాం. క్షేత్రస్థాయికి వెళ్లాలంటే ఎవరికీ ఆసక్తి ఉండదు నాతో సహా. క్షేత్రస్థాయికి వెళ్తే మాత్రం చాలా సంతృప్తి ఉంటుంది. క్షేత్రస్థాయిలోకి వెళ్తేనే వాస్తవాలు తెలుస్తాయని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. వ్యవసాయాధారిత రాష్ట్రంగా ఉన్న ఎపిని పారిశ్రామికంగానూ అగ్రగామిగా నిలబెట్టాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. రాయలసీమలో ఉద్యాన పంటలు, ఖనిజ వనరులు, కోస్తా జిల్లాల్లో ఆక్వా ఇలా వేర్వేరు రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్, సిలికా, చీమకుర్తి గ్రానైట్ సహా విలువైన వనరులకు వాల్యూ అడిషన్ చేసేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఇన్నోవేషన్ ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉందన్నారు. టెక్నాలజీ, వనరులు, నాలెడ్జి మన వద్ద ఉంది. దానిని అందిపుచ్చుకునే నాయకత్వం మనకు కావాలి అని పేర్కొన్నారు. పాలసీలు తీసుకురావటం సులభమే అయినా వాటిని అమలు చేయటమే అత్యంత కీలకమని చెప్పుకొచ్చారు. ఇక నుంచి నెల వారీ ఆర్థిక నివేదికల ద్వారా ముందుకు వెళ్లాలని నిర్ణయించామన్నారు. ప్రతి నెలా ఒకసారి కార్యదర్శులు, హెచ్‌వోడీల సమావేశం నిర్వహించుకోవటం ద్వారా పురోగతిని సమీక్షించుకుందామని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
సీఎం చంద్రబాబు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రజల సమస్యలు, వాస్తవాలు తెలియాలంటే క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే అన్నారు.డేటా డ్రివెన్ గవర్నెన్స్ ద్వారా రియల్ టైమ్ రిజల్ట్స్‌కు నాంది పలకాలని ఆకాంక్షిస్తున్నాన్నారు. పిజిఆర్ఎస్‌లో జీరో పెండెన్సీ అనేది లక్ష్యం కావాలని అన్ని శాఖలకూ నిర్దేశిస్తున్నాను అన్నారు.మూడో యేడాదిలోకి అడుగు పెట్టినా విద్యుత్ ఛార్జీలను పెంచలేదు అన్నారు.ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని చెప్పాం. దానిని నిలబెట్టుకున్నాం అన్నారు.ఇదే సమయంలో ట్రూ డౌన్‌ను కూడా అమలు చేసి ఛార్జీలు తగ్గించాం అన్నారు.పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం తగ్గించేలా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం అన్నారు. ఇండక్షన్ స్టవ్‌ల వినియోగంతో పాటు సౌర విద్యుత్ ఉత్పత్తిపైనా దృష్టి సారించాలి అన్నారు.వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలి అన్నారు.పట్టిసీమ కారణంగా గోదావరి నుంచి కృష్ణా డెల్టాకు నీరు అందించగలుగుతున్నాం అన్నారు.రాష్ట్రంలో చేపట్టిన జలసంరక్షణ చర్యలు ఫలితాలు ఇస్తున్నాయి అన్నారు. వీటిని మరింత ముందుకు తీసుకెళ్లాలి గుడ్ ఆఫీసర్ సాల్వ్స్ ప్రాబ్లమ్స్ ఏ గ్రేట్ ఆఫీసర్ ప్రివెంట్స్ దెమ్ అనే కోణంలో అంతా పనిచేయాలిముందుచూపుతో అంతా పనిచేస్తేనే మెరుగైన పాలనను, ఫలితాలను ప్రజలకు అందించగలం అన్నారు.2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం అన్నారు.ఆగస్టు 14 తేదీన అనకాపల్లికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తాంసెప్టెంబరు 1 తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను కూడా జాతికి అంకితం చేస్తాంరాష్ట్రంలోని 36 సాగునీటి ప్రాజెక్టులను కూడా ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తున్నాంకేంద్ర ప్రాయోజిత పథకాలన్నిటినీ పునరుద్ధరించాం.జల్ జీవన్ మిషన్ పథకాన్ని కూడా గరిష్టంగా వినియోగించుకోవాలి అన్నారుప్రతీ నెలా జరిగే మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ఆధారంగా ఎప్పటికప్పుడు పాలన సమీక్షించుకుని ముందుకు వెళ్దాం.జిఎస్డీపీలో 10.75 శాతం వృద్ధి నమోదు చేయగలిగాం. 15 శాతం లక్ష్యాన్ని చేరుకునేలా పనిచేయాలి

**2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం**

'స్వర్ణాంధ్ర 2047' విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 2047 నాటికి రాష్ట్ర జిఎస్డీపీని ..308 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని ..55 లక్షలకు పెంచేందుకు, ఏటా 15 శాతం కంటే అధిక ఆర్థిక వృద్ధి సాధించే దిశగా కార్యాచరణ కొనసాగుతోందన్నారు. ఈ లక్ష్యాల అమలును పర్యవేక్షించేందుకు 30 సచివాలయ శాఖలు, 87 విభాగాల పరిధిలో 651 కీలక పనితీరు సూచికలు రూపొందించి డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.
రాష్ట్ర ఆర్థిక పనితీరును వివరిస్తూ, 2025-26లో ఆంధ్రప్రదేశ్ 9.9 శాతం వృద్ధి నమోదు చేసి, జాతీయ సగటు 7.4 శాతాన్ని అధిగమించిందని తెలిపారు. అయితే మే2026 నాటికి రాష్ట్ర ద్రవ్యోల్బణం 4.9 శాతంగా నమోదవగా, గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ద్రవ్యోల్బణం 6.91 శాతానికి చేరడం సవాలుగా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో ఖరీఫ్ ఆహార ధాన్యాల ఉత్పత్తి 39.8 శాతం పెరిగి 1.23 కోట్ల మెట్రిక్ టన్నులకు చేరడం, తోటపంటలు, పశుసంవర్ధక, ఆక్వా రంగాలు పురోగతి సాధించడం సానుకూల పరిణామాలని పేర్కొన్నారు. నూనె గింజలు, మిర్చి-పసుపు, ఇన్‌లాండ్ చేపల ఉత్పత్తిలో తగ్గుదలపై ప్రత్యేక దృష్టి అవసరమని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీ సాయిప్రసాద్,ప్రణాళికా శాఖ కార్యదర్శి పియూష్‌కుమార్, మంత్రులు అనగాని సత్యప్రసాద్,పయ్యావుల కేశవ్, నారా లోకేష్,వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం ముంబయిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో మంత్రి కందుల దుర్గేష్

# ముంబయిలో డి.సిఎం పవన్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ, జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ముంబయిలో పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో కోలుకుంటున్న డిప్యూటీ సిఎంను మంత్రి దుర్గేష్ స్వయంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. జనసేనాని కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జనసేనాని పవన్ కల్యాణ్ చాలా వేగంగా కోలుకుంటున్నారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు ఆయనకు ప్రస్తుతం తగిన విశ్రాంతిఅవసరమని, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను కలిసిన వారిలో మంత్రి దుర్గేష్‌తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

# శ్రీవారి హారతుల నిబంధనలపై కర్ణాటక సిఎం డికె జోక్యం మంచిదికాదు

## ఆయనకు అవగాహన కల్పించేలా చూస్తాం: టిటిడి బోర్డు సమావేశం నిర్ణయం

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి వేకువజామున తోమాల, అర్చన సేవల తరువాత పారంపర్యంగా నిర్వహించే హారతుల నిబంధనలపై కర్ణాటక సిఎం డికె శివకుమార్ చేసిన సంచలన వ్యాఖ్యలపై టిటిడి బోర్డు కూలంకుషంగా చర్చించింది. మంగళవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో జరిగిన టిటిడి బోర్డు సమావేశంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డుసభ్యులు ఈ అంశంపై తీవ్రస్థాయిలో చర్చించారు..అందరూ ఒకే అంశంపై ముక్తకంఠంతో తీర్మానం చేశారు. తిరుమల ఆలయంలో దేవదేవునికి ఇచ్చే నిత్య హారతుల్లో పూర్వం మైసూరు మహారాజు శ్రీవారికి చేసిన సేవలు, అందించిన కానుకలకు గుర్తింపుగా ఆ మైసూరు మహారాజు కుటుంబానికి ,పలు మఠాలు, మైసూరు సంస్థానం తరపున హారతులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం తొలి గంట నైవేద్యసమయంలో స్వామివారికి 21నిత్యహారతులు ఇస్తారు. 20 మఠాలతో బాటు మైసూరు సంస్థానం తరపున ప్రతినిధులు హారతి పళ్లెం, నైవేద్యాలుతో ఆలయంలోనికి వెళ్తారు. ఆలయంలోపల టిటిడి అర్చకులు హారతి పళ్లెంను శ్రీవారికి సమర్పించి తిరిగి దాన్ని వారికే అందజేస్తారు. అయితే ఈ భక్తిపరంపరలో ఆయా సంస్థాన ప్రతినిధులు తప్ప మరెవరూ బయటి వ్యక్తులుగానీ, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రులు, గవర్నర్లు పాల్గొనడానికి లేదు. ప్రతి నెలా ఉత్తరాభాద్ర నక్షత్రంరోజు, దీపావళి, ఉగాది ఆస్థానం, ఆణివార ఆస్థానం పర్వదినాల్లో మైసూరు మహారాజు పేరున ప్రత్యేక హారతి ఉంటుంది. మైసూరుమహారాజు తరపున కర్ణాటకకు ప్రాతినిధ్యం ఉంది. అయితే తాజాగా ఈ వైదిక అంశంపై కర్ణాటక సిఎం డికె శివకుమార్ అవగాహన లేకుండా చేసిన వ్యాఖ్యలుతో పెద్ద దుమారం రేగింది. దీనిపై మంగళవారం బోర్డులో కూడా చర్చకు వచ్చింది. సిఎం శివ కుమార్ తిరుమల ఆలయ వైదిక సంప్రదాయాలు, కార్యక్రమాలపై జోక్యం చేసుకుని,నిబంధనలపై అవగాహన లేకుండా మాట్లాడటం మంచిదికాదని, దీనిపై ఒక లేఖ ద్వారా ఆయనకు పూర్తి వివరాలను తెలియజేయనున్నట్లు బోర్డు నిర్ణయించిందని ఛైర్మన్ నాయుడు తెలిపారు. కర్నాటక సిఎం చేసిన వ్యాఖ్యలతో ఇంతటితో వివాదం ముగిసినట్లేనని తెలుస్తోంది.

# కాపు ఉద్యమ శిఖరం ముద్రగడ ఇక లేరు

>> ఆసుపత్రి వర్గాలు ధృవీకరించాయి.

**ముద్రగడ ప్రస్థానం...**

1953 జనవరి 22న తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో రాజకీయ కుటుంబంలో ముద్రగడ పద్మనాభం జన్మించారు. ఆయన తండ్రి వీర రాఘవరావు ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి రెండుసార్లు స్వతంత్ర ఎమ్మెల్యేగా పనిచేశారు.తండ్రి మరణానంతరం మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి సూచనతో ముద్రగడ రాజకీయాల్లోకి అడుగుపెట్టి 1978లో జనతా పార్టీ తరఫున ప్రత్తిపాడు నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైయ్యారు.అనంతరం 1982లో తెలుగుదేశం పార్టీలో చేరి, ప్రత్తిపాడు నుండి గెలిచి ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా సేవలు అందించారు.1989 వరకు తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో నాలుగు సార్లు శాసనసభ్యుడిగా, రెండు సార్లు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1999-2004 మధ్య కాకినాడ నియోజకవర్గం నుండి ఎంపీగా పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. ఎన్నికల ముందు 2024 మార్చిలో ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.
1988లో ఉత్తరకొంచి సంఘటనలోనూ తన అనుచరులు బాసటగా న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌లో కేసులు వ్యతిరేకిస్తూ ఉద్యమం నడిపారు రోజులు గడుస్తున్నా స్పందించని పాలకులు తీరుకు నిరసిస్తూ అమరణ దీక్షకు ప్రకటించారు దీంతో దిగివచ్చిన పాలకులు కేసులు ఎత్తి వేశారు. దీనికి సంఘీభావం పలికిన కాపులతో కాపుల నేతగా మరింత బలపడ్డారు. కాపు రిజర్వేషన్ల పోరాట యోధుడుగా చరిత్రలో నిలిచిపోయే ముద్రగడ సామాజిక న్యాయం కోసం, ముఖ్యంగా కాపు సామాజిక వర్గ హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమ నేతగా ఆయన నిలిచిపోయారు.
ముద్రగడ పద్మనాభం పేరు వినపడగానే గుర్తుకు వచ్చేది కాపు ఉద్యమం. 1994 అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి పై కాపు సామాజిక వర్గ హక్కుల కోసంపోరాటం చేశారు.కాపులను వెనుకబడిన తరగతుల (బిసి) జాబితాలో చేర్చాలంటూ ఆయన దశాబ్దాల పాటు చేసిన ఉద్యమాలు, పాదయాత్రలు, తిరుపతి వరకు సైకిల్ ర్యాలీ,తన స్వగృహంలో ఆమరణ



మంగళవారం ముద్రగడ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపి రవిచంద్ర, పళ్లంరాజు తదితరులు

నిరాహార దీక్షలు చరిత్రలో నిలిచి పోయాయి. కిర్లంపూడి వేదికగా సాగిన కాపు ఉద్యమానికి ఆయనే ప్రధాన కేంద్రబిందువుగా నిలిచారు. పంతం పట్టుదలకు కూడా ఆయన పెట్టింది పేరు. అనుకున్న న్యాయం కోసం తన పదవులను సైతం తృణప్రాయంగా వదిలేసిన ఘనత ఆయనకే దక్కింది. యావత్ రాష్ట్రాన్ని తనవైపుచూసేలా అనేకసార్లు ఉద్యమాలు చేసిన ఆయన ఉద్యమ నేతగా పేరొందారు. ఎంతోమందికి ఉద్యోగ ఉపాధి కల్పించిన ముద్రగడ ఏ పని తలపెట్టిన ఓ ప్రత్యేకత ఉండేది. 2016లో తుని ప్రాంతంలో జరిగిన కాపు ఐక్య గర్జనలో జరిగిన హింసాత్మక సంఘటన తర్వాత ఉద్యమం మరో మలుపు తిరిగింది. ఇంతటి ఘన చరిత్ర కలిగి ముద్రగడ పద్మనాభం హఠాన్మరణం పట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు రాజకీయ నేతలు,వివిధ పార్టీల ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాపు సామాజిక వర్గానికి, ఏపీ రాజకీయాలకు ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ గాఢ సానుభూతిని తెలియజేశారు. ముద్రగడ పార్థివ దేహాన్ని బుధవారం ఆయన స్వగ్రామమైన కిర్లంపూడికి తరలించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కిర్లంపూడి మండలంలో వర్తక సంఘం స్వచ్ఛంద బందుకు పిలుపునిచ్చారు.

# విరాళాల నిబంధనల్లో టిటిడి మార్పులు

>> పంలో 800 కిలోవాట్ల విండ్ టర్బైన్ జనరేటర్‌ను విష్‌విండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విరాళంతో ఏర్పాటు చేసి, టిటిడికి 25 సంవత్సరాల పాటు నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు ముందుకు వచ్చారు. తిరుమల ఎస్వీ మ్యూజియంలో 12 యేళ్ల పైబడిన సందర్శకులకు 50 రూపాయలు ప్రవేశ రుసుముగా నిర్ణయించారు. మ్యూజియం నిర్వహణ బాధ్యతలను టాటా సంస్థకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. తిరుమలలో కాకులమాను తిప్ప సమీపంలోని 25 యేళ్లకు పైబడిన పాత ఘన వ్యర్థాలను బయో రిమీడియేషన్, బయోమైనింగ్ ద్వారా శాస్త్రీయంగా శుద్ధి చేయడానికి ఐదుకోట్లు మంజూరు చేయనున్నారు. భక్తుల భద్రత దృష్ట్యా తిరుమల, తిరుపతిలోని టిటిడి ఆలయాలు, విశ్రాంతి భవనాల్లో అగ్నిమాపక వ్యవస్థల సమగ్ర నిర్వహణకు 2.35 కోట్లతో నిర్వహణ పనులను నిరంతరాయంగా కొనసాగించాలని నిర్ణయించారు. తిరుమలలో టిబిసి, ఎటిసి విశ్రాంతి భవనాల వద్ద ఉన్న 12 పాత భవనాలను తొలగించి, వాటి స్థానంలో దాతల సహకారంతో నూతన భవనాలను నిర్మించేందుకు ఆమోదించారు. 2027వ సంవత్సరానికి సంబంధించి శ్రీవారి క్యాలెండర్లు, డైరీలు ముద్రించేందుకు టిటిడి పాలకమండలి నిర్ణయించింది. ఇందులో డైరీలు 10 లక్షలు, 12 పేజీల క్యాలెండర్లు 13.50 లక్షలు, 6 పేజీల క్యాలెండర్లు 75 వేలు ముద్రించేందుకు ఆమోదం తెలిపారు. తిరుమల ఆక్టోపస్ బేస్ క్యాంప్‌లో అదనపు మౌలిక సదుపాయాల కల్పనకు, ఎఫ్ఎంఎస్ సేవలకు 2.91 కోట్లు మంజూరు చేస్తూ నిర్ణయించారు.కడపజిల్లా ఒంటిమిట్ట సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి మూలవర్లకు బంగారు కవచాల తయారీకి టిటిడి ట్రెజరీలోని వెయ్యి గ్రాముల బంగారాన్ని వినియోగించుకునేందుకు నిర్ణయించారు. 17.84 కోట్లతో ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం వద్ద యాత్రికుల సౌకర్యార్థం వంద గదులతో విశ్రాంతి గృహం నిర్మాణానికి టెండర్లు ఆమోదించారు.
ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం ఈశాన్య మాడవీధి విస్తరణ, యాత్రికుల సౌకర్యాల అభివృద్ధి కోసం 6,103 చదరపు అడుగుల భూమి సేకరణ నిమిత్తం జిల్లా యంత్రాంగానికి 2.11 కోట్ల రూపాయలు చెల్లింపునకు బోర్డు ఆమోదించింది. టిటిడి వంటి ధార్మికసంస్థలో అథర్వణ వేదాలను నిరంతరాయంగా పారాయణం జరిగేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలలో కూడా నిత్య పారాయణం, లోక కల్యాణం జరిగేలా వేద పారాయణ స్కీం ద్వారా 791 మందిని సంభావన వేద పండితులుగా నియమించేందుకు నిర్ణయం తీసుకున్నారు.
హిందూ ధర్మ ప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల తదితర విభాగాల్లో సేవలందిస్తున్న కళాకారుల పారితోషికాన్ని ఆయా కళాకారుల నైపుణ్యాన్ని బట్టి పెంచేందుకు ఆమోదించారు.టిటిడి క్యాంటీన్ల విభాగంలో ఉన్న 65 సర్వర్ల పోస్టులను క్యాటరింగ్ సూపర్‌వైజర్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని తీర్మానించారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు, టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్, సివిఎస్ఒ మురళీకృష్ణ అధికారులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

15-07-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పునర్వసు కార్తె
పాడ్యమి ఉ.11.54
పుష్యమి రా.9.50
వర్జ్యం : ఉ.7.24-ఉ.8.51
దు. ఉ.11.47-మ.12.39
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** మీ లోని ప్రతిభాపాటవాలు వెలుగు చూసే దిశగా ప్రయాణం చేస్తారు. స్థలాలు కొనుగోలు యత్నాలు చేస్తారు.

**వృషభం:** ఆహార నియమాలు పాటించండి. ప్రకృతి వైద్యం మేలు చేస్తుంది. ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు.

**మిథునం:** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**కర్కాటకం :** డాక్యుమెంట్లు, ముద్రణా పరమైన రానిబాకీలు, రావలసిన సౌకర్యాలు, ధనప్రాప్తి ఇవి ఇబ్బందులకు గురిచేస్తాయి.

**సింహం:**విదేశాలలోని మీ సన్నిహితుల క్షేమ సమాచారం ప్రశాంతతకు కారణం అవుతుంది. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**కన్య :** శత్రు వర్గంలోని అనైక్యతనుగుర్తించి వారితో ముఖాముఖి పోరాడి లాభపడతారు. ఆహ్వానాలు అందుకుంటారు.

**తుల :** క్రమశిక్షణ పాటించడం వలన లాభపడతారు. ఒకానొక రహస్య సమాచారం తెలుసుకుంటారు.

**వృశ్చికం:** కోర్టుకేసుల నుండి బయటపడతారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి. బంధువుల కలయిక.

**ధనుస్సు:** పెదవి దాటడం వలన ఇబ్బందులను కొని తెచ్చుకోవడం అవుతుంది. జాగ్రత్త వహించండి.

**మకరం:** ఓర్పు, నేర్పులు మేలు చేస్తాయి. యుక్తితో సమస్యల వలయాల నుండి బయటపడతారు. వాహనసౌఖ్యం కలదు.

**కుంభం:** కార్యాలయంలో సెలవు కోసం మీరు చేసే యత్నాలు ఫలవంతం కాక పోవచ్చు. మధ్యవర్తిత్వాలు చేయకండి.

**మీనం :** బంధువుల నుండి మాట సహాయం అందుకుంటారు. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ముద్రగడ మృతికి సిఎం, డి.సిఎం సంతాపం

**విజయవాడ, జులై14,ప్రభాతవార్తప్రతినిధి:**మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు.మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంమరణవార్త విచారం కలిగించింది. పద్మనాభం కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను. అని చంద్రబాబు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ ఖాతాలో తన సంతాపాన్ని వెలిబుచ్చారు.
డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ ఖాతాలో తన సంతాపాన్ని తెలిపారు. ముద్రగడ ఆత్మకు శాంతి చేకూరాలి. మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం తుది శ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నాను. ముద్రగడ పద్మనాభం సతీమణికి, కుమారులకు, కుమార్తెకు, ఇతర కుటుంబ సభ్యులకు, వారి మద్దతుదారులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. అని తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

**ముద్రగడ మరణవార్తపై విచారం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్, మంత్రి నారా లోకేష్,బిజెపి మాధవ్**

ముద్రగడ పద్మనాభం మరణవార్తపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు విచారణ వ్యక్తం చేశారు. ముద్రగడ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముద్రగడ పద్మనాభం మృతిపట్ల మంత్రి లోకేశ్ సంతాపం వ్యక్తం చేశారు. ముద్రగడ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాజీ మంత్రి,.అవనిగడ్డ ఎంఎల్ఏ మండలి బుద్ధప్రసాద్, ప్రభుత్వ మాజీ విప్, జనసేన నేత సామినేని ఉదయభానులు ముద్రగడ మృతికి విచారం వ్యక్తం చేసారు. ముద్రగడ పద్మనాభం మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# కుటుంబంతో ఆత్మహత్య

>> తరం ఒంగోలు వైపు నుంచి వస్తున్న గూడ్స్ రైలు సమీపిస్తుండగా భార్యాభర్తలు ఇద్దరు చిన్నారులను ఎత్తుకుని పట్టాలపైకి వెళ్లడంతో నలుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సమాచారం అందుకున్న నెల్లూరు డీఎస్పీ మురళీధర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డియస్పీ తెలిపిన వివరాలు మేరకు గత నెలలో బుచ్చిరెడ్డిపాలెం వ్యవసాయ శాఖ అధికారి శ్రీహరి హత్య కేసులో కుడుముల హరికృష్ణ ప్రధాన నిందితుడుగా నిర్ధారణ కావడం, ఈ నెల 9న కేసు నమోదైన తర్వాత విచారణలో అతని పాత్ర నిర్ధారణ కావడంతో అప్పటి నుంచి పరారీలో ఉన్నట్లు తెలిపారు. అదే కేసులో ఏ2 నిందితుడు సోంపల్లి రవీంద్ర ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నట్లు చెప్పారు.ఏ3 నిందితుడును అరెస్ట్ చేయడం జరిగిందని, హత్యకు గురైన శ్రీహరి హరికృష్ణకు సొంత బావమరిది అని పోలీసులు తెలిపారు. కేసు నేపథ్యంలో ఏర్పడిన కుటుంబ పరిస్థితులు, తీవ్ర మనస్థాపం కారణంగానే ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చని ప్రాథమిక విచారణలో భావిస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.ఎఫ్ఎస్ఎల్ బృందం ఆధారాలు సేకరించిందని, పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించడం జరిగిందన్నారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు.ఈ విషాద ఘటనతో ఆర్.ఎన్. కండ్రిగ గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

**'శ్రీహరి హత్యలో సూత్రధారి హరికృష్ణ'**

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లు గ్రామానికి చెందిన వ్యవసాయాధికారి శ్రీహరి హత్యకేసులో ఎ-1 ముద్దాయి కుడుముల హరికృష్ణ,కుటుంబంతో సహా ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వేస్టేషనలో గూడ్సు రైలు కింద పడి దుర్మరణం చెందారు. హరికృష్ణ బావ వ్యవసాయాధికారి శ్రీహరిని పథకం ప్రకారం పెంచలకోనకు తీసుకొని వెళ్లి మార్గ మద్యంలో ఇద్దరుతో కలిసి హత్య చేసి దానిని గుండె పోటుతో మృతి చెందినట్లుగా చిత్రీకరించారు.అయితే వ్యవసాయాధికారి శ్రీహరి మొదటి బార్య జిల్లా ఎస్పి అజితా వెజండ్లకు ఫిర్యాదు చేయడంతో అసలు కథ బయటకు వచ్చింది. శ్రీహరిది గుండెపోటు మరణం కాదని ముమ్మాటికి హత్యేనని తేలింది. ఈహత్య చేయించింది. రెండో భార్య సోదరుడు కుడుముల హరికృష్ణ మరో ఇద్దరితో కలిసి చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇద్దర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఎ-1 ముద్దాయి హరికృష్ణ కోసం వేట ప్రారంభించారు. దీంతో హరికృష్ణ రెండు రోజుల క్రితం సోషల్ మీడియాలో తనకు ఏమి తెలియదంటు వీడియో విడుదల చేశాడు. నేను చనిపోతాను అని కూడా ఆవీడియోలో స్పష్టం చేశాడు. చెప్పిన విధంగానే హరికృష్ణ సింగరాయ కొండ రైల్వేస్టేషన్‌లో కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకొని మంగళవారం మృతి చెందారు. ఏపాపం తెలియని భార్యా బిడ్డల్ని కూడా బలి చేశాడని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## తిరుమల సమాచారం



## శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి ఆలయంలో శుక్రవారం సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వెలుపల టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర ,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరితో కలిసి ఈ మహాయజ్ఞంలో పాల్గొన్నారు. సంవత్సరంలో నాలుగుసార్లు ఉగాది, ఆణి వార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం నుండి ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి పూజలు నిర్వహించారు. భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో అష్టదళపాదపద్మారాధనసేవ రద్ద య్యింది. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, జెఇఒ డాక్టర్ ఏ.శరత్, సివిఎస్ఒ మురళీకృష్ణ, డిప్యూటీ ఇఒ లోకనాథం, బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## టిటిడి ట్రస్ట్‌లకు రూ.50 లక్షలు విరాళం

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** గుంటూరుకు చెందిన బృందా న్యూరో సెంటర్ మంగళవారం ఉదయం టిటిడి పథకాలకు భూరీ విరాళాలందించింది. వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు 10,00,116 లక్షలు, వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు 10,00,116, బర్డ్ ట్రస్టుకు 10,00,116 విరాళంగా అందించింది. ఆ సంస్థ అధినేతలు డాక్టర్ హనుమ శ్రీనివాస రెడ్డి, సిద్ధార్థలు శ్రీవారి ఆలయంలోని రంగ నాయకుల మం డపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు విరాళం డిడిలను అందజేశారు. అలాగే బెంగుళూరుకు చెందిన శ్రీపతి శ్రీనివాస్, కొటారు సునీల్ లు వేంకటే శ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 10,00,116 లక్షలు విరాళంగా అందించగా, విశాఖపట్నంకుచెందిన చాగర్లమూడి సీతారామయ్య బర్డ్ ట్రస్టుకు 10,00,116 లక్షలు రూపాయలు విరాళంగా అందించారు. దాతల తరఫున టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు శ్రీవారి ఆలయంలోని రంగనాయ కుల మండపంలో ఇఒ ముద్దాడ రవిచంద్రకు విరాళం డిడిలను అందజేశారు.



## రూ.60.61 లక్షలు విరాళాలు అందజేత

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** పలువురు దాతలు మంగళవారం రాత్రి టిటిడి ట్రస్ట్‌లకు భారీ విరాళాలిచ్చారు. ఎస్వీఅన్న ప్రసాదం ట్రస్ట్‌కు 60.61 లక్షలు విరాళంగా అందింది.విశాఖపట్నంకు చెందిన ఎస్ఎస్ఎన్ఆర్ ప్రోజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 10.50లక్షలు, విశ్వ సి.వి.చెరుకూరి భక్తుడు 10 లక్షలు, వంత ఇన్ ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 10 లక్షలు, వెర్టెక్స్ కౌం టీ ఎల్ఎల్పీ సంస్థ 10 లక్షలు, హైదరాబాద్ కు చెందిన సాయిలీల ఎలక్ట్రికల్ ప్రోజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 10 లక్షలు, అమరావతిలోని తుళ్లూరుకు చెందిన జొన్నలగడ్డ కిరణ్ కుమార్ 10,11,116 లక్షలు రూపాయలుయ విరాళంగా అందించారు. దాతల తరఫున టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు తిరుమలలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకు విరాళం డిడిలను అందజేశారు.ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి ్ర, జాస్తి పూర్ణ సాంబశివరావు, శాప్ చైర్మన్ రవి నాయుడు పాల్గొన్నారు.

## నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరానే లక్ష్యం

### రూఫ్ టాప్ సోలార్ పనులు వేగవంతం-విడియో కాన్ఫరెన్స్‌లో సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి, జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయాలనే లక్ష ్యంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి కోరారు. తిరుపతిలోని ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుండి మంగళవారం శివశంకర్ లోతేటి సంస్థ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, సత్వర సేవలతో అంతరాయం లేని విద్యుత్తును సరఫరా చేస్తూ వినియోగదారుల మన్నన పొందాలని సూచించారు. సంస్థ పరిధిలో ఎక్కడైనా ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతుకు గురైతే నిర్ణీత గడువులోగా ట్రాన్స్ ఫార్మర్లు అమర్చాలని ఆదేశించారు. ఈ అంశంలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులను సీనియారిటీ ప్రాతిపదికన మంజూరు చేయా లని, ఈ అంశంలో నిబంధనల్ని అతిక్రమిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద ఎస్సి, ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులకు రూఫ్ సోలార్ ఏర్పాటు పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఈ పనుల్లో సంబంధిత కాంట్రాక్టర్లు తగిన స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేసుకుని, నిర్ణీత గడువులోగా పనుల్ని పూర్తి చేయాలని కోరారు. ఈ పనులను సంబంధిత సర్కిల్ అధికారులు నిరంతరం పర్యవేక్షి ంచాలని సూచించారు. సంస్థ పరిధిలోని వివిధ సర్కిళ్ళలో చేపడుతున్న విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్ఎస్ఎస్) పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లతో సమీక్షి స్తూ పనుల్ని సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్(ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్(టెక్నికల్ హెచ్ఆర్డి) కె.గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్ (ఎఫ్ఎసి) కె. రామమోహన రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణాదేవి, ఆర్. పద్మ, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, ఎస్.రమణ, ఎం. మురళీ కుమార్, జనరల్ మేనేజర్లు జగదీష్, చక్రపాణి, లత, శ్రీకాంత్, సూపరింటెండింగ్ ఇంజనీర్లు శేషాద్రి శేఖర్, ప్రదీప్ కుమార్, సుధాకర్, రాఘవేంద్రం, చంద్రశేఖర్ రావు, సోమశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, మోజెస్, అమర్ బాబు, 9 సర్కిళ్ళ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, అకౌంట్స్ ఆఫీసర్లు, అసిస్టెంట్ అకౌంట్స్

## 'రా ఎన్టీఆర్'కు ఎలాంటి అధికారాలు లేవు

### ఆ పేరుతో కార్యకలాపాలు నిర్వహించకూడదు: జూ.ఎన్టీఆర్ కార్యాలయం

**విజయవాడ,జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** టాలీవుడ్ స్టార్ ఎన్టీఆర్ పేరుతో ప్రకటనలు చేస్తూ, కార్యక్రమాలు నిర్వహిస్తున్న రా ఎన్టీఆర్ (ఆర్ఎడబ్ల్యూ ఎన్‌టీఆర్) సంస్థకు ఎలాంటి అధికారం లేదని నటుడు నందమూరి తారక రామారావు కార్యాలయం స్పష్టం చేసింది. ఆయనకు సంబంధించిన సేవా, ప్రజా సంక్షేమ కార్యక్రమాల వివరాలు కేవలం వ్యక్తిగత లేదా ఆయన అధికారిక బృం దం ద్వారా మాత్రమే వెల్లడి అవుతాయని ఈ సందర్భంగా ప్రకటన చేసింది. ఆర్ఎడబ్ల్యూ ఎన్‌టీఆర్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఒక సంస్థ ఎన్టీఆర్‌తో సంబంధం ఉన్నట్లు ప్రజల్లో భావన కలిగించే విధంగా వ్యవహరిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఈ సందర్భంగా మేము ఒక విజ్ఞప్తి చేస్తున్నాం. ఎన్టీఆర్‌కి గాని, ఆయన కార్యాలయానికి 'రా ఎన్టీఆర్' అనే సంస్థతో లేదా వాటి కార్యకలాపాలతో ఏ విధమైన సంబంధం, అనుమతి, ప్రమేయం లేదు. సంబంధిత సంస్థకు ఎన్టీఆర్ తరపున ప్రాతినిధ్యం వహించే అధికారం లేదు. ఎన్టీఆర్ పేరుతో ఎలాంటి కార్యక్రమాలు చేయడానికి వీల్లేదు. ఎన్టీఆర్‌కు సంబంధించిన ఏదైనా సేవా కార్యక్రమం, అధికారిక ప్రకటన లేదా ఇతర కార్యకలాపాల గురించి సమాచారం ఎన్టీఆర్ లేదా ఆయన అధికారిక బృందం ద్వారానే వెల్లడిస్తారు.ఎన్టీఆర్ జులై 18న రాజకీయాల్లోకి రానున్నారంటూ వస్తున్న వార్తలపై ఎన్టీఆర్ అభిమానుల సంఘం సోమవారం ఓలేఖను రిలీజ్ చేసి ఆ వ్యాఖ్యలన్నీ అవాస్తవమని ఖండించింది. ఆ రోజు నిర్వహించనున్న ఊరువాడ కార్యక్రమానికి తారక్ పొలిటికల్ ఎంట్రీకి ఎటువంటి సం బంధం లేదని స్పష్టం చేసింది. ఇది ఒక సామాజిక కార్యక్రమం మాత్ర మేనని వెల్లడించింది. ఇంతలో కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే మంగళ వారం మరో సంస్థ తిరుపతి రాఎన్టీఆర్ తాజ్ హోటల్‌లో ఎన్టీఆర్ ప్రెస్ మీట్ పెట్టనున్నారని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడం ఆశ్చ ర్యకరం. ఈ వార్తలు పలు మీడియా ఛానెల్లలో సైతం ప్రసారం కావడంతో చివరికి ఎన్టీఆర్ ఆఫీస్ రంగంలోకి దిగి మరీ ఇవన్నీ అవాస్తవాలు అని క్లారిటీ ఇవ్వాల్సి వచ్చింది. దాంతో సంబంధిత సంస్థ చేసిన వ్యాఖ్యలు అనధికారికమైనదిగా తేలింది. ఎన్టీఆర్ అభిమానుల సంఘం జులై 18న ఊరువాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించింది. దీనికి ఎప్పుడో ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపింది. దీన్ని రాజకీయాలతో ముడిపెట్టొద్దని విజ్ఞప్తి చేసింది. అసత్య ప్రచారాలను నమ్మొద్దని అందరినీ కోరింది. ఇలాంటి వాటిని ప్రచారం చేయొద్దని మీడియా సంస్థలు, సోషల్ మీడియా పేజీలకు సైతం తెలియజేసింది. దీని వల్ల అభిమానులు అనవ సరంగా అయోమయానికి గురవుతున్నారని అసహనం వ్యక్తం చేసింది. దీనిపై క్లారిటీ ఇస్తూ ఎన్టీఆర్ అభిమానుల సంఘం సంబంధిత లేఖలో పేర్కొంది.

## ఎపి చేనేత ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్: ఎంపి విజయేంద్ర ప్రసాద్

**విజయవాడ,జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ చేనేత, వస్త్ర ఉత్ప త్తులకు ప్రపంచ మార్కెట్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయని రాజ్యసభ సభ్యుడు వి.విజయేంద్ర ప్రసాద్ అన్నారు. నైపుణ్యమైన నేత కళాకారులను వర్చువల్ రియాలిటీ (వీఆర్) వంటి ఆధునిక సాంకేతికత ద్వారా అం తర్జాతీయ కొనుగోలుదారులతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉం దన్నారు. భారత్ మండపంలో మంగళవారం ప్రారంభమైన భారత్ టెక్స్-2026 ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను ఆయన సంద ర్శించారు. భారతీయ సాంప్రదాయ హస్తకళలు, చేనేత ఉత్పత్తులకు ముఖ్యంగా అమెరికాలోని భారతీయ ప్రవాసులు, అంతర్జాతీయ వినియో గదారుల్లో మంచి ఆదరణ పెరుగుతోందని ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ అన్నారు. ఈ అవకాశాన్ని ఆంధ్ర ప్రదేశ్ సమర్థంగా వినియో గించుకుంటే చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అభిప్రా యపడ్డారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ చైర్మన్ (లేపాక్షి) పసుపులేటి హరి ప్రసాద్ పెవిలియన్‌ను సంద ర్శించి అధికారులను ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో అమలవుతున్న ఏపీ టెక్స్‌టైల్ పాలసీ-4.0 ద్వారా రాష్ట్రంలో పెట్టు బడులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.



మంగళవారం ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను సందర్శించి ఎంపి విజయేంద్ర ప్రసాద్

## ఆర్థిక సంక్షోభంలో ఇండియా

### బిజెపి పాలనలో రూ.150 కోట్ల విదేశీ అప్పులు: చింతామోహన్



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

**చిత్తూరు, జులై 14 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 12 సంవత్సరాల్లో 150 లక్షల కోట్ల రూపాయల విదేశీ అప్పులు చేసి భారతదేశంను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి వేసిందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతా మోహన్ ధ్వజమెత్తారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో చింతామోహన్ మాట్లాడుతూ భారతదేశాన్ని యేళ్ల తరబడి పాలించిన కాంగ్రెస్ పార్టీ హయాంలో విదేశీ అప్పులు కేవలం 50లక్షల కోట్ల రూపాయలు మాత్రమే వుండేదన్నారు. దేశంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన 12 సంవత్సరాల్లో విదేశీ అప్పులు మూడింతలు పెరిగాయని ధ్వజమెత్తారు. కేంద్రంలో యుపిఎ అధికారంలో వున్న సమయంలో ఒక లీటరు పెట్రోలు, డిజీలు రూ.60 వుండేదని, ప్రస్తుతం ఈ ధర రూ.110కి పెరిగిందన్నారు. ప్రస్తుతం దేశంలో కోడి గ్రుడ్డు నుండి ఎరువులు, బియ్యం, నూనె, పప్పుల ధరలు అందనంత ఎత్తుకు ఎగబాకి సామాన్యులకు అందడం లేదని ధ్వజ మెత్తారు. ఆయోధ్యలో రామమందిరం నిర్మాణం కోసం వసూలు చేసిన నిధుల గురించి అడిగితే బిజెపి నాయకులు పారిపోతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని బాధపడుతున్నారని, ఆయనపై 16 సంవత్సరాలుగా ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో విచారణ సాగుతున్నదని, న్యాయ స్థానాల్లో రాజకీయ జోక్యం పెరిగిందన్నారు.

తమిళనాడు మాజీ సిఎం జయలలితకు ఒక న్యాయం, ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎం వైఎస్ జగన్‌కు ఒక న్యాయం! అని ప్రజల్లో చర్చ విస్తృతంగా జరుగుతున్నదన్నారు. అలాగే రాష్ట్రానికి సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా విధులు నిర్వర్తించిన ప్రస్తుత సిఎం చంద్రబాబు నాయుడు తన సొంత జిల్లా చిత్తూరుకు ఏమి చేయకపోవడం అన్యాయమన్నారు. ఇకనైనా సిఎం సొంత జిల్లా చిత్తూరు ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పరదేశి తదితరులు పాల్గొన్నారు.

## రవితేజ మృతదేహానికి అంత్యక్రియలు

### శోకసంద్రంలో కుటుంబీకులు



రవితేజ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య,తదితరులు

**హిందూపురం, జులై 14 ప్రభాతవార్త:** విహారయాత్రకు వియత్నాం వెళ్లి పడవ ప్రమాదంలో దుర్మరణం చెందిన హిందూపురం వాసి రవితేజ మృతదేహం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీసత్యసాయిజిల్లా హిందూపురానికి చేరుకుంది. వియత్నాం నుంచి న్యూఢిల్లీకి సోమవారం బోటు ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలు వచ్చాయి. తదుపరి మంగళవారం ఉదయం న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకోగా ప్రత్యేక అంబులెన్స్ వాహనంలో రోడ్డు మార్గం నందు ఇక్కడికి తీసుకొచ్చారు. స్థానిక టీచర్స్ కాలనీలోని నివాసానికి మృతదేహం చేరుకోగానే భార్య, ఇద్దరు కుమార్తెలు, తల్లి గుండెలు పగిలేలా రోదించారు. వారి రోదనలను చూసిన ప్రజలు చలించిపోయారు. 40 ఏళ్ల వయసులోనే మృత్యువాత పడడం అత్యంత బాధాకరమైనదని కుటుంబీకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో లక్కీ మొబైల్ షాపును నిర్వహించిన రవితేజ లావా కంపెనీకి చెందిన మొబైల్ ఫోన్లను రికార్డు స్థాయిలో విక్రయించడంతో వియత్నాం టూర్‌కు సెలక్ట్ అయి అక్కడికి వెళ్లిన మూడో రోజే మృత్యువాత పడడం తెలిసిందే. కాగా లావా కంపెనీ ప్రతినిధులు రవితేజ కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారంగా ప్రకటించారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో స్నేహితులు, ప్రజలు తరలివచ్చారు.

## నగల కోసం వృద్ధురాలు దారుణ హత్య

**తిరుపతి,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నగరంలో మంగళవారం మధ్యాహ్నం దారుణ హత్య జరిగింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని టార్గెట్ చేసిన దుండగులు గొంతుకోసం హత్యచేసి ఆపై ఒంటిపై ఉన్న నగలను అపహరించుకెళ్ళారు. ఈ సంఘటన తిరుపతి రూరల్ ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశవాయన గుంటలో జరిగింది. ఆంధ్ర బ్యాంక్ మేనేజర్ గా రిటైర్డ్ అయిన కృష్ణారెడ్డి జ్యోతి దంపతులు నివాసముంటున్నారు.ఆయనకుమారుడు ఉదయ్ అమెరికాకు వెళ్ళేందుకు విమానాశ్రయంవెళ్లి సాగనంపేందుకు సోమవారం బెంగళూరుకి వెళ్ళాడు, దీన్ని గమనించిన దుండగులు అదనుగా భావించి ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు జ్యోతి(60)ని దుండగుడు గొంతు కోసి నగలు లాక్కొని ఇంటికి బయట తాళం వేసి పరారయ్యాడు. బెంగళూరు నుండి పలుమార్లు భర్త ఫోన్ చేసినా తీయక పోవడంతో అనుమానం వచ్చి పై ఇంటిలో ఉన్న వాళ్లకు సమాచా రమిచ్చాడు. పై ఇంటిలో ఉన్నవాళ్లు క్రిందికి వచ్చి అరచినా తలుపులు తీయకపోవడంతో వారి వద్ద ఉన్న మరో తాళంచెవితో తలుపుతీశారు. లోపలరక్తస్రావం తో విగత జీవిగా ఉన్న జ్యోతిని గుర్తించి మృతురాలు భర్తకు పోలీసులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న ఎఎస్పీలు ఆర్ల శ్రీనివాసులు, రవి మనోహరచారి, డీఎస్పీలు భక్తవ త్సలం, శ్యామ్‌సుందర్, సిఐలు మద్దయ్యాచారి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీస్ క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్, డాగ్ స్క్వాడ్ చేరుకొని ఆధారాలు సేకరించాయి.ఆ ఇంటికి చుట్టుపక్కల ఉన్న సిసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు.. ఆధారాలను సేకరించారు. గతంలోనూ తిరుపతిలో ఒంటరిగా ఉన్న మహిళను హతమార్చి నగలు కాజేసిన విషయం విదితమే.

## ్డశవ రాజకీయాల ముసుగు తొలగిస్తాం

### మత్స్యకారుల పక్షాన నిలచిన చరిత్ర మాది: మంత్రి అచ్చెన్నాయుడు



**సచివాలయం,జులై 14,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రతిపక్ష గొడ్డలి పార్టీ అధ్య క్షుడు చేస్తు న్నవన్నీ పచ్చి అబద్ధాలని,శవ రాజకీయాల ముసుగులో లబ్ధి పొందాలని చూస్తే ప్రజా క్షేత్రంలో ఉతికి ఆరేస్తాం అని వ్యవ సాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు తీవ్రస్థా యిలో ధ్వజమెత్తారు.మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల విశాఖ పట్నం తీరంలో ప్రకృతి వైపరీత్యం వల్ల గల్లంతైన మత్స్యకారుల ఉదంతపై ప్రతిపక్షం చేస్తున్న చౌకబాబు విమర్శలను ఆధారాలతో సహా తిప్పికొట్టారు.సముద్రంలో జరిగిన ప్రమాదంపై ప్రతిపక్ష నేతకు కనీస అవగాహన లేదని అచ్చెన్నాయుడు ఎద్దేవ చేశారు.టీవిల్లో,పేపర్లలో 19నాటికల్ మైల్స్(దాదాపు 35కిమీ) దూరంలో ప్రమాదం జరిగిందని స్క్రోలింగ్ వస్తుంటే,కనీస జ్ఞానం లేకుండా 10కిమీదూరంలోనే జరిగిందని సిగ్గులేకుండా మాట్లాడుతు న్నారు.నాటికల్ మైల్‌కు,కిమీకు తేడా తెలియని నువ్వు ఈరోజు ప్రభుత్వ బాధ్యత గురించి మాట్లాడటం హాస్యాస్పందం అని మండిపడ్డారు. మత్స్యకారుల రక్షణకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌పాండర్ల సాంకేతికత గురించి మంత్రి వివ రించారు.ప్రమాద సమయంలో బోటు లోని వారు అలారం ఆన్ చేయక పోవడం వల్ల లోకేషన్ గుర్తించడం కష్టమైందని,అయినాకాని ఉద యం 10.30గంటలకు సమాచారం అందిన వెంటనే డిపార్ట్‌మెంట్ అప్రమ త్తమైందన్నారు.11.30 గంటల కల్లా కోస్ట్‌గార్డ్,నావికాదళం,జిల్లా కలెక్టర్ ను సమన్వయం చేసి హెలి కాప్టర్లు,బోట్లతో గాలింపు చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు.ప్రాణాలకు తెగించి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించామని చివరకు రష్యాబోటు సహాయంతో ఒకరు ప్రాణాలతో బయటపడ్డారని వివరించారు.

**కంటి సర్జరీని కూడా రాజకీయం చేస్తారా?** గత 30ఏళ్ళుగా రాష్ట్రంలో ఎక్కడ విపత్తు వచ్చినా అర నిమిషంలో అక్కడ వాలిపోయే చరిత్ర అచ్చెన్నాయుడిది,ప్రమాదం జరిగిన రోజు నాకు రెండు కళ్ళకు కాటరాక్ట్ సర్జరీ జరిగింది.నేను వెళ్ళలేకపోయినా, తక్షణమే ముఖ్యమంత్రితో మాట్లాడి మా సహచర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును,స్థానిక ఎమ్మె ల్యేలను,అధికారులను రాత్రికి రాత్రే బాధితుల వద్దకు పంపాను, అంతేకాకుండా మత్స్యకార శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ద్వారా తక్షణ సహాయం చెక్కులను విశాఖపట్నం పంపించి బాధితులకు అంద జేశాం.ఇవన్నీ నీ కళ్ళకు కనిపించడం లేదా? అని నిలదీశారు. శ్రీకాకుళంలో గొర్రెలు కాసుకునే అమాయక పేదవాడిని ఢీకొట్టి చంపిన మాజీమంత్రి కొడుకు ఉదంతాన్ని మంత్రి ప్రస్తావించారు. చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన "డేగ కళ్ళు" సీసీ నిఘా కెమెరాలు ఉండబట్టి,ఎస్పీ ఆ ఫుటేజ్ చూసి మీ కుట్రలను బట్ట బయలు చేశారు. 'పలకరింపుల పేరుతో కెమెరాల ముందు నవ్వుకుంటూ,జైజైలు కొట్టించుకునే శవ రాజకీయాల ముసుగును మత్స్యకార సంఘాలు గమ నించాలి.అభివృద్ధిపై, సంక్షేమంపై ఎక్కడికి రమ్మన్నా బహిరంగ చర్చకు నేను సిద్ధం" అని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు.



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిపయ్యావుల కేశవ్‌తో ఉద్యోగ సంఘాల నాయకులు

## మంత్రి పయ్యావులను కలిసిన ఉద్యోగసంఘ నాయకులు

**విజయవాడ.జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** సచివాలయంలో ప్రభుత్వఉద్యో గుల సంఘనాయకులు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మర్యాద పూర్వకంగా కలిసి, 2004 సెప్టెంబర్ 1కు ముందు ఏపీపీఎస్సీ/డీఎస్సీ నోటి ఫికేషన్ల ద్వారా ఎంపికై వివిధ ప్రభుత్వ శాఖల్లో సేవలందిస్తున్న ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పాత పెన్షన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయనున్న నేపథ్యంలో కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో హాజరైన ఉద్యోగులు, ఏపీఎస్ఎఫ్ఏ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాపా ప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం,ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రా త్మక నిర్ణయం దాదాపు 11 వేల మంది ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషాన్ని నింపిందని వారు పేర్కొన్నారు.

## ఆధార్ కార్డు అప్డేట్, కొత్తగా నమోదుకు ప్రత్యేక సెంటర్లు

**విజయవాడ,జులై14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్స్‌లో విద్యా ర్థుల ఆధార్ కార్డు అప్డేట్. కొత్త నమోదుల కోసం ప్రత్యేక సెంటర్‌లను ఏర్పా టు చేసింది. ఈ కార్యక్రమాన్ని తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బం ది లేకుండా పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తోంది. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నేటి నుండి 17వతేదీ వరకు మొదటి విడత ఆధార్ అప్డేషన్, కొత్త నమోదులు చేసుకోవచ్చు. ఇక రెండోవిడత జులై 21 నుండి 24 వరకు నిర్వహించబడు తుంది.మొత్తం 8రోజుల పాటు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. విద్యా ర్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వచ్చు. ఐదు నుండి 17సంవత్సరాల మధ్య ఉన్న విద్యార్థులకు ఉపయోగపడుతుంది.

## ఆగస్టు 6నుంచి 15 వరకు 'మార్పు కోసం'

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ.జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** సీపీఐ జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు ఆగస్టు 6 నుంచి 15 వరకు మార్పు కోసం అనే నినాదంతో దేశ వ్యాప్తంగా ప్రచార, పాదయాత్రలను రాష్ట్రంలోను నిర్వహిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మంగళవారం విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలు, 674 మండలాలు, వందలాది గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఆగస్టు 17 నుంచి 27 వరకు పార్టీ అనుబంధ ప్రజాసంఘాలు తమ తమ సమస్యలపై నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తాయని తెలిపారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే మహాసభకు రాష్ట్రం నుంచి సుమారు మూడు వేల మందిని సమీకరిస్తామని వెల్లడించారు.సెప్టెంబర్ చివరి వారంలో కడపలో నాలుగురోజులపాటు సీపీఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో.. 2023లో ఆమోదించిన 106వ రాజ్యాం గ సవరణలో సెన్సస్, నియోజకవర్గాల పునర్విభజనతో అనుసంధానం చేసిన విధానాన్ని విరమించి, ఎలాంటి షరతులు లేకుండా వెంటనే 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోక్‌సభలోని 543స్థానాల్లో కనీసం 181 స్థానాలను మహిళలకు కేటాయిం చాలని కోరారు. ఏపీలో అప్రకటిత ఎమర్జెన్సీ, ప్రజా స్వామ్యంపై నిరంకుశ దాడి జరుగుతుందన్నారు, ఉపాకు వ్యతిరేకంగా ఐదు నగరాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బిజెపి అజెండా మోస్తే టీడీపీ రాజకీయ ఉనికికి ప్రమా దమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు పి.హరి నాథ్‌రెడ్డి, దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.



ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నంకు వినతి పత్రం అందజేస్తున్న జెఎసి నేతలు

## సమస్యలు పరిష్కరించండి: జెఎసి నేతలు

**కుప్పం,జులై 14 ప్రభాతవార్త:** ఎపిఎస్ ఆర్టీసీ జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉద్యోగుల న్యాయమైన సమస్యలు, పెండింగ్ డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నంకు ఆర్టీసీ జెఎసి నేతలు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా జెఎసి నాయ కులు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశా లను వైస్‌ఛైర్మన్‌కు వివరించి వాటి పరిష్కారంకు చర్యలు తీసుకోవాలని కోరా రు. దీనిపై వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం స్పందిస్తూ జెఎసి నేతల వినతిని పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా జెఎసి కన్వీ నర్లు ఉపేంద్ర, బలరాంమూర్తి, రాష్ట్ర సభ్యులు బాబు, శ్రీకర్‌రెడ్డి, కుప్పం డిపో జెఎసి అధ్యక్షుడు మునెప్ప, కార్యదర్శి జయపాల్, నాయకులు కరుణా కరన్, వేలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి



హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ రెడ్డి (ఫైల్)

**కర్నూలు అర్బన్, జు లై 14 ప్రభాతవార్త** బళ్లారి చౌరస్తా ఫ్లైఓవర్ మీద ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ రెడ్డి (41) మృతి చెందారు. ఆయన 2వ బెటాలి యన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ప్రస్తుతం ఎస్ డి ఆర్ ఎఫ్ ఎంటీలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రోజువారీగా వాకింగ్‌కు వెళ్లే ప్రసాద్ రెడ్డి ఉదయం బళ్లారి చౌరస్తా ఫ్లైఓవర్‌పై నడుస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఫ్లైఓవర్ పై నుంచి కృష్ణనగర్ సర్వీస్ రోడ్డుపై పడిపోయారు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు, కానిస్టేబుల్ పరమేష్ కలిసి హైవే అంబులెన్స్ ద్వారా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్సకు ముందే ఉదయం 7:48 గంటలకు ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Rayapudi, Amaravati-522237, Andhra Pradesh.
NIT No. 21/MAU61-ADMN0STG(OTH)/12/2026, Dt: 14/07/2026
**E-PROCUREMENT TENDER NOTICE**
Name of Work: APCRDA - "Request for Proposal (RFP) for Selection of Consultant to Provide Comprehensive Multi-layered Third-Party Quality Assurance & Quality Control Services for infrastructure and construction works of development in Amaravati Capital City, Andhra Pradesh, India".
The bid can be downloaded on AP e-procurement portal from 15.07.2026 to 05.08.2026 up to 14.00 Hrs., Due date for submission of Bid is 05.08.2026 up to 15.00 Hrs., Technical bid opening 05.08.2026 @16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Commissioner, APCRDA, Amaravati

15-7pg4_15-7pg4.qxd 14/Jul/26 11:18 PM Page 1



వార్త

చాలా మంది లోభులవడం వల్ల ఎందరో ఆకలితో అలమటిస్తున్నారు. ఇతరులతో పంచుకోవడం ఎలాగో తెలుసుకుంటే సమస్య ఉండదు.

న- ఐ.జాన్సన్


# సర్ మెలికల కొలికి!

ఓటుహక్కు నవ్వులపాలవుతోంది. గడపగడపకూ, బిఎల్ఒలను పంపి విస్తృత పరిశీలన తర్వాతసమగ్ర ఓటర్ల జాబితా రూపొందించాలన్న 'సర్' లక్ష్యాన్నిఎవరూ కాదనలేం. కానీ దాని లక్ష్యం నెరవేరే స్థాయిలో కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాలు ఉండకపోవడం విచిత్రం. రాజ్యాంగానికి ఎన్నో సవరణలు చేసుకున్నప్పుడు మన మెందుకు సవరణ చేసుకోకూడదు అనుకున్నారో ఏమో కానీ సమగ్ర విధాన రూపకల్పన లేకుండా 'సర్' విధానాలున్నాయేమోనననే అనుమానాలు జనంలో తలెత్తుతున్నాయి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ తీరు ఎంతో ఘనంగా సాగుతోందనే ప్రచారం జరుగుతోంది. కానీ క్షేత్రస్థాయిలో మరోలా ఉంది. ఓటరు చేర్పులో వయోజనులు సైతం ఇబ్బందిపడుతున్నారు. ఎందుకంటే ఇంటింటికీ తిరుగుతున్న బిఎల్ఒలు చాలా ఇళ్లలో అంతకుముందున్న ఓటరు అక్కడ ఉన్నారా? లేరా? అనే పరిశీలన తప్పించి చాలా ప్రాంతాల్లో సంబంధిత కొత్త ఓటర్ల చేర్పింపు సజావుగా సాగడం లేదు.ఫలానా చోట ఫలానా వారు లేరనే సమాచారం రాగానే వాళ్ల ఓటు తొలగిస్తున్నారు తప్పితే వారి విషయమై అనంతర ఆచూకీ తీసుకోలేకపోతున్నారు. 'సర్' ప్రక్రియ ఆది నుంచీ వివాదాస్పదంగానే ఉంది. సర్ ప్రక్రియ పట్ల జనం భయభ్రాంతులౌతున్నారు. ఏదో ఎన్నికలప్పుడే ఓటు అనే పరిస్థితి నుంచి ఓటు హక్కు లేకుంటే ఓ సమస్య, రెండు చోట్ల నమోదై ఉంటే ఓ తకరారు. ఇలా సామాన్య ప్రజానీకం ఉలిక్కిపడి ఆందోళనపడుతున్నారు. ఎన్నికలు కొద్ది రోజుల్లో వస్తాయనగా బీహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలలో ఆదరాబాదరా 'సర్' పరిశీలన జరిగిందంటే అది వేరే విషయం. పైగా ఓట్లు అన్యాయంగా ఏరివేత కోసమే ఈ ప్రక్రియ అనో, తీరా తుది జాబితా పూర్తయ్యాక తమఓట్లు గల్లంతయ్యాయని ఆందోళన చెందిన సాధారణ జనం లేకపోలేరు. అంటే 'కొండ నాలికకు మందు వేస్తే ఉన్న నాలుక' పోయిందన్న చందాన ఈ ప్రక్రియసాగుతోంది.తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఇప్పట్లో ఎన్నికలు లేవు. అయినా 'సర్' ప్రక్రియ సజావుగా సాగడం లేదనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ప్రక్రియ మంగళవారంతో పూర్తయింది. 89శాతంబిఎల్ఒల పరిశీలన పూర్తయిందని చెప్తున్నా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ విజ్ఞప్తి మేరకు మరో పదిరోజులు పెంచారు.తెలంగాణలో 'సర్'కు సంబంధించిన నిబంధనలేవీ అమలు చేయడం లేదు. ఇంటింటికి మూడుసార్లు సందర్శించాల్సిన బిఎల్ఒలు తమ ప్రాంతానికే రావడం లేదని ఆరోపణలున్నాయి. వాళ్లలా అంటున్నారని కాదు కానీ ఇంత తక్కువ సమయంలో బిఎల్ఒలు ఒకసారే ఫలానా ఏరియాకు వెళ్లలేదనే సమాచారం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లిన వారెందరో ఉన్నారు. తాజా ప్రక్రియలో ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కున్నట్లయితే రెండేళ్ల జైలు శిక్ష తప్పదంటూఎన్నికల కమిషన్ ప్రకటన చేసే సరికి చాలా మంది ఓటర్లకు తమకెక్కడ ఓటుందో తెలుసుకునే సమయం, వీలు చిక్కక వెతుక్కుని ఉండకపోతే వ్యక్తిగతంగా చిక్కుల్లో పడినట్లే కదా! నిరక్షరాస్యులు తమ పనులమీద వేరొకచోటికి వెళ్లి ఉన్నా, అసంఘటిత కార్మికులైన వారి ఓటర్ల పరిశీలన ఎంతో సంక్లిష్టంగా మారుతోంది.ఇలాంటి ఎన్నో అంశాల్లో పరిశీలన తేలకపోతే ఎందరివో ఓట్లు తొలగింపునకు గురయ్యే పరిస్థితిఏర్పడ్తుంది. సాధారణంగా కొత్త ఓటర్లను చేరమని, ఇళ్లు మారిన వారి ఓట్లను కొత్త చోట్లకు మార్చుకోమని ఆహ్వానించే ఓటరు చేర్పింపు ప్రక్రియ ఈసారి చాలా సంక్లిష్టంగా మారింది. ఎన్నో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా డబ్లింగ్ ఓటరుల పరిశీలన సర్దుబాటు చేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ఎందుకు వినియోగంలోకి తెచ్చుకోవడం లేదో అర్థంకాదు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా విశ్వసనీయత అవసరమే. దానికోసం రూపొందించిన 'సర్' ప్రక్రియలో పారదర్శకతను బలోపేతం చేయాల్సిన అవశ్యకత ఉంది. అనర్హులను, నకిలీ నమోదును నిలిపివేసేందుకు తగు మార్పులు చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహకారాన్నిఅందుకోవడం అవసరం.వలస కార్మికులు,వృద్ధులు, దివ్యాంగులు సైతం కొత్త ఓటరు జాబితాలోకి నమోదయ్యే విషయంలో ఎక్కువ ఇబ్బందులకు గురవుతున్నారని సమాచారం. బిఎల్ఒలకు సరైన ప్రామాణిక అవగాహనకల్పించకుండా ఎన్యూమరేషన్‌కు పంపడం వల్లనే ఈ ప్రక్రియ విమర్శలకు గురవుతోంది. వివిధ ప్రాంతాల్లో వేర్వేరు రాజకీయ పార్టీలు ఓటర్ల చేర్పింపు, తొలగింపులతో సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బంది పెట్టే అంశాలపై గొంతెత్తి విమర్శిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల విశ్వాసాన్ని బలపరిచే ప్రక్రియ పురోగతిలో ఎన్నో అంశాలపై ఎన్నికల సంఘం ఎన్నో మెలికలు పెడుతోందనే అభిప్రాయంవ్యక్తమవుతోంది. వేగంగా పెరుగుతున్న జనాభా,పట్టణీకరణ, వలసలు, డిజిటల్ యుగంలో మారుతున్న నివాస పరిస్థితుల రీత్యా సమగ్ర సవరణలను కాదనలేం. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లుగా మాయాజాలం జరిగిందా అనే అనుమానాలను రేకెత్తించే అంశాలపై ఓటర్ల జాబితా నిర్దే శకులకు స్పష్టత అవసరం. అనేక ప్రాంతాల్లో పత్రాల ధృవీకరణపై ప్రజల్లో అయోమయం ఏర్పడింది. ఇప్పుడీ ప్రక్రియలో ఆధార్ కార్డు, పౌరసత్వ కార్డు,పాత ఓటరు కార్డు, ఇలాంటివన్నీ ఎక్కడో ఓ దేశంలో ఇక్కట్ల పాలు చేస్తాయనే చర్చ బయలుదేరడంతో జనం చివరి క్షణంలో కంగారుపడిన వైనం. ఓటర్ల జాబితా సర్దుబాటు లో రాజకీయ పార్టీలు తాము గాబరా చెంది ఓటర్లను గందర గోళంలో పడేటట్లు చేయడం కన్నా అన్ని విధాలా సహకరిస్తే ఎన్నికల కమిషన్ బాధ్యతలో సమగ్ర జాబితా రూపొందించగలుగుతుంది.



నాయకత్వం అనేది హోదా కాదు ఒక బాధ్యత. ఇక క్రియ, నాలుకకి కళ్లెం వేయగలిగితే శాంతికి భంగం కలుగదు.

జి. ఎలియట్



శత్రువుల నుంచి కాపాడుకోవాలంటే వాళ్లని మిత్రులుగా మార్చుకోవడమే ఉత్తమమైన మార్గం.

స్వామి వివేకానంద

## ప్రజావాక్కు

### కర్ణాటకరాష్ట్ర మంత్రులను ఆదర్శంగా తీసుకోవాలి

నిన్న కర్ణాటక రవాణా మంత్రి బైరతి సురేష్ సాధారణ ప్రయాణికుని మాదిరి,మూతికి మాస్క్ పెట్టుకొని ప్రయాణికుల కష్టాలనుస్వయంగా ఎదుర్కొన్నారు.బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులకు కలిగించే ఇబ్బందులను స్వయంగా పరిశీలించేందుకు మారువేషంలో రాగా, చిల్లర లేకపోతే దిగిపో అని కండక్టర్ మంత్రినీ అనడం విశేషం. పూర్వం రాజులు ఇలా మారువేషాలతో రాత్రిళ్ళు తిరుగుతూ దొంగలను కనిపెట్టడం, ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేవారు.పాలకులు అలాఉండాలి.గతంలో కర్ణాటకలోనే ఒక మంత్రి దెయ్యాలు లేవని నిరూపించేందుకు, ఒక్కడే అర్ధరాత్రి స్మశానంలో పడుకున్నాడు. అలా ఉండాలి పాలకులు. మనరాష్ట్రంలో కూడా మంత్రులు ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకు,అధికారులు ఏరకంగా పనిచేస్తుంది, లంచాలు ఏరకంగా అడుగుతుంది, పనులు ఆలస్యం కావటానికి కారణాలను తెలుసుకునేందుకు ఇలా మారువేషాలతో తిరగాలి.అపుడే ప్రజల మన్ననలు పొందుతారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### డంపింగ్ యార్డ్ జీవో రద్దు చేయాలి

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని సిద్ధపూర్ గ్రామంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కొరకు విడుదల చేసిన జీఓవెంటనే రద్దు చేయాలి. పచ్చని పొలాల మధ్య చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు వారి ఆరోగ్యం పాడయ్యే అవకాశం ఉంది. భవిష్యత్ పిల్లల జీవితం గురించి ఆలోచించి డంపింగ్ యార్డ్ జీవో వెంటనే రద్దుచేసి ప్రజల ప్రాణాలను కాపాడాలి. ప్రజల ఆరోగ్యపరిస్థితులను లెక్కలోకి తీసుకునే నిర్ణయాలు చేయాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

ఈ మధ్య దేశం మొత్తం మీద వయోవృద్ధుల సంఖ్య, యువకుల కంటే ఎక్కువ ఉన్నట్లు తెలిసింది. యువకుల సంఖ్యాబలం ఎక్కువగా ఉన్నప్పుడే మానవవనరులు కాస్త ఎక్కువ పొందొచ్చు. ఇది ఆయా పరిస్థితుల్లో వారి ఆరోగ్యాలు,సామాజిక స్థితి, అనుకూల ధోరణి ప్రధానం. పెడత్రోవ ధోరణులు అతిగా పెరిగి వ్యక్తి వినాశనం జరుగుతున్నది.ప్రభుత్వం యువకులకు తప్పక ఉపాధి కల్పించాలి. వృద్ధుల కంటే యువకుల సంఖ్యను పెంచాలి.

-బి. మేఘనాదం, విశాఖపట్నం

### పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలి

ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ గురుకులాలలో 2026-2027 విద్యా సంవత్సరంప్రారంభం నుండి పేరెంట్స్ కమిటీ సమావేశాలు ప్రతినెల క్రమం తప్పకుండా నిర్వ హించాలి. పిల్లల క్రమశిక్షణ, గురువులను గౌరవించే విధానం చర్చించాలి. పరిసరాల శుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, త్రాగడానికి మంచి నీరు సరఫరా చేయాలి. విద్యార్థులకు సెల్‌ఫోన్ వాడకం నిషేధించాలి. హెయిర్ కటింగ్ చిన్నగా శుభ్రంగా ఉండాలి. తరగతి గదిలో చక్కగా కూర్చోవడం. ప్రతిరోజు పాఠాలు వినే విధంగా చూడాలి. విద్యార్థుల హాజరు శాతం తప్పకుండా ఉండాలి.క్లాసులలో నిద్రపోవడం వద్దు.ప్రతినెల సమీక్ష సమావేశాలు నిర్వహించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### కృత్రిమమేధ అవసరమే..

ప్రపంచ సాంకేతిక రంగం వేగంగా మారుతున్న ఈ కాలంలో కృత్రిమ మేధస్సు వినియోగం అనివార్యంగా మారింది. భారతదేశం ప్రపంచ స్థాయిలో పోటీ సామర్థ్యాన్ని నిలబెట్టుకోవాలంటే కృత్రిమ మేధస్సు ఆధారిత పరిష్కారాలను విస్తృత స్థాయిలో స్వీకరించడం అవసరం. అలాగే ఈ కొత్త సాంకేతికతకు అనుగుణంగా మానవవనరులను నైపుణ్యాలతో తీర్చిదిద్దడం కూడా అత్యంత ముఖ్యమైన అంశం. కొంతమంది భావిస్తున్నట్లుగా కృత్రిమ మేధస్సు సాఫ్ట్‌వేర్ సేవల రంగానికి ముప్పు కాదు. వాస్తవానికి అది ఉత్పాదకతను పెంచే శక్తివంతమైన సాధనంగా నిలుస్తోంది. క్లిష్టమైన సమస్యలను వేగంగా పరిష్కరించడం, కొత్త ఆవిష్కరణలకు దారితీయడం, పనితీరును మెరుగుపరచడం వంటి అనేక ప్రయోజనాలను ఇది అందిస్తోంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా సంస్థలు తమ వ్యాపార వ్యవస్థల్లో కృత్రిమ మేధస్సును విస్తృతంగా అనుసంధానిస్తున్నాయి.

- సి.సాయిరుత్విక్, నల్గొండ

### పెరుగుతున్న అవినీతి

ప్రభుత్వం నెల నెల టంచన్‌గా అందించే వేలాది రూపాయల జీతాలతో ఎంతో హుందాగా ఉండాల్సిన కొంతమంది ఉద్యోగులు తమ దగ్గరకు ఏదేని పని నిమిత్తమై వచ్చిన సామాన్య ప్రజల నుంచి,చిన్న,సన్న కారు రైతుల నుంచి తమకు కావలసినంత సొమ్మును వసూలు చేస్తున్నారు. కాస్తో,కూస్తో సామాన్య ప్రజల నుంచి కాసులు గుంజనిదే వారికి ఆ రోజు నిద్రపట్టేలాలేదు అన్నట్లుగా ఉంది ఉద్యోగులపనితీరు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని రూపుమాపేందుకు అందరూ నడుం బిగించాలి.

-ఎన్. మధు, నంద్యాలజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# రాబోయే కులగణన దేశ సమగ్రతకు సవాలు?

*సైంటిఫిక్ కులగణన మన దేశంలో ఇప్పటి వరకూ జరగలేదు. ఇప్పుడు జరగబోయే కులగణన (రెండవ ఫేజ్) రాజకీయాల నేపథ్యంలో జరగబోతున్నదన్న అపప్రద గూడా వుంది! ఫార్వర్డ్ కులాలు ఎన్ని? బాక్వర్డ్ కులాలు ఎన్ని, ఇతర బాక్వర్డ్ కులాలు ఎన్ని? షెడ్యూలు కాస్ట్స్, షెడ్యూల్ ట్రైబ్స్ ఏ లెక్కల్లో ఈనాటి సామాజిక రాజకీయ నేపథ్యంలో చూపించబడుతాయి? ఫార్వర్డ్ కులాలకు సంబంధించి ఆర్థిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా లెక్కలు తేల్చగలుగుతారా? అదే ఆర్థిక అంశం బి.సి, ఓబిసి, షెడ్యూల్డ్ కులాలు, తెగలకూ వర్తిస్తుంది! క్రీమీ లేయర్, సబ్ కాటగరైజేషన్ కులాలు రిజర్వేషన్ల వల్ల లాభాలు పొందుతున్నాయని కొందరు లేవనెత్తుతున్నారు! వాటి మాటేమిటి? అందరికీ ఆమోదయోగ్యంగా వుండే విధంగా ప్రారంభించబోతున్న కులగణన వుండాలని కోరుకోవటంలో తప్పులేదు కానీ ఈ కులగణన వల్ల దేశం విచ్ఛిన్నం కాకుండా వుంటే చాలు అదే పదివేలు అని ఈ విషయాల పరిజ్ఞానంలో ఆరితేరిన అనుభవజ్ఞులు ఆశించటంలో తప్పులేదేమో!*



రావులపాటి సీతారాంరావు

భారత దేశంలో సమస్యలు లెక్కపెట్టలేము. ఏళ్ళతరబడి చూరును పట్టుకొని వ్రేలాడుతున్నసమస్యలు ఎన్నో రోజుల తరబడి పెరుగుతున్న సమస్యలు ఎన్నెన్నో! అన్నిటిని తలదన్నేలా రోజుకొక సమస్య మన దేశంలో ఉత్పన్నం కాబడుతున్నదా? ఉత్పన్నమవుతున్నవా? అని ఆలోచించటానికి ప్రభుత్వాలకూ, అధికారులకూ, రాజకీయ నాయకులకూ తీరిక దొరక లేనతంగా సమస్యలు ఎదురవుతున్న మాట వాస్తవం! ఇవ్వన్నీ అంటే పాత సమస్యలతో పాటు పుట్టుకొస్తున్న కొత్త సమస్యలకు తోడుగా సమస్యలు తక్కువవుతున్నట్టుగా సామాజిక ఉద్యమకారులూ, రాజకీయ వేత్తలూ, ప్రభుత్వాలు కొన్నాళ్ళు జనాభాను లెక్కించాలి 'సర్' అంటారు మరికొన్నాళ్ళు ఓటర్ల నిగ్గు తేల్చాలి 'సర్' అంటారు! కులాల, మతాల, ప్రాంతాల సమస్యలకు తోడు పరస్పరం పోరాడుకొనేట్లు 'రాముడేం చేసాడు? చాతగాక అడవుల్లోకి పోయాడు' అని ఆ రాముని పుట్టు పూర్వోత్తరాలతో సంబంధం లేని వ్యక్తులు మాట్లాడుతే మాట్లాడకు! మా రాముడు దేవుడు కళ్ళు పోతాయి. మా మతాన్ని రాముని పేరు పెట్టి ద్వేషిస్తున్నావా?' అని మరొకరు మాట్లాడుతూ చినికి చినికి గాలివాన అయిన తీరులో అసహజమైన పోట్లాటలను ప్రోత్సహించటం మొదలు పెట్టారు! ఎంత విషాదకరం? అభివృద్ధి సాధిస్తున్న దేశానికి 'స్పీడ్ బ్రేకర్స్' వేసే పనిలో కొందరు ఉండటం ఎంత దురదృష్టకరం! ఈ నేపథ్యంలో 2027 జులై 6 నుండి సెన్సెసు 2027 సెకండ్ ఫేజ్ రిహార్సల్స్ ప్రారంభం కాబోతున్నది! ఈ ప్రక్రియ ప్రకంపనలు సృష్టిస్తుందా లేకపోతే సాదా సీదాగా గడిచిపోతుందా అని స్వాతంత్ర్యం తర్వాత మన దేశ చరిత్ర స్థితి గతులను అధ్యయనం చేస్తున్న విజ్ఞానులు ఎదురు చూస్తున్నారు! ఈ కార్యక్రమం దేశ మంతటా యూనియన్ టెరిటరీతో సహా మొదలు కాబోతున్నది! ఈ రెండవ 'సర్' ముఖ్యాంశంగా ఒక 'ఓపెన్ కాలం' ఎన్యూమరేషన్లో పాల్గొనే వారు పూరించాలి! నీ కులం ఏమిటి అన్న విషయం నీవు చెబుతే ఆ 'కాలం' ద్వారా రికార్డుల్లోకి ఎక్కుతుంది. 2011లో జరిగిన సోషియో ఎకనామిక్, కాస్ట్ సెన్సెస్ (ఎస్.ఇ.సి.సి)కు ఈ కాలం వున్నా, చట్టం ఊతంగా లేదు. ఇప్పుడు జరగబోయే 'కాస్ట్' సెన్సెస్ (కుల గణన) చట్ట ప్రకారం జరుగుతున్నట్లుగా పరిగణించబడుతుంది. 2011 సెన్సెసుకు 2027 సెన్సెస్కు వున్న ముఖ్యమైన తేడాతో కూడిన కీలకాంశం చట్టం! 2027 కులగణన వెనక చట్టం వుంది! జులై 20కి సెన్సెసు ప్రక్రియ పూర్తవుతుంది. అటు తర్వాత కులగణన



లెక్కలు ప్రభుత్వం తేలుస్తుంది. 2011 కులగణనలో లెక్కకు మించిన కులాలు లెక్కలోకి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఆ కులగణన ఆచరణ యోగ్యంగా కనపడలేదు! దానికి కారణం 1931 సెన్సెస్లో కేవలం 4,147 కులాల పేర్లు లెక్కల్లో తేలుతే, 2011 ఎస్.ఇ.సి.సి ప్రకారం 46 లక్షల కులాల పేర్లు పరిగణనలోకి తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది! ఆ లెక్కలు పనికి రాకుండా పోవటానికి కారణం ఇంటి పేర్లు ఉపకులాలు, తెగల పేర్లు గూడా కులాల పేర్ల మీద వచ్చి పడ్డాయి! అందుకనే కేంద్రం సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకున్న ఒక ఉదంతంలో ఈ సెన్సెస్ లెక్కలు తేలేవిగా లేవు, తప్పుల తడకగా మారాయి అని చెప్పక తప్పలేదు! అందుకనే ఈసారి తప్పులు లేని కులగణన చేయగలుగుతేనే ఆ రికార్డుకు హేతుబద్ధత వచ్చినట్లవుతుంది! 2023లో జరిగిన బీహార్ రాష్ట్ర కులాల సర్వే ఒక విధంగా తప్పులు లేని రికార్డును పొందుపర్చ గలిగింది! దానికి కారణం ఎన్యూమరేటర్స్ సహనంతో ఎన్యూమరేట్ చేయబడ్తున్న వ్యక్తిది ఏ కులమేమిటో క్షుణ్ణంగా తెల్చుకున్న తర్వాతనే లెక్కలోకి తీసుకోవటం వల్ల అది సాధ్యపడిందని కొందరు అభిప్రాయపడ్డారు! జరగబోయే కులగణనకు ఫూల్ ప్రూఫ్ మెథడ్స్ అవసరమని అందరూ చెప్తున్నారు కానీ మెథడ్స్ ఏమిటో ఏ పద్ధతులలో కుల నిర్ధారణ చేయాల్నో ప్రభుత్వాలూ, అధికారులూ అర్థం కాని పరిస్థితిలోనే వున్నారు! నిజం మాట్లాడితే స్వాతంత్ర్యం మునుపు అనేక కారణాల వల్ల ఉదాహరణకు సామాజికంగా కులాలు అన్నీ అందరికీ తెలియకపోవటం, కొండల్లో నివసించే వారికి, ట్రైబ్‌లకూ కులాల అవగాహన లేకపోవటంతో, తెలిసిన కులాల వారి లెక్కలే చెలామణిలో వుండేవి! నాలుగు వర్ణాల విభజన మంచికో చెడుకో కుల విభజన లెక్కల్లో పెద్ద పీటను అలంకరింప చేసి నోరెత్తనీయని రీతిలో అప్పటి పెత్తందార్లు, పెద్దలూ సమర్థించటం వల్ల,1931 సెన్సెస్లో కేవలం 4,149 కులాలు మాత్రమే గుర్తించబడ్డాయి! లిటరసీ రేటు పెరగటం వల్ల 2011 నాటికి ఆ లెక్క మారి 46 లక్షల్లోకి వాయు వేగంతో చేరుకుంది! సైంటిఫిక్ కులగణన మన దేశంలో ఇప్పటి వరకూ జరగలేదు.ఇప్పుడు జరగబోయే కులగణన (రెండవ ఫేజ్) రాజకీయాల నేపథ్యంలో జరగబోతున్నదన్న అపప్రద గూడా వుంది! ఫార్వర్డ్ కులాలు ఎన్ని? బాక్వర్డ్ కులాలు ఎన్ని ఇతర బాక్వర్డ్ కులాలు ఎన్ని? షెడ్యూలు కాస్ట్స్, షెడ్యూల్ ట్రైబ్స్ ఏ లెక్కల్లో ఈనాటి సామాజిక రాజకీయ నేపథ్యంలో చూపించబడుతాయి? ఫార్వర్డ్ కులాలకు సంబంధించి ఆర్థిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా లెక్కలు తేల్చగలుగుతారా? అదే ఆర్థిక అంశం బి.సి ఓబిసి షెడ్యూల్డ్ కులాలు, తెగలకూ వర్తిస్తుంది! క్రీమీ లేయర్, సబ్ కాటగరైజేషన్ కులాలు రిజర్వేషన్ల వల్ల లాభాలు పొందుతున్నాయని కొందరు లేవనెత్తుతున్నారు! వాటి మాటేమిటి? అందరికీ ఆమోదయోగ్యంగా వుండే విధంగా ప్రారంభించబోతున్న కులగణన వుండాలని కోరుకోవటంలో తప్పులేదు కానీ ఈ కులగణన వల్ల దేశం విచ్ఛిన్నం కాకుండా వుంటే చాలు అదే పదివేలు అని ఈ విషయాల పరిజ్ఞానంలో ఆరితేరిన అనుభవజ్ఞులు ఆశించటంలో తప్పులేదేమో! ●

# పేదవాడి పొట్టను కొడుతున్న ప్రపంచ పరిణామాలు

పి.వి.వి.సత్యనారాయణ

ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ భూగోళం పై ఏ చిన్న పరిణామం సంభవించినా, దాని ప్రభావం మొత్తం దాదాపు 850 కోట్ల మానవులపై ఉంటుంది అంటే అతిశయోక్తి కాదు. ప్రకృతి కన్నెర్ర చేసినా, ఆధిపత్య పోరులో సామ్రాజ్యవాద దాడులైనా, కల్తీలైన సామాన్య మానవుల జీవితాలపై పెను ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా పేద మధ్యతరగతి ఆ మాటకు వస్తే, సబ్ సహారా, ఆసియా, ఆఫ్రికా ఖండ ప్రజల జీవితాలు అల్లకల్లోలం అవుతున్నాయి.ముఖ్యంగా 1991 తరువాత సరళీకృత ఆర్థిక విధానాలు, సోవియట్ యూనియన్ విడిపోవడం, ప్రపంచీకరణ నేపథ్యంలో అనేకరంగాల్లో గణనీయంగా మార్పులు చోటుచేసుకున్నాయి. దీనికి తోడు వరదలు, భూకంపాలు, సునామీలు, అగ్ని ప్రమాదాలు, తరచూ యుద్ధాలు, కోవిడ్ విలయతాండవం మొత్తం ప్రపంచాన్ని ఏ సమయానికి ఏ వైపుకు నెడుతుందో అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. 1990 వరకూ సోవియట్ యూనియన్ (రష్యా) బలంగా ఒకవైపు, మరోవైపు అమెరికా ఒకదానికి ధీటుగా మరొకరు ఉండటం వల్ల దాదాపు ప్రపంచ దేశాలు సమన్వయం చేసుకుంటూ సామరస్యంగా సాగింది.ఎప్పుడైతే రష్యా తన ప్రభావాన్ని కోల్పోయిందో, ఇక తిరుగులేని శక్తిగా అమెరికా ఆవిర్భవించింది.గతంలో ఇరాక్, లిబియా వంటి దేశాలను, తాజాగా వెనుజులా, నేడు ఇరాన్ పై సామ్రాజ్యవాద ఆధిపత్యం ధోరణితో దాడులు, యుద్ధాలు చేస్తూ మొత్తం ప్రపంచాన్ని ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పేద మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతూ,జీవితాలను చిందరవందరగా చేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడుగా రెండోవ సారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్ 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అనే భావనతో మొత్తం ప్రపంచ దేశాలపై'ట్రేడ్ వార్' కు శ్రీకారం చుట్టాడు. తనకు నచ్చిన విధంగా ప్రతీకార సుంకాలు విధిస్తూ ప్రపంచ దేశాలపై అప్రకటిత వాణిజ్య యుద్ధానికి సిద్ధ పడటం వల్ల దాదాపు అన్ని దేశాలు అమెరికాకు దూరం జరిగాయి.చివరికి చిన్న చితకా దేశాలైన కొలంబియా, మెక్సికో వంటి దేశాలు ట్రంప్ విధానాల పట్ల నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి.మన దేశం అలీన విధానం విడనాడటం, ట్రంప్ తో సన్నిహితంగా ఉండటం వల్ల పెను సవాళ్లను ఎదుర్కోవడం జరుగుతుంది. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఏర్పాటు చేసిన ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ, పర్యావరణ పరిరక్షణ వేదికలు నుంచి అమెరికా బయటకు పోవడం కూడా మొత్తం ప్రపంచాన్ని నివ్వెరపోయేటట్లు చేసింది. దీంతో నిధులు లేక పేద మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా ఆఫ్రికన్ దేశాలు ఆహార కొరత,ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు అందక బహు పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి. ఇక అమెరికా, ఇజ్రాయెల్ జోడిగా ఇరాన్, లెబనాన్ పై చేస్తున్న యుద్ధం పరాకాష్టకు చేరడంతో మొత్తం ఆ యుద్ధ తీవ్రత మన ఇంటికి, పరిశ్రమలకు, ఎరువులు, మందులు ఫార్మా రంగంతోపాటు మందుబాబులు (మద్యం) గుండెల్లో గుబులు రేపుతోంది. తిరిగి మరల పుల్లల పొయ్యిలు, బొగ్గులు పొయ్యిలు బయటికి తీసి బ్రతుకులు గడిపే సమయం ఆసన్నమైంది. పేద, మధ్య తరగతి ప్రజలు దాచుకున్న సొమ్ములు, స్టాక్ మార్కెట్ పెట్టుబడులు హుష్ కాకి అవుతున్న పరిస్థితి. అధికధరలు, ద్రవ్యోల్బణం,నిరుద్యోగం, పేదరికం,గాలిలో కలిసిపోతున్న ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఇవి అన్నీ సామాన్య ప్రజల జీవితాల్లో చీకటి నింపుతున్నాయి. దీనికి తోడు ఆరోగ్య సమస్యలు, వాతావరణ కాలుష్యం చుట్టుముట్టుతున్నది. అక్రమ దందాలు, కల్తీలు, బ్లాక్ మార్కెట్ స్వైరవిహారం చేస్తున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు ఒకటై, సామ్రాజ్యవాద ఆధిపత్య ధోరణితో వెళుతున్న అమెరికా వంటి దేశానికి ప్రజాస్వామ్య పద్ధతిలోనే గుణపాఠం చెప్పాలి.మనలాంటి దేశాలు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని 'విశ్వగురు' పాత్ర పోషించాలి. ఉత్సవ విగ్రహంగా మారుతున్న ఐక్యరాజ్యసమితికి పునర్జీవం పోయాలి. ఎంత అభివృద్ధి చెందిన దేశమైనా ఏదో ఒక విషయంలో మరో దేశం పై ఆధారపడి ఉంటుంది అనే వాస్తవాన్ని సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ ఆధిపత్య దేశాలకు తెలియజేయాలి. ఎక్కడో అంతరిక్షంలో మానవ ఉనికికోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ఈదేశాలు,అసలు భూమ్మీద కళ్ళముందు కదలాడే మానవ జాతి నిర్మూలనకు, పసి పిల్లలు ప్రాణాలు సైతం యుద్ధాలు పేరుతో చంపివేయడం ఏరకమైన అభివృద్ధో ఈ అభివృద్ధి చెందిన దేశాలు ఇకనైనాఆలోచన చేయాలి. ●

# ఉచిత విద్యా పథకంతో ఒడిశా కొత్త ఒరవడి



యేచన్ చంద్ర శేఖర్

రెండువేల ఇరవై ఆరు నాటికి, భారతదేశ జాతీయ సగటు అక్షరాస్యత రేటు దాదాపు 80.90 శాతంగా ఉంది. కాగా 98.20 శాతంతో మిజోరాం దేశంలోనే అగ్రస్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ 72.60 శాతం, బీహార్ 74.30శాతం, మధ్యప్రదేశ్ 75.20 శాతాలతో అత్యల్ప సగటులను నమోదు చేశాయి. విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన 'ఉల్లాస్' కార్యక్రమం, 95 శాతం అక్షరాస్యత స్థాయిని దాటిన ఏ రాష్ట్రానైనా 'సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రం'గా గుర్తిస్తున్న నేపథ్యంలో మిజోరాం 98.20, లక్షద్వీప్ 97.30, కేరళ 95.30, త్రిపుర 93.70, గోవా 93.60 శాతం ఈ స్థాయిని సాధించాయి. త్రిపుర, గోవా 2026 అంచనాల ప్రకారం పూర్తి అక్షరాస్యత ప్రమాణాన్ని అధిగమించాయి. మిజోరం అధికారికంగా చారిత్రాత్మక 98.20 శాతం అక్షరాస్యత రేటును సాధించి, భారతదేశంలో మొట్టమొదటి పూర్తి అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా నిలిచింది. గతంలో అగ్రగామిగా ఉన్న కేరళ వంటి రాష్ట్రాలను కూడా వెనక్కి నెట్టి ఇది ప్రస్తుతం జాతీయ అక్షరాస్యత ర్యాంకింగ్‌లలో అగ్రస్థానంలో నిలిచింది. విద్యను తరచుగా జీవితాలను మార్చే అత్యంత శక్తివంతమైన సాధనంగా అభివర్ణిస్తారు. అందుకే దీనిని రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఒడిశా ప్రభుత్వం కిండర్ గార్టెన్ (కెజి) నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ (పిజి) స్థాయి వరకు ఉచిత విద్యను అందించే 'జ్ఞానోదయ -శిక్షయ రు సమృద్ధి' పథకాన్ని ప్రారంభించింది. ఉచిత కెజి టు పిజి పథకాన్ని 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచినప్పటికీ అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం టిఆర్ఎస్ (ప్రస్తుతం బిఆర్ఎస్) ప్రభుత్వం దానిని అమలుపరచలేదు. దేశవ్యాప్తంగా అక్షరాస్యతా ర్యాంకింగ్‌లో 26వ స్థానంలో ఉన్న ఒడిశా రాష్ట్రం అక్షరాస్యత రేటు సుమారు 79 శాతం కాగా 6 సంవత్సరాల లోపు పిల్లలను మినహాయిస్తే వయోజనులు, యువత అక్షరాస్యత రేటు సుమారు 82.87 శాతంగా ఉంటుంది. అక్షరాస్యతా శాతాన్ని మరింత మెరుగుపరిచేందుకు, ఒడిశా 'ఉల్లాస్' విద్యార్థుల కోసం కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య వంటి పథకాలను అమలు చేస్తోంది. అక్షరాస్యత విషయంలో ఒడిశా రాష్ట్రం గణనీయమైన లింగ, ప్రాంతీయ అసమానతలను ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో మహిళా అక్షరాస్యత 64 శాతం,గిరిజన అక్షరాస్యత ఆందోళనకరంగా 52.24 శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో అక్షరాస్యతా శాతం 85.57 శాతానికి చేరుకోగా,గ్రామీణ ప్రాంతాల్లో అది సగటున 70.22 శాతంగా ఉంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల అక్షరాస్యత రేటు కంటే రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ ఉన్న ఖోర్ధా జిల్లాలో అక్షరాస్యత రేటు అత్యధికంగా 86.88 శాతం ఉంది. ఈ నేపథ్యంలో, సమ్మిళిత, అందుబాటులో ఉండే విద్య దిశగా భారతదేశం సాగిస్తున్న ప్రయాణంలో భాగంగా ఒడిశా ప్రభుత్వం తీసుకున్న ఈ చొరవ ఒక ముఖ్యమైన మైలురాయి అని విద్యావేత్తలు, విద్యార్థులు, విధాన రూపకర్తలు ప్రశంసిస్తున్నారు. ఒడిశా ప్రభుత్వం, కిండర్ గార్టెన్ (కెజి) నుండి పోస్ట్ గ్రాడ్యు



యేషన్ (పిజి)వరకు భారతదేశపు మొట్టమొదటి సార్వత్రిక ఉచిత విద్యా వ్యవస్థను అమలు చేస్తూ, జ్ఞానోదయ - శిక్షా రు సమృద్ధి' పథకాన్ని ప్రారంభించింది. 2026-27 విద్యా సంవత్సరం నుండి అమల్లోకి వచ్చిన ఈ పథకం,ప్రభుత్వ, ప్రభుత్వసహాయక సంస్థలలోని విద్యార్థులందరికీ ప్రవేశ, ట్యూషన్ ఫీజులను మాఫీ చేస్తుంది. ఈ ఫీజు మాఫీ రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కళాశాలలు,ప్రభుత్వ సహాయక కళాశాలలలోని రెగ్యులర్ విధానంలోని తరగతులతో పాటు యుజి, పిజి కోర్సులకు కూడా వర్తిస్తుంది. విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా విద్యాభ్యాసం కొనసాగించేందుకు నిర్దేశించిన ఈ పథకం ద్వారా ఏటా 32 లక్షల మందికి పైగా విద్యార్థులు ప్రయోజనం పొందుతారని ఒక అంచనా. ఈ పథకం అమలు కోసం ఒడిశా ప్రభుత్వం మొదటి సంవత్సరానికి రూ.895.57 కోట్లు, వచ్చే ఐదేళ్ల కోసం రూ. 5,467.55 కోట్లు కేటాయించింది. అదనంగా, ప్రభుత్వం మోడల్ ప్రాథమిక పాఠశాలలను, నాలుగు కొత్త విశ్వవిద్యాలయాలను ప్రారంభించడంతో పాటువచ్చే మూడేళ్లలో 45,000 మంది ఉపాధ్యాయులను నియమిస్తోంది. ఈ పథకం ప్రకటన వెలువడిన తరువాత, ప్రభుత్వేతర సహాయక కళాశాలలు ఆందోళన వెలిబుచ్చాయి. ఈ పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలైతే, ఫీజుల రూపంలో తాము ఆర్జించే ఆదాయం కోల్పోతామని, ఈ ఆదాయమే మౌలిక సదుపాయాలు,ఉపాధ్యాయుల ప్రత్యక్ష జీతాల కోసం వెచ్చిస్తామని, అకస్మాత్తుగా అది కోల్పోతే తమ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తమకుఫీజు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశాయి. విద్యను తరచుగా జీవితాలను మార్చే అత్యంత శక్తివంతమైన సాధనంగా అభివర్ణిస్తారు. అందుకే దీనిని రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఒడిశా ప్రభుత్వం కెజి నుండి పిజి స్థాయి వరకు ఉచిత విద్యను అందించేందుకు ఈనిర్ణయం తీసుకుంది. ఈ సాహసోపేతమైన చొరవ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చడంతోపాటు పెరుగుతున్న విద్యా ఖర్చులతో సతమతమవుతున్న కుటుంబాలకు స్వాంతననిస్తుంది. ఈ కార్యక్రమం కింద, ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులు తమ ప్రాథమిక పాఠశాల విద్య నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు ట్యూషన్ ఫీజులు చెల్లించకుండా విద్యనభ్యసించవచ్చు. విద్యాభ్యాసం కోసం ఆర్థిక అడ్డంకులను తగ్గించడం, విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడం, చదువు మానేసే వారి సంఖ్యను తగ్గించడం,ఆర్థికంగా వెనుకబడిన వర్గాలలో ఉన్నత విద్యను ప్రోత్సహించడం, రాష్ట్ర వ్యాప్తంగా అక్షరాస్యత,నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరచడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలు.ఇది విజయవంతమైతే, విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ఇకపై తమ ఆర్థిక స్థితిగతులపై ఎటువంటి ఆందోళన లేకుండా నిశ్చింతగా విద్యార్జనపైదృష్టి సారించి వృత్తిపరమైన అభివృద్ధి సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది. అక్షరాస్యత అనేది సమాజాభివృద్ధికి మూలాధారం. ఇది ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఆరోగ్య గణాంకాలు, లింగసమానతలు, రాజకీయ అవగాహన లాంటి అంశాలలో అత్యవసరం.ప్రజలలో అక్షరాస్యతను పెంపొం దించడంలో భారతదేశం గణనీయమైన పురోగతిని సాధిం చింది. అయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన వర్గాలు, కొన్ని నిర్దిష్ట రాష్ట్రాలలో ఇప్పటికీ అనేక సవాళ్లు ఉన్నాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలు ఒడిశా ప్రభుత్వం చేపట్టిన ఈచొరవను ఆదర్శంగా తీసుకుని సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలు లేకుండా అన్ని వర్గాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యావకాశాలను కల్పించాలి. ఓటు బ్యాంకు సంక్షేమ పథకాలను సమీక్షి ంచి, హేతుబద్ధత లేని వాటిని అవసరమైతే రద్దుచేసి భావి పౌరు లను తీర్చిదిద్ది భవ్య భారతదేశానికి పునాదులు వేసే ఈ పథకానికి

# ప్రపంచ పక్షవాత సంస్థ పాలక మండలికి డాక్టర్ పి.విజయ ఎన్నిక

గుంటూరు మెడికల్,జూలై 14 ( ప్రభాతవార్త ): భారతదేశంలో పక్షవాత వైద్యరంగ అభివృద్ధికి విశేష కృషి చేసి వేలాది మంది రోగులకు ప్రాణదాతగా నిలిచిన గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్టు, లలిత పి.వి.ఎస్ వైద్య విజ్ఞాన సంస్థ న్యూరోసైన్సెస్ విభాగాధిపతి, అంకినీడు అధునాతన పక్షవాత చికిత్స కేంద్రం సంచాలకురాలు డాక్టర్ పి. విజయకు అత్యున్నత అంతర్జాతీయ గౌరవం లభించింది. ప్రపంచ పక్షవాత సంస్థ పాలక మండలి సభ్యురాలిగా ఆమె ఎన్నిక కావడం దేశ వైద్యరంగానికే గర్వకారణంగా నిలిచింది. ప్రపంచంలోని 95 దేశాలకు చెందిన 3,500 మంది సభ్యుల ఓట్లతో ఎన్నికైన 18 మంది పాలక మండలి సభ్యుల్లో డాక్టర్ విజయ స్థానం దక్కించుకోవడం ఆమె ప్రతిభకు నిదర్శనం. ఆసియా-ఓషియానియా ప్రాంతానికి భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఆమెకు లభించింది.



**పక్షవాత వైద్యానికి జీవితాన్నే అంకితం చేసిన వైద్యురాలు**

పక్షవాతానికి అత్యాధునిక చికిత్సలు అందించడం, శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వైద్య విధానాల రూపకల్పనలో విశేష కృషి చేసినందుకే ప్రపంచ పక్షవాత సంస్థ ఈ అత్యున్నత బాధ్యతలను డాక్టర్ విజయకు అప్పగించింది. భారతదేశంలో ఆధునిక పక్షవాత చికిత్సకు శ్రీకారం చుట్టిన వైద్యుల్లో డాక్టర్ విజయ అగ్రగణ్యులు. 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి పక్షవాత ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించి చరిత్ర సృష్టించారు. ముంబై, చెన్నై తర్వాత దేశంలో ఏర్పాటైన మూడో ప్రత్యేక పక్షవాత కేంద్రం ఇదే కావడం విశేషం. ఆమె నాయకత్వంలో ఈ కేంద్రం దేశంలోనే తొలి గుర్తింపు పొందిన అధునాతన పక్షవాత చికిత్స కేంద్రంగా నిలిచింది.

-భారత స్ట్రోక్ వైద్యరంగ సేవలకు అంతర్జాతీయ గుర్తింపు
- దేశానికే గర్వకారణమైన గుంటూరు వైద్యురాలు
- 95 దేశాల సభ్యుల ఓట్లతో ప్రతిష్ఠాత్మక పాలక మండలిలో స్థానం
- ఆసియా ఓషియానియా ప్రాంతానికి భారత ప్రతినిధిగా ఎంపిక
-ప్రపంచ పక్షవాత చికిత్స విధానాల రూపకల్పనలో కీలక బాధ్యతలు
-నాలుగు దశాబ్దాల సేవలకు ప్రపంచ స్థాయి గుర్తింపు

**ప్రపంచ వైద్య విధానాల్లో కీలక పాత్ర:**

2026 నుంచి 2030 వరకు నాలుగేళ్లపాటు పాలక మండలి సభ్యురాలిగా కొనసాగనున్న డాక్టర్ విజయ ప్రపంచవ్యాప్తంగా పక్షవాత చికిత్స మార్గదర్శకాల రూపకల్పన, వైద్య విధానాల అభివృద్ధి, వైద్యులకు శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, అంతర్జాతీయ పరిశోధనల సమన్వయం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాల విస్తరణ వంటి కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ ఏడాది అక్టోబరులో దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో జరిగే పాలక మండలి తొలి సమావేశంలో ఆమె పాల్గొననున్నారు.

**జాతీయ, అంతర్జాతీయ పురస్కారాల పరంపర**

డాక్టర్ విజయ నాయకత్వంలోని అంకినీడు అధునాతన పక్షవాత చికిత్స కేంద్రం ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకుంది. అమెరికా హృదయ సంఘం అందించే పాల్ డడ్లీ వైట్ అంతర్జాతీయ పండిత పురస్కారం, అమెరికా న్యూరాలజీ అకాడమీ ఏ.బి. బేకర్ పురస్కారం, ప్రపంచ పక్షవాత సంస్థ-ఏంజెల్స్ కార్యక్రమం నుంచి వరుసగా వజ్ర స్థాయి పురస్కారాలు అందుకోవడం ఆమె సేవలకు నిదర్శనంగా నిలిచాయి.

**ఆంధ్రప్రదేశ్‌కు, భారతదేశానికి అపూర్వ గౌరవం..**

ప్రపంచ పక్షవాత సంస్థ పాలక మండలికి డాక్టర్ పి. విజయ ఎన్నిక కావడం వ్యక్తిగత విజయమే కాకుండా భారతదేశ పక్షవాత వైద్యరంగం సాధించిన ఘన విజయంగా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఆమె సేవలు ప్రపంచ వేదికపై మరోసారి గుర్తింపు పొందడం లలిత పి.వి.ఎస్ వైద్య విజ్ఞాన సంస్థకు, ఆంధ్రప్రదేశ్ వైద్య సమాజానికి, యావత్ భారతదేశానికి గర్వకారణమని పలువురు గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఆసుపత్రి పర్యవేక్షకుడు గుంటూరు నగరంలోని న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు లలితా ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ విజయను ప్రముఖులు అభినందించారు.

## సమాజానికి సైకాలజిస్ట్‌లు అవసరం

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై14, ప్రభాతవార్త: సమాజానికి సైకాలజిస్ట్‌లు అవసరమని ఏఎన్‌యు సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య అన్నారు. సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో సైకాలజిస్ట్ అప్రిసియేషన్ దినోత్సవ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి విభాగం అధ్యాపకులు డా॥ కె.కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీరయ్య మాట్లాడుతూ




ప్రస్తుతకాలంలో వ్యక్తి వికాసానికి, సామాజిక సమస్యలను ఎదుర్కొనడానికి, సంఘర్షణలను అధిగమించడానికి సైకాలజిస్ట్‌లు ప్రముఖపాత్ర నిర్వహిస్తున్నారని వారి సేవలను కొనియాడారు. పూర్వ విద్యార్థిగా పాల్గొన్న వ్యాయామ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య వై.కిషోర్ మాట్లాడుతూ నేడు ప్రతి రంగానికి సైకాలజిస్ట్‌ల సేవలు అవసరం అన్నారు. సైకాలజీ విభాగం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం సైకాలజీ విభాగంలో పూర్వ విద్యార్థుల వార్షి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సైకాలజిస్ట్‌లుగా సేవలు అందించిన పలువురిని విభాగం అధ్యాపకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డా॥ టిడి.విమల, ఎస్.ప్రమీళారాణి, సిబ్బంది కె.శాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇరువురు వ్యక్తులు అరెస్ట్

గుంటూరు క్రైమ్,జులై14,ప్రభాతవార్త: గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఇరువురి వ్యక్తులను టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు.పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గుంటూరు జిల్లా మేడికొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొర్రపాడు గ్రామ శివారు ప్రాంతంలో మూడుమల్ల చేను చెట్టు కింద పేకాట నిర్వహిస్తున్నట్లు టాస్క్ ఫోర్స్‌కు విశ్వసనీయ సమాచారం అందింది.ఈ సమాచారాన్ని డీఎస్‌బీ డీఎస్పీకి తెలియజేసి, సీఐ2 ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ సిబ్బంది మేడికొండూరు పోలీస్ స్టేషన్ పోలీసులతో కలిసి మంగళవారం దాడి నిర్వహించారు.పోలీసులు వస్తున్నట్లు గమనించిన పేకాట నిర్వాహకులు, ఆటగాళ్లలో ఆరుగురు అక్కడి నుంచి పరారయ్యారు.ఘటనలో పేకాట నిర్వాహకుడిగా టి. శ్రీనివాసరావు (కొర్రపాడు గ్రామం)ను గుర్తించారు.ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని,వారి వద్ద నుంచి 2 సెల్‌ఫోన్లు, 1 ద్విచక్ర వాహనం, రూ.6,320 నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు,అదుపులోకి తీసుకున్న వ్యక్తులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం మేడికొండూరు పోలీస్ స్టేషన్ వారికి అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు.



### పేకాట స్థావరంపై దాడి

గుంటూరు క్రైమ్,జులై14,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని రత్నగిరి నగర్ రైల్వే కట్ట సమీపంలోని రేకుల ఇంటిలో పేకాట నిర్వహిస్తున్నట్లు టాస్క్ ఫోర్స్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ సమాచారాన్ని డీఎస్‌బీ డీఎస్పీకి తెలియజేసి సీఐ2 ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ సిబ్బంది,నల్లపాడు స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో కలిసి మంగళవారం దాడి నిర్వహించారు.ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 5 సెల్‌ఫోన్లు,రూ.6,240 నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు,అదుపులోకి తీసుకున్న వ్యక్తులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం నల్లపాడు పోలీస్ స్టేషన్ వారికి అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు.



# గుంటూరు వార్త

## ఎస్పీ ఆకస్మిక తనిఖీ

గుంటూరు క్రైమ్,జులై14,ప్రభాతవార్త: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం గుంటూరు ఉమెన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీకి సాయుధ గార్డు గార్డ్ ఆఫ్ ఆనర్ సమర్పించింది.అనంతరం పోలీస్ స్టేషన్ రిసెప్షన్,సీఐ1,సీఐ2 కౌన్సెలింగ్ గదులు, స్టేషన్ పరిసరాలు,స్టేషన్ భవనంపై ఉన్న ఎస్‌టీఎఫ్ కార్యాలయం,ఎస్‌టీఎఫ్ సిబ్బందికి కేటాయించిన డార్మిటరీలను క్షుణ్ణంగా పరిశీలించారు.స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు,సిబ్బందితో సమావేశమైన ఎస్పీ వారు ఎంతకాలంగా విధులు నిర్వహిస్తున్నారు,ప్రస్తుతం ఏ బాధ్యతలు



నిర్వర్తిస్తున్నారు,విధుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలుసుకుని,అవసరమైన సూచనలు చేశారు.మహిళలకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి,చట్టపరమైన చర్యలు ఆలస్యం లేకుండా చేపట్టాలని,ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన కేసుల్లో వెంటనే నమోదు చేసి, దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, ఛార్జ్‌షీట్లు త్వరితగతిన దాఖలు చేయాలని ఆదేశించారు.స్టేషన్‌లో యూ.ఐ.లో ఉన్న పాత పెండింగ్ కేసులను ఒక్కొక్కటిగా సమీక్షించి,వాటిని ప్రాధాన్యత ఆధారంగా త్వరగా పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.క్రైమ్ రికార్డులు,ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు,కేసు డైరీలు,స్టేషన్ రికార్డులు,మాల్ఖానా నిర్వహణ, విజిటర్ రిజిస్టర్,సీసీటీఎన్ఎస్ నమోదులు తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి,అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.మహిళా బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి భరోసా కల్పించేలా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,కుటుంబ వివాదాల పరిష్కారానికి కౌన్సెలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు,చట్టపరమైన కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు.బాధిత మహిళలకు సురక్షితమైన,స్నేహపూర్వక వాతావరణం కల్పించడం ప్రతి పోలీసు అధికారికి బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. గుంటూరు టౌన్‌లో పనిచేస్తున్న శక్తి టీమ్స్1,శక్తి టీమ్స్ 2తో పాటు జిల్లాలోని అన్ని శక్తి టీమ్‌లకు లైజన్ అధికారిగా ఉన్న ఉమెన్ పోలీస్ డీఎస్పీ,శక్తి టీమ్‌లు మరింత సమర్థవంతంగా పనిచేసేలా పర్యవేక్షించాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. ఈ తనిఖీలో ఉమెన్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి,సీఐ అంజయ్య,సీఐ రమేష్,ఎస్ బి సీఐ 1 మల్లికార్జున రావు,ఎస్ఐ భవాని,ఎస్ఐ తరంగిణి,స్టేషన్ రైటర్ యోహాన్,పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఎన్‌యులో పదోన్నతులపై రగడ.. రగడ..!

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై14, ప్రభాతవార్త: వర్సిటీలో ఉద్యోగుల పదోన్నతులపై మరొకసారి రగడ చోటుచేసుకుంది. మంగళవారం వికాస ఉద్యోగ సంఘం కార్యవర్గం ఉద్యోగుల పదోన్నతులపై వీసి ఆచార్య కె.గంగాధరరావుతో వాగ్వాదానికి దిగారు. సంఘం నాయకులు వీసి వద్ద ఉద్యోగులకు సకాలంలో పదోన్నతుల రాకపోవడం వల్ల మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విన్నవించారు. ఈక్రమంలో మాటామాటా పెరిగి వాగ్వాదానికి దారితీసింది. అధ్యాపకుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం దొరుకుతుందని, ఉద్యోగుల విషయంలో చిన్నచూపు ధోరణి చూపుతున్నట్లు అర్థమౌతుందన్నారు. ఇలాగే వ్యవహరిస్తే ధర్నా చేయడానికి కూడా వెనుకాడబోమనే దీంతో వీసి అసహనానికి గురయ్యారు. తనకు అధ్యాపకులు, ఉద్యోగులు సమానమేనని అన్నారు. ఒక అధికారి దగ్గర ఇలా ప్రవర్తించడం సరికాదని అన్నట్లు తెలిసింది. ఉద్యోగుల సమస్యలు కూడా పరిష్కరిస్తున్నామని వీసి పేర్కొన్నారు. ఉద్యోగుల పదోన్నతుల విషయంలో అందరికి న్యాయం చేస్తామని, కొద్దిరోజుల్లోనే పదోన్నతులపై దృష్టిసారిస్తామని చెప్పడంతో వికాస నాయకులు శాంతించారు. కాగా సాయంత్రానికి ఇద్దరు ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చారు. అసిస్టెంట్ కుక్‌లుగా ఉన్న ఎన్.యోహాను, డి.రమణమ్మలను హెడ్ కుక్‌లుగా పదోన్నతులు కల్పించడం గమనార్హం.

## ఫోటోగ్రఫీలో సునీల్‌కుమార్‌కు బంగారు పతకాలు

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై14, ప్రభాతవార్త: ఏఎన్‌యులో ఫోటోగ్రాఫర్‌గా విధులు నిర్వహిస్తున్న గుత్తా సునీల్‌కుమార్‌కు రెండు బంగారు పతకాలు, ఒక మెరిట్ సర్టిఫికెట్ వచ్చాయి. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫోటోగ్రఫీ సంస్థ 2026లో 9వ ఎఫ్ఐపి గ్రాండ్ నేషనల్ ప్రింట్ సలాన్ కన్వెన్షన్ నిర్వహించింది. ఈ కన్వెన్షన్‌కు ఆసక్తి ఉన్న ఫోటోగ్రాఫర్‌లు ఫోటోలను పంపాలని సూచించింది. ఇందులో సునీల్ తీసిన 3 ఫోటోలు అవార్డులు తెచ్చిపెట్టాయి. ది ఎలిక్సిర్ ఆఫ్ లైఫ్ కేటగిరిలో ఒకటి, ది ట్రైబల్ లైఫ్ కేటగిరిలో మరొక బంగారు పతకంకు ఎంపికయ్యాయి. అలాగే మరొక కేటగిరిలో సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ సాధించింది. సునీల్‌కుమార్ విధుల నిర్వహణతో పాటు తనలోని ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పేవిధంగా తీసిన చిత్రాలు తన వ్యక్తిగత ఎదుగుదలతో పాటు యూనివర్సిటీకి కూడా పేరు ప్రఖ్యాతులు తెస్తున్నాయని ఇన్‌చార్జ్ వీసి ఆచార్య కె.గంగాధరరావు అభినందించారు. ఇప్పటికే అనేక సంస్థలు సునీల్‌తీసిన చిత్రాలకు అవార్డులు, రివార్డులు తెచ్చిపెట్టాయని, రానున్న రోజుల్లో మరింత పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంలో రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, జర్నలిజం విభాగాధిపతి ఆచార్య కె.జ్యోతిర్మయి, వికాస, దినసరి వేతన ఉద్యోగుల సంఘంలు సునీల్‌కు అభినందనలు తెలియజేశారు.



## అందలం అందేనా...!?

### - ఇన్‌చార్జ్ వీసిగా గంగాధరరావుకు రెండేళ్ళు పూర్తి

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై14, ప్రభాతవార్త: ఏఎన్‌యు ఇన్‌చార్జ్ వీసి ఆచార్య గంగాధరరావు రెండేళ్లుగా రెగ్యులర్ పదవి కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. రెగ్యులర్ వీసి అందలం అందుతుందా..! అంటూ వర్సిటీలో ఆయనపై సానుభూతి రోజురోజుకు పెరుగుతుంది. ఇన్‌చార్జ్ వీసిగా గంగాధరరావు మంగళవారానికి రెండేళ్ళు పూర్తయింది. కాగా, 2025లో రెగ్యులర్ వీసి పదవికి ప్రభుత్వం సెర్చ్ కమిటీ నియమించింది. దాని ప్రకారం బెనారస్ హిందూ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్న ఆచార్య సత్యన్నారాయణ రాజును 2025 అక్టోబరు 8న రెగ్యులర్ వీసిగా గవర్నర్ నియమించారు. ఆయన విధుల్లో చేరకపోవడంతో కొత్త వీసి బాధ్యతలు తీసుకునేవరకు పాలనకు ఇబ్బందులు కలుగకుండ గంగాధరరావును ఇన్‌చార్జ్‌గా కొనసాగాలని వర్సిటీకి ఒక లెటర్ వచ్చింది. అప్పటినుంచి గంగాధరరావు ఇన్‌చార్జ్‌గా వీసిగా కొనసాగుతున్నారు. గత నెలలో ఒంగోలులో ఉన్న యూనివర్సిటీకి కొత్త వీసి నియామకానికి సెర్చ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈక్రమంలో ఏఎన్‌యుకు కూడా సెర్చ్ కమిటీ వేస్తారనే ప్రచారం జరుగుతుంది.



**చర్యలపై మౌనం:** రెగ్యులర్ వీసి మాదిరిగా అన్ని నిర్ణయాలు తీసుకుంటున్న గంగాధరరావు గడిచిన 2ఏళ్ళలో వర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగించిన అంశాలపై మౌనంగా ఉండటం వర్సిటీ పాలనపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుంది. కొన్ని సంఘటనల్లో కేవలం కమిటీలు వేసి ఆ నివేదికలు అమలు చేయలేదని సమాచారం. అలాగే రెండేళ్ళలో ఎటువంటి టెండర్‌లు లేకుండా వ్యాపారాలు జరుగుతున్నాయని, అనర్హులకు పదోన్నతులు ఇవ్వడం వంటి అంశాలు కూడా ప్రభుత్వానికి పిర్యాదుల రూపంలో వెళ్ళడం తీవ్రదుమారాన్ని రేపుతున్నాయి. పాలనలో తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు ఆయా వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమౌతుంది. ఇటువంటి నిర్ణయాలు ఆయనను పదవికి దూరం చేస్తున్నాయా అనే సందేహాలు లేకపోలేదు. ఇదీగాగ వెన్నంటిఉన్న కొందరు ఆయనకు పోటీగా ఎఫ్ఏసి ఇవ్వాలని దరఖాస్తులు చేయడం, పలువురు ప్రజాప్రతినిధులను కలవడం కొత్తచర్చకు దారితీస్తుంది. రాజధానిలో ప్రభుత్వ యూనివర్సిటీగా ఉన్న ఏఎన్‌యు మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గంలో ఉండటం ఒకెత్తయితే మంగళగిరికి ఎంఎల్ఏగా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా సీఎం చంద్రబాబు తనయుడు నారా లోకేష్ ఉన్నారు. ఆయన ప్రత్యేక చొరవచూపాలని, 50ఏళ్ళ గోల్డెన్‌జూబ్లీ యూనివర్సిటీకి ప్రస్తుతం ఇన్‌చార్జ్ పాలన సమంజసంకాదని విన్నవిస్తున్నారు. రెండేళ్ళుగా కేవలం ఇన్‌చార్జ్‌గానే గంగాధరరావును కొనసాగిస్తుండటం పట్ల ఉద్యోగులు, సానుభూతిపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగాధరరావుకు కనీసం ఎఫ్ఏసి హోదా అయినా ఇవ్వాలని కోరుతుండటం గమనార్హం.

# మెడికల్ కళాశాల పల్నాడు చరిత్రలోనే సువర్ణ అధ్యాయం

### ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

పిడుగురాళ్ల, జూలై 14 ప్రభాతవార్త : వెనుకబడిన పల్నాడు ప్రాంతానికి మెడికల్ కళాశాల మంజూరు కావడం పల్నాడు చరిత్రలోనే ఒక సువర్ణ అవకాశం అని నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో హైవేకు ఆనుకొని నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య, విద్య కళాశాలను ఆయన మంగళవారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం



అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతోపాటు 100 మెడికల్ సీట్లు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ఇప్పటికే 400 ఓపీ వస్తుందని, ఇంకా పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మెడికల్ కళాశాలకు మొత్తం 600 మంది స్టాఫ్ అవసరమని, ఇప్పటికే 273 మందిని రిక్రూట్‌మెంట్ చేసుకున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మాణం జరుగుతుందని, వైసీపీ ప్రభుత్వంలోనే మంజూరైందన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం 28 శాతం పూర్తి చేసి అయిపోయిందంటూ అబద్ధపు ప్రచారాలు చేసుకోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో మంజూరైన 17 మెడికల్ కళాశాలలో 11 కళాశాలలకు పనులు కూడా మొదలుపెట్టినట్లు తెలిపారు. పులివెందులకు మంజూరైన ఒక్క వైద్యశాలకు మాత్రమే 70 శాతం పనులు చేశారని, రాష్ట్రానికి మంజూరైన ఒక్క వైద్య శాల కూడా పనులు ప్రారంభించకుండా మొత్తం చేశామంటూ ప్రచారాలు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు పిడుగురాళ్లలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలకు రాష్ట్రంలోనే అతిపెద్ద వైద్య కళాశాలగా రూపొందితుందన్నారు. పల్నాడు ప్రాంతంలో నిర్మిస్తున్న ఈ వైద్యశాలకు 100 మెడికల్ సీట్లు కేటాయించడం గొప్ప అవకాశం అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని రాజధానిగా నిర్మిస్తామంటూ అసెంబ్లీలో తీర్మాణించడం జరిగిందని, దానికి వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కూడా అంగీకారం తెలిపారన్నారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మూడు రాజధానులంటూ రాష్ట్రాన్ని ముక్కలు చేశారన్నారు. కానీ ఎక్కడా రాజధానికి సంబంధించిన పనులు ప్రారంభించకపోగా అభివృద్ధిని తుంగలో తొక్కారన్నారు. అందుకే ప్రజలు 151 నుంచి 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ప్రజలు ఉపయోగపడే పనులను ఆపలేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రతి పక్ష నేతలు తెలుసుకొని ప్రవర్తిస్తే మంచిదని హితవు పలికారు.

**పల్నాడు మణిహారం ప్రభుత్వ వైద్యశాల: ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పల్నాడు మణిహారం ప్రభుత్వ వైద్యశాల అని కొనియాడారు. ఈ వైద్యశాల రాష్ట్రంలోనే అతిపెద్ద వైద్యశాలగా రూపుదిద్దుకుంటుందన్నారు. పల్నాడు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఎడ్యుకేషన్, టూరిజం,



ఇండస్ట్రీస్ పరంగా అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు అంటారన్నారు. గతంలో పల్నాడు ప్రాంతంలో ఫ్యాక్షన్ రాజకీయాలు నడిచేవన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక తనకు గురజాల ఎమ్మెల్యే సీటు ఇచ్చారని, అప్పుడు అన్న ఎన్టీఆర్ ఫ్యాక్షన్ రాజకీయాలను రూపుమాపి అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగాలని అనే వారన్నారు. అందుకే తాను మొదట ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి పల్నాడు ఫ్యాక్షన్ రాజకీయాలను రూపుమాపేశానని చెప్పారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేశామన్నారు. ఉచిత వైద్యానికి పల్నాడు ప్రాంతంలో వైద్య కళాశాల త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అంకిత మివ్వాలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మెడికల్ కళాశాలకు 100 సీట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటి సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రులు సత్యప్రసాద్, నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ప్రతి రోజూ 400 మందికి ఓపి చూడడం జరుగుతుందన్నారు. తన సొంత నిధులతో ఆర్వో ప్లాంట్, స్టాఫ్‌కు భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. పల్నాడు ప్రాంతాన్ని అతిపెద్ద అగ్రికల్చర్, హార్టికల్చర్, విద్యారంగం ఇండస్ట్రీస్ పరంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని పీహెచ్‌సీలకు తమ సొంత నిధులతో ఏసీ, ఆర్వో ప్లాంట్‌ను అందించామన్నారు. మెడికల్ కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, డాక్టర్ ఉన్నం నాగమల్లిఖార్జునరావు, రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడు దియ్య రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పిల్లి చెన్నారావు, మండల అధ్యక్షుడు గండికోట వెంకటేశ్వర్లు, సీనియర్ నేతలు వడపల్లి సర్వేశ్వరరావు, సయ్యద్ అమీర్ అలి, సాంబశివరావు, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ గౌరి, ప్రిన్సిపాల్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## పెదకాకాని శివాలయంలో రాహు కేతు పూజలకు పోటెత్తిన భక్తులు

గుంటూరు, జులై 14, ప్రభాతవార్త:అమావాస్య మంగళవారము సందర్భంగా ఆలయంలో రాహు కేతు పూజలు భక్తులు అధిక సంఖ్యలో జరిపించుకున్నారు. తెల్లవారుజాము గం.5 నుండి నుంచి మధ్యాహ్నం రాహుకాలం 3:00 వరకు 1061 టికెట్లు భక్తులకు విక్రయించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్, పాలకమండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రావు తెలిపారు.రాహు కేతు పూజల ద్వారా రూ. 5,30,500 లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం లేకుండా తగు ఏర్పాటు చేసిన తెలిపారు.



**IN THE COURT OF THE HON'BLE III ADDL. SENIOR CIVIL JUDGE, R.R. DISTRICT AT: L.B. NAGAR**
**O.S. No. 363 of 2016**

Between:
1, Smt. S.Sunitha, W/o. S.Krushna, aged about 54 years, Household, Presently Residing at H.No.11-10-365/1/A, Road No.1, Telephone Colony, Saroor Nagar, R.R. District-500035, & Another ...Plaintiffs
AND
Smt. Yerra Ramulamma, W/o. Late. Y. Yellaiah, Aged about: 64 Yrs., Household, R/o. H.No.4-1-20, Hayathnagar, R.R.Dist. & 12 Others ...Defendants
To
Sri. M.Narendra, S/o. N.Rama Rao, Aged about: 47 Yrs, Occ: Business, R/o. Thimmapuram (Village), Yedlapady Revenue Mandal, Guntur Dist.
(Proposed Defendant No.13)

Please take notice that, the Plaintiffs have filed the above Suit for Declaration of title and Perpetual Injunction against you (as proposed Defendant No. 13) in respect of suit schedule property and upon hearing the Plaintiffs the Hon'ble Court was pleased to order the service of summons against you (as proposed Defendant No.13) by way of publication and the case has been posted to 16.07.2026 at 10.30 a.m for your appearance. Hence, you are advised to appear before the Hon'ble Court on the said date and time, otherwise the matter will be decided against you.

A - SCHEDULE OF PROPERTY: All that piece and parcel of land bearing part of Plot No.1 (East Part) in Sy. Nos. 113, 114, 118, 119A and 119B, admeasuring 150 Sq. Yds or its equivalent to 125.41 Sq.Mtrs (out of 414 Sq. Yds) under Ward No.4, Block No. 11 of POULTRY COMPLEX, situated at Anmagal Hayathnagar (V), Hayathnagar Rev. Mandal, R.R. Dist, under GHMC, L.B.Nagar Circle, Hyderabad, Registration Sub-Dist, Hyderabad-East and bounded by: NORTH: 33' Wide Road & Part of Plot No.1, SOUTH:Plot No.2, EAST:Plot No.6, WEST: Plot No. 1 (North-West) & (South-West) Parts.

B - SCHEDULE OF PROPERTY: All that piece and parcel of land bearing part of Plot No.1 (North-West Part) in Sy. Nos. 113, 114, 118, 119A and 119B, admeasuring 137 Sq. Yds or its equivalent to 114.54 Sq.Mtrs (out of 414 Sq. Yds) under Ward No.4, Block No. 11 of POULTRY COMPLEX, situated at Anmagal Hayathnagar (V), Hayathnagar Rev. Mandal, R.R. Dist, under GHMC, L.B.Nagar Circle, Hyderabad, Registration Sub-Dist, Hyderabad-East and bounded by: NORTH: 33' Wide Road & Part of Plot No.1, SOUTH: Part of Plot No.1 (South-West Part), EAST :Part of Plot No.1 (East Part), WEST: 30' Wide Road.

C - SCHEDULE OF PROPERTY: All that piece and parcel of land bearing part of Plot No.1 (South-West Part) in Sy. Nos. 113, 114, 118, 119A and 119B, admeasuring 127 Sq. Yds or its equivalent to 106.18 Sq.Mtrs (out of 414 Sq. Yds) under Ward No.4, Block No. 11 of POULTRY COMPLEX, situated at Anmagal Hayathnagar (V), Hayathnagar Rev. Mandal, R.R. Dist, under GHMC, L.B.Nagar Circle, Hyderabad, Registration Sub-Dist, Hyderabad-East and bounded by: NORTH: Part of Plot No.1(North-West part), SOUTH:Plot No.2, EAST:Part of Plot No.1(East part), WEST:30' Wide Road.

\\ BY ORDER OF THE COURT//

Sri. CH.GOVARDHAN RAO &
Sri. P. NAVEEN KUMAR
ADVOCATES
H.No.4-190/42, Phase-I, Bhaskar Rao Nagar Colony, Sainkipuri, Secunderabad-500094. Mob.No. 9441300650/ 9849510640

## పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థి మండలి ఎన్నికలు విజయవంతం

### ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యత




సత్తెనపల్లి, జూలై 14, ప్రభాతవార్త: పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం సత్తెనపల్లిలో సోమవారం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం, ప్రజాస్వామ్య విలువలు మరియు నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు విద్యార్థి మండలి ఎన్నికలు ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో పారదర్శకంగా, క్రమశిక్షణతో విజయవంతంగా నిర్వహించారు.ఎన్నికల కార్యక్రమం లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించారు. ఎన్నికల కమిటీ ఆధ్వర్యంలో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యింది. అనంతరం ఉపాధ్యాయుల సమక్షంలో ఓట్ల లెక్కింపు నిర్వహించబడింది. విద్యాలయం నాయక (బాలిక) పదవికి జరిగిన ఎన్నికల్లో స్వీటీబాయి 185 ఓట్లు సాధించి విజయం సాధించగా, సల్మా 110 ఓట్లు పొందారు.అదేవిధంగా విద్యాలయం నాయకుడు (బాలురు)పదవికి జరిగిన ఎన్నికల్లో అవినాష్ 153 ఓట్లు సాధించి విజేతగా నిలిచారు. ఇతర అభ్యర్థుల్లో పాల్ ఉబేద్ 114 ఓట్లు, ప్రణవ్ 60 ఓట్లు పొందారు. ఫలితాల ప్రకటన అనంతరం పాఠశాలలో ఆనందమైన వాతావరణం నెలకొంది. విజేతలను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ఘనంగా అభినందించారు. ఎన్నికల్లో పాల్గొన్న అభ్యర్థులు ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతూ ఫలితాలను గౌరవంగా స్వీకరించి, పాఠశాల అభివృద్ధి కోసం కలిసి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ... విద్యార్థి మండలి ఎన్నికలు కేవలం ఎన్నికల ప్రక్రియ మాత్రమే కాకుండా, విద్యార్థుల్లో నాయకత్వం, క్రమశిక్షణ, సేవాభావం, బాధ్యత మరియు ప్రజాస్వామ్య విలువలను పెంపొందించే ఉత్తమ వేదిక అని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన విద్యాలయ నాయకుడు, నాయికలకు అభినందనలు తెలియజేస్తూ, వారు పాఠశాల శ్రేయస్సు కోసం ఆదర్శప్రాయంగా, నిస్వార్థంగా సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ ఎన్నికలు జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని ఆయన తెలిపారు. ఈ ఎన్నికల విజయవంతమైన నిర్వహణలో సహకరించిన ఉపాధ్యాయులు, ఎన్నికల కమిటీ సభ్యులు మరియు విద్యార్థులందరినీ పాఠశాల యాజమాన్యం ను అభినందించారు.

## 200 కిలోల గంజాయి రవాణా కేసు.. సత్తెనపల్లికి చెందిన ఇద్దరి అరెస్ట్



సత్తెనపల్లి, జూలై 14, ప్రభాతవార్త: అనకాపల్లి జిల్లాలో వెలుగుచూసిన గంజాయి అక్రమ రవాణా కేసులో సత్తెనపల్లికి చెందిన ఇద్దరు యువకులను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వాహనాల తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపేందుకు పోలీసులు ప్రయత్నించగా, అందులో ఉన్న వ్యక్తులు వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు సమాచారం. తనిఖీలు నిర్వహించిన పోలీసులు కారులో సుమారు 200 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చేపట్టిన దర్యాప్తులో ఈ అక్రమ రవాణాలో సత్తెనపల్లికి చెందిన ఇద్దరు యువకుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించి మరికొంత మంది పాత్రపై కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

## క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం... విద్యార్థిని దుర్మరణం!

సత్తెనపల్లి, జూలై 14, ప్రభాతవార్త: పేరేచర్ల కొండమోడు రహదారి విస్తరణ పనుల్లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ పరిధిలోని నలంద కాలేజీ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న ఓ విద్యార్థినిని.. రోడ్డు పనుల నిమిత్తం వచ్చిన క్రేన్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలికను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె పరిస్థితి విషమించి కన్నుమూసింది. రహదారి పనులు జరుగుతున్న సమయంలో క్రేన్ డ్రైవర్ కనీస జాగ్రత్తలు తీసుకోలేదని, పక్కనే వెళ్తున్న బాలికను గమనించకుండా అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ఘోరం జరిగిందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రహదారి పనుల వద్ద కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

## సత్తెనపల్లి పోలీస్ స్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రికి తరలింపు

సత్తెనపల్లి, జూలై 14, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. స్థానికంగా హోటల్ నిర్వహిస్తున్న పాలేటి జయబాబుకు పోకల కాంతమ్మ, నాగరాజులతో ఆర్థిక లావాదేవీల విషయంలో వివాదాలు ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో విచారణ కోసం



పోలీసులు జయబాబును స్టేషన్‌కు పిలిపించారు. జయబాబు తన స్నేహితుడు పున్నారావుతో కలిసి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ నాగమల్లేశ్వరరావు విచారణ నిర్వహిస్తున్న సమయంలో జయబాబు తన జేబులో దాచుకున్న పురుగుల మందు డబ్బాను తీసి తాగాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, స్నేహితుడు పున్నారావు కలిసి అతడిని సత్తెనపల్లి ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై స్పందించిన పున్నారావు, కాంతమ్మ, నాగరాజులు తరచూ పోలీసు కేసులతో జయబాబును ఇబ్బందులకు గురిచేస్తుండటంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

## ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు శిక్షణ

పిడుగురాళ్ల, జూలై 14 ప్రభాతవార్త : మండలంలోని రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమును ఉద్యానవన శాఖాధికారులు, ఆయిల్ ఫామ్ కంపెనీ ప్రతినిధులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహనరావు ఆయిల్ ఫామ్ పంట ప్రాముఖ్యత, అధిక దిగుబడి,



మార్కెట్ అవకాశాలు, నాటే విధానం, ఎరువుల యాజమాన్యం, నీటి నిర్వహణ, తెగుళ్ళు, పురుగుల నివారణ చర్యలను రైతులకు వివరించారు. మొక్కల నాటకం, డ్రిప్ ఇరిగేషన్ వినియోగం, అంతర పంటల సాగు, దిగుబడి పెంపు పద్దతులపై సూచనలు చేశారు. మండల ఉద్యాన శాఖాధికారి అంజలీబాయి మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు, రాయితీ వివరాలను గురించి వివరించారు. ఆయిల్ ఫామ్ మొక్కల ఖరీదుపై 100 శాతం రాయితీతో ఒక హెక్టారుకు 150 మొక్కలు చొప్పున విదేశీ మొక్కలకు రూ.193లు, దేశీ మొక్కలకు రూ.133 చొప్పున రూ.29 వేల వరకు రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వాల్యూ ఆయిల్ ఏరియా మేనేజర్ నవీన్, ఫీల్డ్ ఆఫీసర్ రాజు, రవి, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ డాక్టర్స్ నెట్‌వర్క్ చైర్మన్‌గా డాక్టర్ ధూళిపాళ్ల

పిడుగురాళ్ల, జూలై 14 ప్రభాతవార్త : జూనియర్ డాక్టర్స్ నెట్‌వర్క్ రాష్ట్ర చైర్మన్‌గా పిడుగురాళ్లకు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ధూళిపాళ్ల భరత్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈయన రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులుగా, ఐఎంఏ సీజీపీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్స్ ఇన్ దయాబెటాలజీ కన్వీనర్‌గా, ఐఎంఏ రాష్ట్ర స్టాండింగ్ కమిటీ ఆన్ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ ఇనిషియేటివ్ కమిటీ కన్వీనర్‌గా, జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నవంబర్ 22వ తేదీన అమలాపురంలో జరగనున్న ఐఎంఏ రాష్ట్ర వార్షిక మహాసభలో జూనియర్ డాక్టర్స్ నెట్ వర్క్ చైర్మన్‌గా అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ధూళిపాళ్ల మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్ర నాయకత్వానికి ఎన్నికల కమిషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.




## ఛలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

పిడుగురాళ్ల, జూలై 14 ప్రభాతవార్త : సీఐటీయూ ఆధ్వర్యాన ఈనెల 31వ తేదీన నిర్వహించనున్న ఛలో కలెక్టర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ తెలకపల్లి శ్రీనివాసరావు అన్నారు. యూపీహెచ్‌సీలలో వైద్యులు రమాదేవి, షేక్ నస్రుద్దీన్‌లకు అనుమతి కోరుతూ మంగళవారం ఆశావర్కర్లు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యాన్ని అమలు చేయాలని, గ్రాట్యుటీని అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఈనెల 31వ తేదీన కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు మీసాల మరియమ్మ, వెంకటలక్ష్మి, అనంతలక్ష్మి, జ్యోతి, లక్ష్మి, శ్వేత, నిర్మల, భాగ్యలక్ష్మి, అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.



## బోధి పాఠశాలలో ఆధార్ అప్‌డేషన్

పిడుగురాళ్ల, జూలై 14 ప్రభాతవార్త : మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో గల బోధి పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఆధార్ అప్‌డేషన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేషన్, ఫోటో అప్‌డేషన్, పేరు, పుట్టిన తేదీ, చిరునామా తదితర ఆధార్ వివరాల సవరణ సేవలు అందించారు. ప్రజల సమయం, ప్రయాణ ఖర్చు ఆదా కావడంతోపాటు ప్రభుత్వ సేవలు, విద్యా సంబంధిత అవసరాలకు సరైన ఆధార్ వివరాలు ఉపయుక్తమవుతాయి. పాఠశాల యాజమాన్యం



మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, స్థానిక ప్రజలకు ఉపయోగపడే సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో బోధి పాఠశాల ముందుంటుందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలను నిర్వహించేందుకు పాఠశాల కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## టీడీపీ కార్యాలయంలో వైభవంగా చీఫ్ విప్ జీవి జన్మదిన వేడుక

నరసరావుపేట టౌన్, జూలై 14 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ చీఫ్ విప్ జీవి. ఆంజనేయులు జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు కడియాల వెంకటేశ్వరరావు, ఎంఎస్ఎంఈ



రాష్ట్ర డైరెక్టర్ రాపర్ల జగ్గారావు, సాంస్కృతిక కళాపరిషత్ రాష్ట్ర డైరెక్టర్ బందారుపల్లి విశ్వేశ్వరరావు హాజరై కేక్ కట్ చేసి చీఫ్ విప్ ఆంజనేయులుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కడియాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వ చీఫ్ విప్ జీవి. ఆంజనేయులు ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడని అన్నారు. వినుకొండ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి గొట్టిపాటి జనార్ధన్ బాబు, తిరుమలకొండ నరసింహారావు, సీనియర్ నాయకులు వాసిరెడ్డి రవి, కొట్టా కిరణ్, పులుకూరి జగ్గయ్య, షేక్ రఫీ, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి,కూరపాటి హనుమంతరావు, కొంగర రమేష్ బాబు, విడపలపాటి అన్నవయ్య, జనసేన పార్టీ నాయకులు షేక్. అద్రుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి జిల్లా పర్యటనపై సమీక్ష

నరసరావుపేట, జులై 14 ప్రభాతవార్త : ఈ నెల 17 న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నరసరావుపేటలో పర్యటించనున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే లతో కలిసి పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ, మన ఆంధ్రప్రదేశ్ లో మొదటిసారిగా భారీ రుణ మేళ కార్యక్రమం (క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం )




పల్నాడు జిల్లాలో నిర్వహించుకోవడం అదృష్టం అని, ఈ కార్యక్రమంలో సుమారు 30 వేల మంది లబ్ధిదారులు పాల్గొంటారని, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సుమారు 500 బస్సు లు ఏర్పాటు చేసామని అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ, ఈ ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంలోనే సుమారు రూ.2,500 కోట్ల రుణాలను వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ, ముద్ర, ఎంఎస్ఎంఈ, వ్యవసాయం, విద్య, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర పథకాల లబ్ధిదారులకు రుణాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. వెనుకబడిన పల్నాడు జిల్లాలో పరిశ్రమలు, వ్యవసాయం, స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఈ రుణమేళా కీలకంగా మారుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ, జిల్లాలో ఇంకా పెండింగ్ ఉన్న లోన్లు త్వరగా మంజూరు చేయాలని తెలిపారు. సమీక్ష అనంతరం నరసరావుపేటలో స్థానిక కోడెల శివ ప్రసాద్ స్టేడియం సభా ప్రాంగణాన్ని ఇస్సపాలెంలో హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎస్పీ ఉమా మహేశ్వరావు, నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద్ బాబు, చిలకలూరిపేట ఎమ్మెల్యే పుల్లారావు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాచెర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్రెడిట్ అవుట్‌రీచ్ విజయవంతానికి క్యాడర్ సిద్ధం కావాలి

### ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, ఎంపీ లావు

నరసరావుపేట,జూలై 14 ప్రభాతవార్త : ఈ నెల 17వ తేదీన నరసరావుపేటలో జరగనున్న క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రాంను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ నేతలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారిగా భారీ క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం మన జిల్లాలో జరుగుతుందని, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతున్నారని తెలిపారు. సుమారు 30,000 మంది



లబ్ధిదారులు పాల్గొనే ఈ మేళాలో ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలోనే రూ.2,500 కోట్ల రుణాలను వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద పంపిణీ చేయనున్నారని తెలిపారం. పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ, ముద్ర, ఎంఎస్ఎంఈ, వ్యవసాయం, విద్య, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర పథకాల లబ్ధిదారులకు ఈ వేదికపై రుణాలు అందజేస్తారని అన్నారు. వెనుకబడిన పల్నాడు జిల్లాలో పరిశ్రమలు, వ్యవసాయం, స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఈ రుణమేళా కీలకంగా మారనుందని ఎమ్మెల్యే వివరించారు. దాదాపు 500 బస్సుల ద్వారా జిల్లా నలుమూలల నుంచి లబ్ధిదారులను తరలిస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సభా ప్రాంగణం కోడెల శివప్రసాద్ స్టేడియం వద్ద, హెలిపాడ్ ఇస్సపాలెంలో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వచ్చే ప్రతి లబ్ధిదారుడికి తాగునీరు, నీడ, వైద్య సదుపాయం అందేలా చూడాలని, మన పార్టీ క్యాడర్ మొత్తం వాలంటీర్లుగా సేవలు అందించాలని కోరారు. సమావేశంలో టీడీపీ టిడిపి సీనియర్ నాయకులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్తా, వాసిరెడ్డి రవి, షేక్ మాబు, గట్టుపల్లి సత్యనారాయణ, గూడూరు శేఖర్, షేక్ రఫీ , పట్టణ, మండల ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలపై విద్యుత్ భారాలు మోపని సీఎం చంద్రబాబు:: టిడిపి

నకరికల్లు, జులై 14 ప్రభాతవార్త : ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు రెండేళ్లుగా మోపలేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు సౌరయ్య అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆయన



విలేకరులతో మాట్లాడారు. వినియోగదారులపై 201924 సంవత్సరాలకు సంబంధించిన ట్రూ అప్ చార్జీలు రూ. 4,498 కోట్లు ప్రభుత్వమే భరాయించటం ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తుందన్నారు. విద్యుత్ సంస్థలు కోట్ల రూపాయల భారాన్ని ప్రభుత్వం భరించటం సమస్యగా చెప్పిన సీఎం చంద్రబాబు మాత్రం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారని తెలిపారు. 2026 27కు విద్యుత్ డిస్కాంట్లు దాఖలు చేసిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికలో రెవిన్యూ లోటు రూ. 15,790 కోట్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం మాత్రం ఆ నష్టాన్ని భరించే కార్యక్రమం చేస్తుందన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి విధానాలు ప్రజల కోసం అమలు చేయలేదని నాగోతు సౌరయ్య గుర్తు చేశారు. ఇప్పటికే విద్యుత్ పంపిణీ సంస్థలు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండల ఎదుట పిటిషన్లు దాఖలు చేశా అన్నారు వాటిని పరిశీలించి ట్రూ డౌన్ కింద వినియోగదారుల బిల్లులో ఎంత తగ్గించాలని నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇవ్వడం వినియోగదారులకు శుభవార్త అన్నారు.

## విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

యడ్లపాడు, జులై 14, ప్రభాతవార్త : విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగము మరియు ఆపరేషన్ విభాగము, సిఆర్‌డిఎ పర్యవేక్షణ ఇంజనీర్ సిహెచ్ రమేష్ ఆధ్వర్యములో యడ్లపాడు సెక్షన్ నందు ఉప్పరపాలెం, గుత్తావారిపాలెం, ఉన్నవ, మర్రిపాలెం, బోయపాలెం, దిన్నెనపాడు, లింగారావుపాలెం, తిమ్మాపురం యందు విస్తృత తనిఖీలు నిర్వహించారని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ వెంకటేశ్వర రావు డిపి ఇ మరియు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై ఏడుకొండలు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ తనిఖీలలో 32 మంది అధికారులు, 98 మంది సిబ్బంది, 32 బృందాలుగా ఏర్పడి 1479 సర్వీసులు తనికి చేయటం జరిగిందన్నారు. మీటరు లేకుండా డైరెక్టుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ముగ్గురికి రూ 0.05 లక్షలు, మీటరు ఉన్నపటికీ అక్రమముగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 10 మందికి రూ 1.10 లక్షలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరి లో విద్యుత్ వాడుకుంటున్న ఒక్కరికి రూ 0.05 లక్షలు, అనుమతించిన లోడు కంటే అదనముగా విద్యుత్ వాడుతున్న 68 మందికి రూ 2.68 లక్షలు మొత్తము రూ. 3.88 లక్షలు అపరాధ రుసుము విధించటం జరిగిందన్నారు. విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టం కు లోబడి ఉంటాయన్నారు. వినియోగదారులందరూ వారి ప్రేమిసెస్ లో ఉండే విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేటట్లు నిర్ధారించుకోవాలనీ, ఒక వేళ సీలు లేక పోయినా, తుప్పు పట్టి ఊడిపోయినా, వెంటనే సంభదిత విద్యుత్ సిబ్బందికి రాత పూర్వకంగా తెలియచేయాలి. ముఖ్యంగా సాగర తీర ప్రాంతాలలోని మీటర్లకు ఉన్న సీలు త్వరగా పాడై పోయే



అవకాశం ఉన్నందున అప్పుడప్పుడు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ అధికారుల తనిఖీలలో సీలు లేకపోవుట, ఉద్దేశపూర్వకంగా వాటిని తొలగించుట, గాట్లు పెట్టుట వంటివి గమనించినచో విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేయటం జరుగుతుంది. భారత విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం పనిచేయని మీటరు నుండి విద్యుత్ వాడుకున్నా, ఉండవలసిన మీటరుకు బదులు వేరే మీటరు పెట్టి సీలు లేకపోయినా విద్యుత్ చౌర్యం నిర్ధారణ అయినట్లే భావించబడుతుంది. మొదటి సారి తప్పిదానికి కాపౌండింగ్ పద్ధతిలో అపరాధ రుసుం చెల్లించినచో కేసు నుండి విడిచి పెడతారు. రెండవసారి తప్పిదానికి అరెస్ట్ చేసి రిమాండ్ కి పంపి కఠినంగా వ్యవహరిస్తారు. అపరాధ రుసుము కట్టలేని పరిస్తితులలో రెవెన్యూ రికవరి చట్టం ఉపయోగించి ఆస్తులు జప్తు చేయూదురు. మొదటి సారికి తప్పిదానికి మూడు రెట్లు, రెండవసారికి తప్పిదానికి ఆరు రెట్లు అపరాధ రుసుం విదించే అవకాశం విదృత్ చట్టంలో ఉన్నది. విద్యుత్ చౌర్యం సామజిక నేరం అని విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను పూర్తి వివరాలతో 9440812263, 9440812360, నెంబర్లకు నేరుగా లేదా వాట్సప్ ద్వార సంప్రదించవచ్చు అని తెలిపారు. సమాచారం అందించిన వివరాలను గోప్యముగా ఉంచబడతాయని అన్నారు. ఈ దాడులలో ఆపరేషన్ విభాగ డిఇఇ అర్ అశోక్ కుమార్ డి.పి.ఇ (విజిలెన్సు) దీఇఇ లు కె రవికుమార్, వి మల్లిఖార్జున ప్రసాద్, ఆపరేషన్ విభాగ ఎఇఇ ఎమ్ వెంకటేశ్వర రావు, డిపిఇ (విజిలెన్సు) ఎఇఇలు ఎమ్ సతీష్ కుమార్, యూ శివశంకర్, మరియు ఆపరేషన్ డిఇఇ అండ్ ఎఇఇ లు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు 25వ ఇన్స్టిలేషన్ సెర్మనీ

వినుకొండ, జూలై 14, ప్రభాతవార్త: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు 25వ ఇన్స్టిలేషన్ సెర్మనీ గుంటూరులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో రంగా రంగా వైభవంగా జరిగింది. దీనికి ప్రెసిడెంట్ గా డాక్టర్ పొందూరి శివప్రసాద్, సెక్రెటరీగా తుమ్మల శ్రీనివాసరావు, ట్రెజరర్ గా కొల్లి అరవింద్ ప్రమాణస్వీకారం చేశారు.వీరి చేత ముఖ్యఅతిథి, మక్కెన మల్లికార్జునరావు, రోటరీ డిస్ట్రిక్ట్ 3150 అసిస్టెంట్ గవర్నర్ కె ఎస్ రమేష్ రోటరీ డిస్ట్రిక్ట్ 3150 శిదీబి శివన్నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథి వినుకొండ మాజీ ఎమ్మెల్యే మరియు జి డి సి సి బ్యాంక్ చైర్మన్ అయినటువంటి మక్కేనా మల్లికార్జున రావు




మాట్లాడుతూ రోటరీ క్లబ్ గుంటూరు వారు సేవా రంగంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసి ఉన్నారని చెప్పినారు. దీనికి తోడు రోటరీ క్లబ్ గుంటూరు వారు స్కూల్స్ లో బెంచెస్ మరియు వాటర్ ప్లాంట్స్ ఇచ్చి ఉన్నారు అని తెలిపారు. ఈరోజు జరిగిన కార్యక్రమంలో ముగ్గురు విద్యార్థులకు స్కాలర్షిప్స్ ఇవ్వటం జరిగింది. ప్రెసిడెంట్ పొందూరు శివప్రసాద్ మాట్లాడుతూ ఈ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని దీంతోపాటు మరిన్ని సేవా కార్యక్రమాల్ని చేస్తామని హామీ ఇచ్చారు. రోటరీ క్లబ్ సిగ్నేచర్ ప్రాజెక్ట్స్ డయాలసిస్ సెంటర్ బ్లడ్ బ్యాంక్ ను నిర్వహిస్తామని తెలిపారు.సెక్రటరీ తుమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ సేవా కార్యక్రమంలో చక్కగా నిర్వహిస్తామని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు

## ఎమ్మెల్యే 'కన్నా'కు ధన్యవాదాలు తెలిపిన కొత్తూరు ప్రజలు

కొత్తూరు (రాజుపాలెం), జూలై 14, ప్రభాతవార్త: సుదీర్ఘ అనుభవంగల రాజకీయ నాయకులు, మాజీమంత్రి, సత్తెనపల్లి స్థానిక శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణకు రాజుపాలెం మండలం కొత్తూరు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. తమ గ్రామ ప్రజలు బస్సు సౌకర్యం లేక కొన్ని యేళ్ళుగా తీవ్ర యిబ్బందులు పడుతున్నామని, గత్యంతరం లేక ఆటోలకు అధిక చార్జీలు చెల్లించి ప్రయాణం చేయాల్సివస్తుందని స్థానిక నాయకులు బట్టు హనుమయ్య మరియు రంగనాయకులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నా దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందని గ్రామస్థులు తెలిపారు.విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, వెంటనే ఆర్టీసీ ఛైర్మన్ గారితో మాట్లాడి నేడు తమ గ్రామానికి



సత్తెనపల్లి డిపో నుండి బస్సు వచ్చిందని, రోజుకు రెండు సార్లు ఉదయం, సాయంత్రం తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడం సంతోషంగా ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు.ఆర్టీసీ బస్సు రావడం వల్ల తమకు ఉచిత ప్రయాణ సౌకర్యం లభించిందని మహిళలు సైతం కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే కన్నా చేసిన ఈ సాయం జీవితంలో మరువలేమని జేజేలు పలికారు. ఈ కృతజ్ఞత కార్యక్రమంలో గ్రామస్థులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే 'కన్నా'




సత్తెనపల్లి, జూలై 14, ప్రభాతవార్త: ఈ నెల 17న నరసరావుపేటలో భారత కేంద్ర ఆర్థిక కార్పొరేషన్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పర్యటన గురించి మంత్రి మరియు పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు,జిల్లా కలెక్టర్ మరియు అధికారులతో జరిగిన సమీక్షా సమావేశ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పోతుగంటి ముత్యాలు రావమ్మ వెంకటేశ్వర్లు గుప్తా ఛారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయంతో తోపుడు బండి అందజేత..

సత్తెనపల్లి, జూలై 14, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్ లో ఉన్న వేణుగోపాల స్వామి దేవాలయం ఎదురుగా ఉన్న పోతుగంటి రామ కోటేశ్వరరావు కార్యాలయం ముందు 19 వ వార్డు చెందిన పాపిశెట్టి వెంకటరమణ అనే మహిళా ధీర్ఘ కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిత్య జీవనం కష్టం అవుతుంది అని ట్రస్ట్ కార్యదర్శి మరియు సత్తెనపల్లి అగ్రికల్చర్ మార్కెటింగ్ యార్డ్ డైరెక్టర్ పోతుగంటి రామకోటేశ్వరావు దృష్టికి తేగా ఆమె జీవనోపాదికి అవసరం అయిన తోపుడు బండిని రూ 10,000 రూపాయలు వెచ్చించి ఆమెకు మంగళవారం ఉదయం అందించారు. ఈ



కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు పోతుగంటి కోటేశ్వరరావు, కార్యదర్శి పోతుగంటి రామకోటేశ్వరరావు, రెడ్ క్రాస్ సొసైటీ సత్తెనపల్లి చైర్మన్ ఆళ్ళ చంద్రశేఖర్, 19 వ వార్డు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మరియు న్యాయవాది అవ్వారు శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ బండ్లమూడి వీరాం జనేయులు, రీజినల్ కోఆర్డినేటర్ పొత్తూరి రామకోటయ్య, సంఘసేవకులు గంజి వీరాస్వామి మరియు సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గడువులోగా రైతులు వాటా ప్రీమియంగా చెల్లించాలి

సత్తెనపల్లి, జూలై 14, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలంలోని రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన మరియు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో ప్రత్తి, మిరప,కంది మరియు వరి పంటలపై బీమా పొందేందుకు వ్యవసాయ శాఖ నిర్దేశించిన గడువులోగా రైతులు వాటా ప్రీమియం గా చెల్లించాల్సి ఉంటుందని సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి సుబ్బారెడ్డి తెలిపారు. పత్తి పంట ఎకరాకు రూ.38,000/ బీమాకు రైతులు వాటాగా రూ.1900/ ఈ నెల 15 వ తేదీ లోపు, మిరప పంట ఎకరాకు రూ.90,000/ బీమాకు రైతులు వాటాగా రూ.360/ జూలై 31 వ తేదీ లోగా, కంది పంట ఎకరాకు రూ.20,000/ బీమాకు రైతులు వాటాగా రూ.40/ జూలై 30 వ తేదీ లోగా, వరి పంట ఎకరాకు రూ.40,000/ బీమాకు రైతులు వాటాగా రూ.80/ ఆగస్టు 15 వ తేదీ లోగా చెల్లించాల్సి ఉందన్నారు. ఈ క్రాపు నమోదు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంక్ పాస్ పుస్తకం, వేసిన పంట ధ్రువీకరణ పత్రాలను తీసుకొని రైతు సేవ కేంద్రాలు వద్ద సంప్రదించి, కామన్ సర్వీస్ సెంటర్ ల ద్వారా లేదా మీసేవ కేంద్రాలలో కానీ లేదా ఇన్స్యూరెన్స్ ఏజెంట్లు ద్వారా గాని పంటలకు బీమా చేయించుకోవాలని తెలియజేసినారు. కౌలు రైతుల కూడా బీమా కి అర్హులేనన్నారు.

# బండి తాతయ్య ఇక లేరు...



**-నాలుగు దశాబ్దాలు సర్పంచిగా సేవలందించిన బండి**
**-బండి వెంకటేశ్వర్లుకు పలువురు నాయకుల ఘన నివాళి**
**-వెల్లలూరు గ్రామంలో విషాదచాయలు-ఘనంగా అంత్య క్రియలు**

పొన్నూరు, జూలై 14,ప్రభాతవార్త: ఆబాలగోపాలం తాతయ్య అని పిలుచుకునే బండి వెంకటేశ్వర్లు(98)ఇక లేరన్న వార్త విన్న ప్రతి ఒక్కరి హృదయాలను కలిచివేసింది. మండల పరిధిలోని వెల్లలూరు గ్రామానికి సుమారు నాలుగు దశాబ్దాలు తనదైన శైలిలో సర్పంచిగా సేవలందించి ప్రతి ఒక్కరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ బండి తాతయ్య....బండి తాతయ్య అని ముద్దుగా పిలుచుకొంటూ ఉంటారు. వెల్లలూరు గ్రామాభివృద్ధిలో బండి వెంకటేశ్వర్లు మార్కు ప్రత్యేకంగా కనిపిస్తుంది. తొలి నుంచి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా, పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. మాజీ ముఖ్యమంత్రులు కాసు బ్రహ్మానందరెడ్డి, కొణిజేటి రోశయ్య, నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తదితరుల హయాంలో నియోజకవర్గంలో పార్టీ గెలుపుకు విశేషమైన కృషి చేశారు. తదనంతరం మారిన పరిస్థితుల కారణంగా వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. వివాదరహితుడిగా పేరుండడంతో అన్నీ పార్టీల నాయకులు బండి వెంకటేశ్వర్లు అంటే అభిమానంగా ఉంటారు. అధికారం అంటే పేదలకు సేవ చేయడం, గ్రామాన్ని అభివృద్ధి చేయడం, ప్రజల నమ్మకాన్ని గెలవడం అనే విషయాలేనని ఎప్పుడే కిందిస్థాయి నాయకులు చెప్తూ ఉండేవారని పలువురు నాయకులు చెప్తున్నారు. బండి వెంకటేశ్వర్లు మరణం తీరని లోటని పలువురు నాయకులు స్పష్టం చేశారు. బండి వెంకటేశ్వర్లు మరణ వార్త విన్న వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ బండి వెంకటేశ్వర్లు అంత్యక్రియల్లో పాల్గొని ఘన నివాళులర్పించడంతోపాటు, ఆయన అంతిమయాత్రలో పాడె మోసి బండి వెంకటేశ్వర్లుపై ఆయనకు ఉన్న విశ్వాసాన్ని చాటుకున్నారు. బండి వెంకటేశ్వర్లుకు ఒక కుమారుడు, ఐదుగురు కుమార్తెలున్నారు. బండి వెంకటేశ్వర్లు తనయుడు బండి శివరామ ప్రసాద్(బాబు)ను మాజీ మంత్రులు అంబటి రాంబాబు, కన్నా లక్ష్మీనారాయణ, డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డి, నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, చందుసాంబశివరావు, వెల్లలూరు మాజీ సర్పంచి ఇక్కుర్తి మల్లికార్జునరావు, కొఠారు వెంకటరమణ, బొనిగల వేణుప్రసాద్, వడ్రాణం ప్రసాదరావు, ఆకుల వెంకటేశ్వరరావు, బోయిన శివశంకర పద్మారావు, బోయిన శివనాగరాజు తదితరులు పరామర్శించినవారిలో ఉన్నారు.



## ఆగస్టు 9న ప్రహ్లాద చరిత్ర ప్రవచనం

పొన్నూరు, జూలై 14,ప్రభాతవార్త: ప్రతిమాసం వాణీదరహాసం సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బ్రాహ్మణ బజారులోని శ్రీ గాయత్రీ మందిరం-శంకరమఠంలో ఆగస్టు 9వ తేదీ సాయంత్రం 6.30గంటలకు ప్రహ్లాద చరిత్ర ప్రవచనం జరుగుతుందని సంస్థ అధ్యక్షుడు నాగలింగం హరిహరపంత్ తెలిపారు. నరసరావుపేటకు చెందిన సంస్కృతపండితులు మంత్రిరాజు శివరామయ్య ప్రహ్లాద చరిత్రపై తమ ప్రవచనాన్ని వినిపిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి భాషాభిమానులు, సాహిత్యాభిమానులు, పురప్రముఖులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హరిహరపంత్ తెలిపారు.

## లక్ష్మణరావు సేవలు అభినందనీయం

పొన్నూరు, జూలై 14,ప్రభాతవార్త: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఆది నుండి చొరవ చూపిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావును ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. 11వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ నుండి ఓపిఎస్ వర్తించే జీవో నెం.53 ప్రభుత్వం విడుదల చేసిన సందర్భంలో ఉపాధ్యాయుల ఫోరంకు సహాయ సహకారాలు అందిస్తున్న లక్ష్మణరావును సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. 2003డిఎస్సీ ఉపాధ్యాయుల ఫోరంకు సహాయ సహకారాలు అందించి ఓపిఎస్ లక్ష్యం వైపు నడిపించిన లక్ష్మణరావు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 2003డిఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం ఐక్యంగా చేసిన పతాకస్థాయి ఉద్యమ ఫలితమేనని స్పష్టం చేశారు. జీఓ నెం.53విడుదల చేసినందుకు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. కెఎస్ లక్ష్మణరావును సత్కరించినవారిలో రాష్ట్ర కన్వీనర్ కొమ్మనబోయిన లక్ష్మీ శ్రీనాథ్, కృష్ణాజిల్లా కన్వీనర్ జి.జయరాజు, ఎస్.ప్రసన్నకుమార్, శీలం, ఎం.శ్రీనివాసరావు తదితరులున్నారు.



## ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు వైకాపా కుట్ర

**-మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య**

పొన్నూరు, జూలై 14,ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ కంకణం కట్టుకొందని, అందులో భాగంగానే కులామల మధ్య చిచ్చుపెట్టి రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తేవిధంగా కుటిల ప్రయత్నాలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కిలారి రోశయ్య నివాసంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. నిన్న మొన్నటి వరకు కుల రాజకీయాలు చేసిన వైకాపా ప్రస్తుతం మత రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. రాష్ట్రంలో కులాల వారీగా సమావేశాలు పెట్టిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే చెల్లుతుందన్నారు. ఒక కులాన్ని వైకాపా రోడ్డుపై పడేసిందన్నారు. రాష్ట్రంలో మంచి పార్టీగా పేరు పొందిన జనసేన పార్టీని పూర్తిస్థాయిలో అస్థిరపచడానికి చూస్తోందన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా భారతదేశం నిలిస్తే ఓర్వలేకపోతున్నారన్నారు. నాస్తికుడని చెప్పుకొంటున్న రావణ్ మత సామరస్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడడం హేయమైన చర్య అని చెప్పారు. ప్రశ్న రావణ్‌కి హిందూయిజం మీద ఎందుకు ఇంత కక్ష అని ప్రశ్నించారు. రామాయణం, మహాభారతం గురించి మాట్లాడే స్థాయి రావణకున్నదా..? అని ప్రశ్నించారు. సనాతన ధర్మం ఏ ఒక్క మతానికి సంబంధించినది కాదన్న విషయాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ధర్మాన్ని కాపాడే వ్యవస్థే సనాతన ధర్మమన్నారు. అలాంటి సనాతన ధర్మాన్ని అవహేళన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేనాని పవన్ కళ్యాణ్ సనాతన ధర్మాన్ని తన భుజానికి ఎత్తుకున్నారు కాబట్టే ఆయన్ని టార్గెట్ చేస్తున్నారన్నారు. ఆంధ్రరాష్ట్రంలోనే పనిగట్టుకుని పవన్ కళ్యాణ్ మీదు, హిందూ మతం మీద తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. రవాణ్ మీద కఠిన చట్టాలు పెట్టడంలో తప్పులేదన్నారు. దేశ సమగ్రతకు రావణ్ మాటలు గొడ్డలిపెట్టన్నారు. వైకాపా నాయకులు చివరి రావణే గెలుస్తాడని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. అధికారం కోసం వైకాపా ఎంతకైనా దిగజారుతుందన్నారు. పవన్ కళ్యాణ్‌పై రావణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. పవన్ కళ్యాణ్ గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం కంకణం కట్టుకొని ముందుకు సాగుతున్నారన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యక్తులపై ఇలాంటి కేసులు పెడితే తప్పేంటి అంబటి రాంబాబు అని రోశయ్య ప్రశ్నించారు. ప్రజలు బుద్ది చెప్పినా వైకాపాకు ఇంకా బుద్ది రాలేదన్నారు. ఆ పార్టీ నాయకులు రోజు రోజుకు దిగజారేవిధంగా మాట్లాడుతున్నారన్నారు. ప్రజలందరూ వాస్తవాలను గుర్తిస్తున్నారన్నారు. సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాయబ్ కమల్, బిట్రగుంట మల్లిక, పాకనాటి రమాదేవి, గుంటూరు నగర జనసేన పార్టీ ముఖ్య నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.



## అనాథ పిల్లలకు సంస్థ పక్షాన సేవలందిస్తాం

**-మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి**



పొన్నూరు, జూలై 14,ప్రభాతవార్త: అనాథ పిల్లలకు, అవసరార్థులకు సేవలందించడంలో మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ముందుంటుందని సంస్థ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ అన్నారు. తెలంగాణా రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్‌లోని బంజారా జిప్సీ అనాథ పిల్లల వసతి గృహంలో పిల్లలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా పొన్నూరు పట్టణంలోని బ్రిడ్జి కింద నివసిస్తున్న నిరాశ్రయులకు భోజన ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలశెట్టి రజని, కోశాధికారి చిలకపాటి సింహాద్రి, ఈసి మెంబర్ పోలిశెట్టి విజయ్‌కుమార్ తదితరులున్నారు.

## కాపు నాయకుల మృతి తీరనిలోటు

**-మునిసిపల్ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బోయిన శివనాగరాజు**

పొన్నూరు, జూలై 14,ప్రభాతవార్త: మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం, పార్టీ సీనియర్ నేత, సుదీర్ఘకాలం సర్పంచిగా సేవలందించిన బండి వెంకటేశ్వర్లు మృతి కాపు కులానికి, వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మునిసిపల్ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బోయిన శివనాగరాజు అన్నారు. వీరు ఇరువురు ప్రజలకు, సమాజానికి, ఆయా ప్రాంతాల అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివన్నారు. ముద్రగడ, బండి ఆశయ సాధనకు కృషి చేస్తామని చెప్పారు. సుదీర్ఘకాలం రాజకీయంగా సేవలందించి ఇరువురూ ఎనలేని ఖ్యాతిని పొందారన్నారు. అంతటి సేవా తత్పరులు ఇక లేరన్న వార్త చాలా బాధించిందన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

# బాపట్ల జిల్లా వార్త



## ప్రతి రైతు ఫసల్ బీమా చేయించుకోవాలి

చేబ్రోలు(పొన్నూరు), జూలై 14,ప్రభాతవార్త: ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని కోరారు. చేబ్రోలు మండల పరిధిలోని నారాకోడూరు, వేజండ్ల గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పంటల బీమా గురించి రైతులకు వివరించారు. ఈ నెల 15వ తేదీ వరకు ప్రీమియం మినుముకి రూ.200లు చెల్లించాలన్నారు. ప్రత్తి ఇన్సూరెన్స్ అమౌంట్ రూ.95వేలు, మినుమికి రూ.20వేలు, పంటల బీమా వర్తిసు ఒదన్నారు. మిరప పైరుకి ఎకరానికి రూ.2,700 ప్రీమియం చెల్లించాలన్నారు. వరి పైరుకు ఆగస్టు 15వ తేదీ వరకు ప్రీమియం చెల్లించుకోవచ్చన్నారు. ఈ వర్షాభావ పరిస్థితుల్లో పంటల బీమా చేసుకోవడం వల్ల రైతులకు ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందన్నారు. అదేవిధంగా ఏపి ఎయిమ్స్ యాప్ ద్వారా యూరియా, డిఎపి పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి జి.మోహన్, గ్రామ ఉద్యాన సహాయకులు విజయకుమార్, కోటి లక్ష్మి, గ్రామాల రైతులు పాల్గొన్నారు.




## ఘనంగా నమస్తే డే కార్యక్రమం

పొన్నూరు, జూలై 14,ప్రభాతవార్త: పొన్నూరు పురపాలక సంఘ పరిధిలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నమస్తే డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని మునిసిపల్ మేనేజర్ పిన్నిబోయిన పోతురాజు తెలిపారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల భద్రత, గౌరవం, సంక్షేమాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పారిశుద్ధ్య రంగంలో విశేష సేవలందించిన ఇరువురిని ఘనంగా సత్కరించారు. కార్మికులకు రక్షణ కిట్లను అందజేశారు. మేలిక సాంబయ్య, అద్దూరి అంజయ్యలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ మేస్త్రీలు, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఏపి ఎయిమ్స్ యాప్ ద్వారానే ఎరువులు అందజేత

పొన్నూరు, జూలై 14,ప్రభాతవార్త: మండల పరిధిలోని బ్రాహ్మణకోడూరు, వెల్లలూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు ప్రస్తుత వాతావరణ పరిస్థిల ప్రభావం వల్ల జరుగుతున్న పరిణామాలను వివరించారు. ఎల్‌నినో వల తీవ్ర వర్షాభావము కలుగుతుందన్నారు. పంట కాల నష్టం గురించి రైతులకు వివరించారు. ఏపి ఎయిమ్స్ యాప్ ద్వారా యూరియా, డిఏపి అందజేస్తామన్నారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా, ఒక బస్తా డిఏపి ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు వారి వారి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి పంట ఎకరాకు రూ.800ప్రీమియం చెల్లించాలన్నారు. తద్వారా రూ.40వేల వరకు ప్రధానమంత్రి ఫసల్ బీమా పొందవచ్చన్నారు. ప్రకృతి వైపరిత్యాలు, అనుకోని పరిస్థితులలో నష్టాలు వచ్చిన సందర్భంలో బీమా వర్తిస్తుందన్నారు. ఆగస్టు 15వ తేదీ లోపు బీమా చెల్లించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, విఎఎ ఏ.భావన, ఎంపిఈఓలు సిహెచ్ భానురేఖ, సింహాద్రి సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.



## రైతులు పంట బీమా చేయించుకోవాలి: శ్రీనివాస్ రెడ్డి

కొల్లిపర, జూలై 14, ప్రభాతవార్త:వాతావరణం,పంటల దిగుబడులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎన్.శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.మంగళవారం మండలంలోని జముడుపాడు,చక్రాయపాలెం గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2026 ఖరీఫ్ సీజన్‌లో పంట బీమా చేయించుకునేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్సూరెన్స్ మార్గదర్శకాలు జారీ చేశాయని వివరించారు.వరి పంటకు ఎకరాకు రైతు వాటా కింద రూ.800,వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద అరటి పంటకు ఎకరాకు రూ.2700 చెల్లించేందుకు నిర్ణయం జరిగిందని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ ప్రీమియం పొందాలంటే పంట వేసిన వెంటనే గ్రామ సహాయకుల దగ్గరికి వెళ్ళి పంట వివరాలను నమోదు చేయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు.పంటల బీమా చేయించేందుకు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్ళాలని తెలిపారు.వరి పంటకు ఆగస్టు 15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.నేటి బీమా రేపటి భద్రత అని ప్రతి రైతు తెలుసుకోవాలని కోరారు.రైతు ఆధార్‌కార్డు, పొలం పాస్ బుక్ లేదా 1 బి,బ్యాంక్ అకౌంట్ జిరాక్స్,పంట సాగు ధృవీకరణ పత్రం,మొబైల్ నెంబరు కాపీల ఆధారంగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని నిబంధనలను తెలియజేశారు.పొలం సాగు చేసే రైతులు విధిగా పంటకు సంబంధించి క్రాప్ బుకి ంగ్ చేయించుకోవాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎఇవో గోపీనాథ్,విఎఎ నాగలక్ష్మి, పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రేపల్లె, జూలై 14, ప్రభాతవార్త:పట్టణంలోని 33 కెవి నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నందున బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రేపల్లె విద్యుత్ శాఖ డిప్యూటీ ఇఇ డి.శ్యామ్ సుధాకర్ బాబు మంగళవారం తెలిపారు.ఇసుకపల్లి,నిజాంపట్నంరోడ్,మజీద్ సెంటర్,బస్టాండ్ సెంటర్,బేతపూడి, ఉయ్యూరు వారిపాలెం ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## రూ.800 ప్రీమియంతో రూ.40 వేల ప్రయోజనం

రేపల్లె, జూలై 14, ప్రభాతవార్త:ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా ఎకరా వరి పంటకు రూ.800 ప్రీమియం చెల్లిస్తే రూ.40 వేల ఆర్థిక ప్రయోజనం లభిస్తుందని రేపల్లె మండల వ్యవసాయశాఖ అధికారి ఎ.మహేష్‌బాబు చెప్పారు.మంగళవారం మండలంలోని గుడ్డికాయలంక,బేతపూడి గ్రామాలలో పొలం పిలుస్తోంది అనే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిల్ హెల్త్ కార్డులు,సిసిఆర్‌సి కార్డులు,వ్యవసాయ శాఖ పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ప్రస్తుత వ్యవసాయ పరిస్థితి,ఎలినినో,శా స్త్రీయ సాగు పద్ధతులు,ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజి స్ట్రీ ప్రాముఖ్యత,నమోదు విధానం,నూతన ఎరువుల ప్రయోజనం,ఎపిఎఐఎంఎస్ 2.0 యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఎఇవోలు సుమంత్,పావని,వ్యవసాయ సహాయకులు శివకృష్ణ,కొండలు,విఆర్‌వోలు,రైతులు పాల్గొన్నారు.



## పచ్చిరొట్ట పైర్లతో ప్రయోజనం

రేపల్లె, జూలై 14, ప్రభాతవార్త:ఖరీఫ్ సీజనులో రైతులు పచ్చిరొట్ట పైర్లను సాగు చేస్తే ప్రయోజనం ఉంటుందని మండల వ్యవసాయ శాఖ అధికారి బ్రహ్మారెడ్డి చెప్పారు.మంగళవారం భట్టిప్రోలు మండలంలోని అద్దేపల్లి,ఐలవరం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనుము, జీలుగ,పిల్లిపెసర జాతి మొక్కలను పూత దశలో మట్టిలో కలియదున్నడం ద్వారా అత్యధికంగా నత్రజని,సేంద్రీయ పదార్థాన్ని అందించి భూసారాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని ఆయన వివరించారు.రైతు సేవా కేంద్రాలలో సాగు చేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు.ఎరువుల పంపిణీ విధానం గురించి వివరించారు. ఎపిఎఐఎంఎస్ ద్వారానే ఎరువుల పంపిణీ జరుగుతుందని బ్రహ్మారెడ్డి చెప్పారు.బుధవారం బాపట్ల వి కన్వెన్షన్ హాలులో కిసాన్ మేళా కార్యక్రమం జరుగుతుందని,రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవయసాయ శాఖ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.



# మహిళల సమస్యలకు మంగళవారం ప్రత్యేక వేదిక గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం

## మహిళల ఫిర్యాదుతో నైట్ బీట్ ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జులై 14, ప్రభాతవార్త:గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని శివారు ప్రాంతంలో గంజాయి వినియోగం, విక్రయాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని మహిళలు ఫిర్యాదు చేయగా, వెంటనే పోలీసులను అప్రమత్తం చేసి నైట్ బీట్ కానిస్టేబుళ్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయించడంతో ఆ సమస్యకు పరిష్కారం లభించిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి మహిళల నుంచి వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ ప్రతి మంగళవారం మహిళల



కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ గ్రీవెన్స్ కార్యక్రమం మహిళలకు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునే వేదికగా మారిందని తెలిపారు. మహిళలు చిన్న సమస్య అయినా, పెద్ద సమస్య అయినా నేరుగా వచ్చి తమ సమస్యను వివరించే పరిస్థితి ఏర్పడిందని, వాటి పరిష్కారానికి పశ్చిమ కార్యాలయం పూర్తిస్థాయిలో కృషి చేస్తోందని పేర్కొన్నారు. సమస్యను వినడమే కాకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి, పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు నిరంతరం ఫాలో అప్ చేస్తున్నామని చెప్పారు. పారిశుద్ధ్య సమస్యలపై ఫిర్యాదులు అందాయని, ఒక ఆహార విక్రయ కేంద్రం కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న విషయాన్ని వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. అదేవిధంగా వైన్ షాపుల వద్ద ఆకతాయిల వేధింపులు, తగినంత వీధి దీపాలు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి, అదనపు లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు పహారా పెంచినట్లు తెలిపారు. మహిళలు భద్రంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళల ఆర్థిక మోసాలు, చీటీ పేరుతో మోసపోవడం, ఒంటరిగా నివసించే వృద్ధ మహిళల ఆస్తులను కబ్జా చేయాలనే ప్రయత్నాలు, కుటుంబ సమస్యలు, దొంగతనాలు వంటి అంశాలు కూడా తమ దృష్టికి వస్తున్నాయని వెల్లడించారు. ఇలాంటి ప్రతి అంశాన్ని సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థినుల నుంచి కూడా పలు సమస్యలు వస్తున్నాయని, మంచి ర్యాంకులు వచ్చినప్పటికీ కొన్ని కళాశాలలు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదా ఇతర కారణాలు చూపి సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు. అలాంటి కళాశాలల యాజమాన్యాలతో నేరుగా మాట్లాడి విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, యువతులకు స్కిల్ డెవలప్‌మెంట్ అవకాశాలు కల్పించడం, పీ4 కార్యక్రమం ద్వారా పుస్తకాలు, బ్యాగులు, విద్యకు అవసరమైన ఇతర సామగ్రి అందించడం వంటి కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయని వివరించారు.

## సోషల్ మీడియాలో దూషణలకు చట్టపరంగా బుద్ధి చెప్పాలి

గుంటూరు, జులై 14, ప్రభాతవార్త :సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ఫేక్ అకౌంట్ల ద్వారా మహిళలను, ప్రజా ప్రతినిధులను అసభ్య పదజాలంతో దూషించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ఈ అంశంపై మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఐటీడీపీ కమిటీ సభ్యులు ఆమెను కలిసి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న




దూషణల పర్వం, అనంతర పరిణామాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో భావ ప్రకటనా స్వేచ్ఛ ఉన్నప్పటికీ, దానిని దుర్వినియోగం చేస్తూ మహిళలు, ప్రజా ప్రతినిధులపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియాలో జరుగుతున్న ఇలాంటి దుష్ప్రచారాలు, దూషణలపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడం స్వాగతించదగ్గ నిర్ణయమని పేర్కొన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సోషల్ మీడియా వేదికగా బూతులు తిడుతూ, వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుని వారికి బుద్ధి చెప్పాలన్నారు. మహిళల గౌరవాన్ని కాపాడటంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, చట్టం తన పని తాను చేస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

## అనిశ్చితిలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,జూలై14, ప్రభాతవార్త: వర్సిటీలో కాంట్రాక్ట్ విధానంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లుగా విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులు అనిచ్ఛితిలో పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అసోసియేట్ ప్రొఫెసర్ అధ్యాపక పోస్టుల భర్తీలో వీరి కాంట్రాక్ట్ సర్వీస్‌ను పరిగణలోకి తీసుకోలేదు. మంగళవారం అధ్యాపక పోస్టులకు సంబందించి స్క్రూటిని పూర్తయింది. స్క్రూటినీలో అర్హత సాధించిన వారి వివరాలు, అర్హతలేని వారి వివరాలు ఎందుకు అర్హత సాధించలేదో సమాచారంను రిక్రూట్‌మెంట్ పోర్టల్‌లో పొందుపర్చారు. దీని ఆధారంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న వారిలో చాలా మందికి సంబంధిత విభాగంలో పీహెచ్‌డి లేదని పలు దరఖాస్తులు రిజెక్ట్ అయ్యాయి. వర్సిటీలో ఉన్న పరిశోధనా కేంద్రాలలో, రీసెర్చ్ సెంటర్లలో పీహెచ్‌డిలు చేసినా కూడా వారిని అనర్హతగా ప్రకటించడం పట్ల పలువురఉ ఆశావాహులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరిలో చాలా మంది కోర్టులను ఆశ్రయించే అవకాశాలున్నట్లు సమాచారం. కాగా ఏఎన్‌యులో అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ పోస్టులలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు అధికసంఖ్యలో దరకాస్తులు వచ్చాయి.

## నేత్రదాత పిల్లి రాజమోహన రావు వర్ధంతి సందర్భంగా అన్నదానం

తెనాలి జులై14(ప్రభాతవార్త): ప్రముఖ సంఘపెద్దలు,నేత్రదాత, పిల్లి రాజమోహనరావు నాలుగో వర్ధంతి సందర్భంగా, ఆయన కుమారుడు ప్రముఖ న్యాయవాది పిల్లి ప్రేమరాజు ఆధ్వర్యంలో,శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవాసమితి అధ్యక్షులు కుర్రా శ్రీను పర్యవేక్షణలో, పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద,పేదలు, వికలాంగులకు, నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివంగత పిల్లి రాజమోహన రావు కుటుంబ సభ్యులు, సన్నిహితులు మరియు అక్కిదాసు కిరణ్,పిల్లి వీరయ్య,చుక్క ఆనంద్, కంచర్ల రాజు,చుక్క అజయ్, జొన్నకూటి వెంకట్, కొమరాబత్తుని రాజేష్,శ్యామ్, యువన్ అకిరా,విహాన్, సహస్ర,బేతాళ బసవయ్య,ఉన్నావ చంద్రశేఖర్,బడుగు విజయచందర్,రాఘవులు మరియు యూనివర్సల్ యూత్ సభ్యులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



## మహిళలు, పిల్లలలో అత్మహత్యల నివారణపై అవగాహన

యడ్లపాడు, జులై 14, ప్రభాతవార్త : నాదెండ్ల ప్రాజెక్టు ఐసిడిఎస్ పరిధిలోని వంకాయలపాడు సెక్టార్ లోని బోయపాలెం గ్రామం ఎడబ్లూసి ఎస్టీ అంగన్‌వాడీ సెంటరులో మహిళలు, పిల్లల్లో అత్మ హత్యల నివారణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిరక్షణ విభాగం కౌన్సిలర్ కె శ్రీనివాసరావు విచ్చేసి ప్రసంగిస్తూ తల్లి దండ్రులు పిల్లలతో మాట్లాడటం ఎక్కువ సమయం వారితో కేటాయించటం వారి యొక్క సమస్యలు తెల్సుకొని అర్థం చేసుకొని పరిష్కరించకోవాలని, చదువు, అరోగ్యం భద్రత లక్ష్యం పై తల్లిదండ్రులకు అవగాహన కలుగ జేసారు. అనంతరం సెక్టార్ సూపర్ వైజర్ పి సామ్రాజ్యం మాట్లాడుతూ సమస్యను సమస్యగా చూడకుండా హెల్ప్‌లైన్ నెంబరును సంప్రదించి పరిష్కరించుకోవచ్చునని, సిహెచ్‌ఎల్ 1098, చైల్డ్‌లైన్ భద్రత కోసం 181, 100,112, మాసిక కౌన్సిలింగ్ 14416 ఫోన్ చేయవచ్చునని ఇవి ఇరవై నాలుగు గంటలు పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌కె జరినా, డి నర్మదా, అంగన్ వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పాస్ బుక్‌లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, జూలై 14, ప్రభాతవార్త: రాజముద్రతో ముద్రించిన పుస్తకాలను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ రైతులకు అందించారు. అధికార ముద్రతో ఉన్న పుస్తకాలను ఇచ్చి కూటమి ప్రభుత్వం రైతుల



హక్కును మరింతగా బలపరిచిందన్న ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వం చేసిన కుట్రలను తారమారు చేస్తూ పాస్ పుస్తకాలను ఇవ్వడం పై ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్న ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు,ఎమ్మార్వో మండల పార్టీ అధ్యక్షులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి పర్యటన విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే భాష్యం

పెదకూరపాడు,జూలై 14, ప్రభాతవార్త: కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటనను విజయవంతం చేయాలని కోరుతూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. ఈనెల 17వ తేదీన నరసరావుపేటలో జరిగే రుణాల పంపిణీ కార్యక్రమంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఎమ్మెల్యే అన్నారు.కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జానీ బాషా మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరు బ్రహ్మయ్య స్థానిక టిడిపి నేతలు ఆర్తి మల్ల రమేష్ పాల్గొన్నారు

## ఘనంగా టిడిపి నేత గింజుపల్లి జన్మదిన వేడుకలు

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 14, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర తెలుగు రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు ప్రత్తిపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో పార్టీ నేతల మధ్య మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు హాజరై గింజుపల్లి చేత జన్మదిన కేకును కట్ చేయించి అందరికీ పంపిణీ చేయించారు. భవిష్యత్తులో ఇలాంటి జన్మదిన వేడుకలను జరుపుకోవాలని, భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గుంటూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు, కాట్రపాడు మాజీ సర్పంచ్ మదమంచి శివశంకర్, గుంటూరు రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు మల్లికార్జున్,టిడిపి కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి జన్మదిన వేడుకలు

### విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ..

ప్రత్తిపాడు(వట్టిచెరుకూరు), జూలై 14, ప్రభాతవార్త: ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవక్త, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సలహాదారు (విద్యార్థులు నీతి విలువలు) బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు జన్మదిన వేడుకలు మండలంలోని (జిల్లా పకృతి వ్యవసాయ మోడల్ స్కూల్) కొర్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు రైతు సేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా



హెచ్ఎం శ్రీనివాసరావు, తెలుగు రైతు సేన అధ్యక్షులు చిరుకూరి విజయ్ కుమార్ మాట్లాడుతూ..పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు నైతిక విలువలు పెంపొందించే పుస్తకాలను అందించడం ద్వారా ఉన్నత భవిష్యత్తును అందించవచ్చని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సైతం విద్యార్థులలో నైతిక విలువలను ప్రేరేపించేందుకు చాగంటి సహాయంతో ప్రత్యేకంగా పుస్తకాలను రూపొందించి పంపిణీ చేయాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాలను గుర్తుంచుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎడ్లపల్లి మురళీకృష్ణ, మిలటరీ మస్తాన్, గ్రామ రైతులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలంటూ వినతి

పెదకూరపాడు,జూలై 14, ప్రభాతవార్త: బిసి సంక్షేమ శాఖామంత్రివర్యులు సవితమ్మ ని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ కలిసి నాయి బ్రాహ్మణ సామాజిక వర్గానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని నాయి బ్రాహ్మణ సెలూన్ షాపులకి ఉచితంగా అందిస్తున్నటువంటి 200 యూనిట్లు విద్యుత్తు రాయితీని అందించే విషయంలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి అని వాటిని పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సవితమ్మ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ సామాజిక వర్గానికి సంబంధించినటువంటి సంక్షేమ అభివృద్ధి ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో జరుగుతుందని ప్రజలకి తీసుకెళ్లాలని అన్నారు. ప్రభుత్వం 200 యూనిట్లు విద్యుత్ సెలూన్ షాపులకి రాయితీని ఇస్తుందని అయితే కొద్ది మాసాలుగా 200 యూనిట్లు పైబడి ఎంత వాడుకున్న మొత్తానికి బిల్లు వస్తుందని అలా కాకుండా 200 యూనిట్స్ మినహాయించి మిగతా యూనిట్స్ కి బిల్లు కట్టించుకునే విధంగా చూడాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సవితమ్మ ని మద్దిరాల గంగాధర్ కోరారు.



## త్రినేత్ర ఏఐ సిస్టంను రూపొందించిన కిట్స్ విద్యార్థులు

(ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 14, ప్రభాతవార్త : త్రినేత్ర ఏఐ సిస్టం తమ కళాశాల విద్యార్థిని విద్యార్థులు రూపొందించి నగదు బహుమతిని సాధించారని కిట్స్, కిట్స్ అక్షర చైర్మన్, సెక్రటరీ డాక్టర్ కోయి సుబ్బారావు, కోయి శేఖర్ తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలు లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మిషన్ యూత్ ఫర్ పోలీస్ హ్యాకథన్ 2026 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించిన్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, సెక్రెటరీ మాట్లాడుతూ..ప్రకాశం



జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన మిషన్ యూత్ ఫర్ పోలీస్ హ్యాకథన్ కార్యక్రమంలో మా కళాశాలలో కిట్స్ ఐటీ మరియు సిఎస్ఎం చదువుతున్న విద్యార్థిని జి.సాయిలక్ష్మి, టి.శ్రీవాణి, మహమ్మద్ మోహిన్, షేక్ నాజుహత్ ఫ్యూరిదీన్, పి.రోషన్ పాల్గొని త్రినేత్ర ఏఐ అనే సిస్టంను డిజైన్ చేసినట్లు తెలిపారు. ఇది సోషల్ మీడియా గుర్తింపు లింకులు, స్క్రీన్‌షాట్లు మరియు ప్రొఫైల్ ఫోటోల ఆధారంగా ధృవీకరించే ఒక మేధో వ్యవస్థ అని, ఇది నకిలీ ఖాతాలు, వేరొకరి పేరుతో నడిచే ఖాతాలు, మరియు డిజిటల్ మోసాలను గుర్తిస్తుందని చెప్పారు. అదనంగా డేటా లీకేజ్ లను నిరోధించేందుకు ఇన్ఫ్యూజన్ డిటెక్షన్ సిస్టమ్ ను కూడా నిర్మిస్తుందని వివరించారు. త్రినేత్ర ఏఐ సిస్టం రూపొందించినందుకుగాను రెండో బహుమతిగా రూ.5వేలు నగదు బహుమతి లభించిందని వెల్లడించారు. ప్రస్తుత సమాజంలో ఈ సిస్టం యొక్క ఆవశ్యకత ఎంతో ఉందని తెలియజేశారు. మా కళాశాల విద్యార్థులకు కొత్త ఆలోచనలు, ప్రయోగాలు చేపట్టడానికి, సృజనాత్మకతను అభివృద్ధి చేయడానికి ఇలాంటి వాటిలో ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సిస్టమ్స్ ను రూపొందించి సమాజానికి తమ వంతుగా ఉపయోగపడాలని కోరారు. నగదు బహుమతి గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులను కిట్స్ మరియు కిట్స్ అక్షర ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, హెచ్.ఓ.డిస్ మరియు అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

## ముంబై కోకిల బెన్ ఆస్పత్రిలో పవన్ కళ్యాణ్ ను పరామర్శించిన చిల్లపల్లి



మంగళగిరి, జూలై 14, ప్రభాతవార్త : ముంబైలోని కోకిల బిన్ ఆసుపత్రిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు ముంబై వెళ్లి పవన్ కళ్యాణ్ ను పరామర్శించారు. రాష్ట్ర ప్రగతి కోసం అహర్నిశలు పాటు పడుతున్న వ్యక్తి పవన్ కళ్యాణ్ అని చిల్లపల్లి తెలిపారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకొని యధావిధిగా ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలను అనుగ్రహించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చిల్లపల్లి పేర్కొన్నారు.

## శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

మంగళగిరి, జూలై 14, ప్రభాతవార్త : మంగళగిరి శివాలయం వద్ద గల శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం మెట్ల మార్గం దగ్గర అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల సందడితో పాటు భక్తి కాంతులు వెదజల్లుతూ శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం మంగళవారం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు తో పాటు దుంపల సుబ్బారావు అన్న ప్రసాద వితరణలో పాల్గొని భక్తులకు అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళగిరి పానకాల స్వామి ఆలయ మెట్ల మార్గంలో సాగే ఈ అన్నదాన కార్యక్రమం పరమశివులు ఆశీస్సులతో భక్తుల సహకారంతో ఎలాంటి



విరామం లేకుండా కొనసాగుతూనే ఉందని ఆయన అన్నారు. ప్రతి అమావాస్య రోజున 4500 మందికి అన్న ప్రసాదం అందజేస్తున్న ఈ సేవ కార్యక్రమం నిరంతరంగా కొనసాగించేందుకు ట్రస్ట్ సభ్యులు భక్తులు దాతలు ఎంతో ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని ఆయన తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలు గా ఎటువంటి విరామం లేకుండా ప్రతి నెల అమావాస్య సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం వెనుక 40 మంది దాతల సహకారం ఉందని, వారి ఉదారత వల్లే భక్తులకు ఆహారం అందించే అవకాశం లభిస్తోందని అన్నారు అన్నారు. .అంగ ఉపేంద్ర వర్మాను ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు, సభ్యులు గజమాలవేసి,శాలువాతో సత్కరించారు.. ఈ అన్నదాన కార్యక్రమంలో పుప్పాల కోటేశ్వరరావు, కర్నాటి శివ సత్యనారాయణ, కగ్గ శ్రీను, కోదాటి శ్రీనివాసరావు, పందేటి శ్రీనివాసరావు, రెడ్డి వీరరాఘవులు, నంద్యాల గోపాలకృష్ణ, ముద్ర బోయిన శ్రీనివాసరావు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి,ఉద్దంటి మురహరిరావు, శివ ప్రసాద్, రుద్రరాజు పెద్దిరాజు, పంచల శివ, నంగళం ప్రసాద్, దుంపల సోములు, గండికోట అచ్చయ్య, కటారి విష్ణుమూర్తి, చిరుమామిళ్ల రంగారావు, పేరుబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు..

## గండాలయ స్వామి భక్తుల కష్టాలు!



మంగళగిరి జూలై 14, ప్రభాతవార్త : మంగళగిరి పట్టణంలో కొండ శిఖర భాగాన ఉన్న గండాలయ స్వామి ఆలయానికి చేరుకునే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమావాస్య నాడు భక్తులు స్వామి వారిని దర్శించుకుని, దీపం వెలిగించి పూజలు నిర్వహించి వస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం అమావాస్య సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు కొండపై గల గండాలయ స్వామి ఆలయానికి తరలి వచ్చారు. మొక్కులు చెల్లించి క్రిందికి వస్తున్న క్రమంలో ఇద్దరు ద్విచక్ర వాహన దారులు ప్రమాదవశాత్తు ప్రక్కన లోయలో పడ్డారు. అప్రమత్తమైన తోటి భక్తులు గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆలయానికి భక్తుల తాకిడి పెరిగినందున ఘాట్ రోడ్డు పొడవునా, కొండ పైన భక్తుల భద్రత దృష్ట్యా తగు విధమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పోలీసుల పేరుతో దోపిడీలు చేస్తున్న నేరస్థుల అరెస్ట్

తెనాలి మున్సిపాలిటీ జులై14(ప్రభాతవార్త): పోలీసులమని చెప్పుకుంటూ, ప్రత్యేకంగా వృద్ధులను బెదిరించి దోచుకుంటున్న నకిలీ పోలీసులను, తెనాలి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు.బాపట్ల జిల్లా, చీరాల పట్టణం రాంనగర్ ఏరియాకి చెందిన కావటి కిరణ్ కుమార్, అతని స్నేహితుడు సధుపాటి మురళి గత కొంతకాలంగా తెనాలి పరిసర ప్రాంతాలలో బైక్ పై తిరుగుతూ వృద్ధులను టార్గెట్ చేసుకుంటున్నారు. జనసంచారం లేని ప్రదేశాలలో వృద్ధుల బైక్‌లను అడ్డగించి, "మేము పోలీసులము మీ బండి కాగితాలు చూపించండి, మీరు గంజాయి రవాణా చేస్తున్నారనే అనుమానం ఉంది" అంటూ భయభ్రాంతులకు గురిచేసేవారు. అనంతరం వారి వద్ద నుండి, బ్యాగుల నుండి లేదా బండి డిక్కీల నుండి దౌర్జన్యంగా డబ్బులు లాక్కుని పారిపోవడం వీరి శైలి.వివరాల్లోకి వెళితే,కొల్లిపర మండలానికి చెందిన మల్లికార్జున రెడ్డి (72) అనే వృద్ధుడు నందివెలుగులోని రైస్ మిల్లు వద్ద తన ధాన్యం



అమ్ముకోగా వచ్చిన డబ్బును స్కూటీ డిక్కీలో పెట్టుకుని తెనాలి వస్తున్నారు. ఆటోనగర్ ఏరియా మెయిన్ రోడ్డుపై బైక్ పై వచ్చిన ఇద్దరు నిందితులు ఆయనను ఆపారు. తాము పోలీసులమని, గంజాయి తనిఖీ చేయాలని చెప్పి డిక్కీ ఓపెన్ చేయించారు. అందులోని కవర్లో ఉన్న రూ. 1,60,000 నగదులో నుండి రూ. 50,000 దౌర్జన్యంగా లాక్కుని దుగ్గిరాల వైపు పారిపోయారు.అదే విధంగా, దుగ్గిరాల పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త పెట్రోల్ బంక్ సమీపంలో టీవీఎస్ బండిపై వెళ్తున్న మహమ్మద్ ఫారుక్ (60, అలీ నగర్) అనే వ్యక్తిని ఇదే ముఠా అడ్డగించింది. తాము మఫ్టీ పోలీసులమని నమ్మించి, బండిలో గంజాయి ఉందంటూ బెదిరించి, అతని చొక్కా జేబులో ఉన్న రూ. 7,000లను బలవంతంగా లాక్కుని వెళ్ళిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు దుగ్గిరాల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి ఈ ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేశారు.ఇద్దరు నిందితుల్లో కావట్టి కిరణ్ కుమార్ గతంలోనూ నకిలీ పోలీస్ అవతారమెత్తి గుంటూరు, చీరాల, వేటపాలెం, ఇంకొల్లు, ఒంగోలు, నందిగామ తదితర ప్రాంతాలలో నేరాలకు పాల్పడి,అరెస్ట్ అయి జైలుకు కూడా వెళ్లాడు. ఇతనిపై మొత్తం సుమారు 12 కేసులు ఉన్నాయని,రెండో ముద్దాయి నేపథ్యం,సాదుపాటి మురళి గతంలో సుమారు 12 సంవత్సరాల పాటు ఖిబీఎస్ఎఫ్ఖి (తీళీసీ) సెంట్రల్ పోలీస్ ఫోర్స్‌లో ఉద్యోగం చేశాడు. 2012లో ఉద్యోగం నుండి బయటకు వచ్చేసి, మద్యం మరియు ఇతర వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలోనే కిరణ్ కుమార్‌తో కలిసి నేరాలు చేయడం ప్రారంభించాడు. ఇతనిపై పాత కేసులు లేవని పోలీసులు తెలిపారు. ముఖ్యంగా వయసు పైబడిన వారు త్వరగా భయపడతారని, పోలీస్ స్టేషన్లకు వెళ్లి కేసులు పెట్టడానికి వెనుకాడతారని, అలాగే నిందితులను గుర్తించే అవగాహన తక్కువగా ఉంటుందని భావించి వీరిని టార్గెట్ చేసేవారని,ఈ నేరస్థులు బాధితుల వద్ద ఉన్న మొత్తం డబ్బును దోచుకోరు. కొంత మొత్తాన్ని మాత్రమే తీసుకుంటారు. మొత్తం డబ్బులు పోతే బాధితులు కచ్చితంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్తారని, కొద్దిపాటి డబ్బులే పోతే సర్దుకుపోతారనే చాణక్యపు ఆలోచనతోనే వీరు ఈ విధంగా చేసేవారన్నారు. నిందితుల వద్ద నుండి, రు.57000/, పల్సర్ మోటార్ సైకిల్ రికవరీ చేసామన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే సకాలంలో స్పందించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను పట్టుకున్న తెనాలి రూరల్ ఎస్ఐ కె.ఆనంద్, సిబ్బందిని, వారికి దిశా నిర్దేశం చేసిన తెనాలి రూరల్ సీఐ నాయబ్ రసూల్ ని,తెనాలి డీఎస్పీ బి. జనార్ధన్ రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రూరల్ పోలీసులు మాట్లాడుతూ,తెనాలి మరియు పరిసర ప్రాంతాలలో ఎవరికైనా ఇలాంటి అనుభవాలు ఎదురై ఉంటే, వెంటనే సదరు పోలీసు వారి దృష్టికి తీసుకురావాల్సిందిగా సూచించారు.

## పంటల బీమా చేయించుకోవాలి

### సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మనోజ్

ప్రత్తిపాడు, జూలై 14, ప్రభాతవార్త : తప్పనిసరిగా రైతులు సాగు చేస్తున్న పంటలను క్రాప్ ఇన్సూరెన్స్ (ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన) చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మనోజ్ పేర్కొన్నారు. పెదకాకాని మండల కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఏడిఏ యన్.మోహన్రావు ఆధ్వర్యంలో మంగళవారం



రైతులకు శిక్షణ కార్యక్రమము జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వనరుల కేంద్రం, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మనోజ్ హాజరై మాట్లాడుతూ.. 2026 ఖరీఫ్ లో రైతులు వేసిన పంటలన్నిటికీ క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలిపారు. ఈ ఏడాది ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉండటం వలన ప్రతిరైతు పంటలను క్రాఫ్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, అధిక వర్షాలు, కరువు, తుఫానులు వంటి కారణాలతో పంటనష్టం జరిగితే రైతుకు ఆర్థిక రక్షణ కల్పించేందుకు పంట బీమా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. ప్రత్తిపంట సాగుచేయు రైతులందరూ యకరాకు రూ.1900లు ప్రీమియం జూలై 15వతేదీ లోపు, మిరప యకరానికి రూ.2700లు, మినుము యకరాకు రూ.200లు ప్రీమియం ఈనెల 31వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ముఖ్యంగా వరి పంటకు ఎకరానికి రూ.800ల చొప్పున ఆగస్టు 15వతేదీ లోపు ప్రీమియం చెల్లించాలని వివరించారు. అలానే ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ పై కూడా అవగాహన కల్పించారు. ఏడిఏ మోహన్రావు మాట్లాడుతూ..వరి లో అధిక దిగుబడులకు సమగ్ర యాజమాన్య పద్ధతులు గురించి, వరిలో పోషక యాజమాన్యం, విత్తనాల గొర్రుతో నేరుగా విత్తే పద్ధతి, మరియు పురుగులుతెగుళ్ల యాజమాన్యం గురించి తెలిపా రు. వరిలో ఎల్నినో ప్రభావం ఉన్నది కనుక స్వల్పకాలిక రకాలను విత్తుకోవాలని, తరచుగా నష్టాన్ని కలగజేసే ముఖ్యమైన పురుగులను, తెగుళ్లను తట్టుకునే రకాలను సాగుచేయాలని, రైతులందరూ తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసిన తర్వాతనే నాటుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పంటల భీమా గురించి అధికారులను ప్రశ్నలు వేసి జవాబులు తెలుసుకున్నారు. శిక్షణలో పాల్గొన్న రైతులకు సర్టిఫికెట్స్ ఇవ్వటం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.రమణ కుమార్, రైతులు పెండ్యాల శ్రీకాంత్, తోట నారయ్య, బోయపాటి రమేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేసిన తెదేపా నాయకులు

తెనాలి మున్సిపాలిటీ జులై14(ప్రభాతవార్త): మానవత్వమే ధ్యేయంగా పనిచేస్తూ,ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదల ఆరోగ్యానికి ఆర్థిక చేయూత అందిస్తున్న శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్. తెనాలి పట్టణానికి చెందిన వీరవల్లి రమేష్ బాబ్జీ వైద్య చికిత్స కోసం, తెనాలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ , మాజీ మంత్రి,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ మరియు



ప్రత్యేక సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి లెటర్ అఫ్ క్రెడిట్ ద్వారా రూ. 5,00,000/ మంజూరైంది.ఈ ఆర్థిక సహాయానికి సంబంధించి మంగళవారం బాధితునికి రు.5,00,000/ ల చెక్కును అందజేసిన స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు. ఆపద సమయంలో ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి,అలాగే ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్,ప్రధాన కార్యదర్శి వసంతం అశోక వర్ధన, మల్లవరపు విజయ్,ఫణిదపు దుర్గ,షావుల్ సయ్యద్,కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై ఆక్రమణలను తొలగించిన తెనాలి పోలీసులు

తెనాలి జులై14(ప్రభాతవార్త): రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులకు తెనాలి,వన్ టౌన్,టూ టౌన్ పోలీసులు, ట్రాఫిక్ ఇబ్బందులు గురించి అవగాహన కల్పించారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని శివాజీ చౌక్ నుండి గాంధీ చౌక్ వరకు రోడ్డు ఆక్రమణ లను



తొలగించారు.తోపుడు బండ్లు మరియు షాపులు ముందు రోడ్డు మీద తీసుకువచ్చి షాపులు యొక్క వస్తువుల్ని ట్రాఫిక్ ఇబ్బంది కలిగించే విధంగా రోడ్డు ఆకుపై చేసిన వస్తువులను తీపించి లోపల పెట్టించి మరొకసారి మరల ఈ విధంగా రోడ్డు ఆకుపై చేస్తే అలా చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడును ఎవరు దయచేసి షాపులు ముందు షాపులు సంబంధించిన సామాన్లను షాపు నుండి రోడ్డు మీదకు తీసుకువచ్చిరోడ్డు ఆకుపై చేసి పార్కింగ్ ప్లేస్ లకు ఆటంకం కలిగించరాదు. ట్రాఫిక్ సమస్యలు తెనాలి పట్టణంలో రోజురోజుకీ పెరిగిపోతున్న దృష్ట్యా ప్రజలందరూ, మరియు వాహందారులందరూ సహకరించి ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా సహకరించవలసిందిగా,వన్ టౌన్ సీఐ రాంబాబు,టూ టౌన్ సీఐ రవీంద్రబాబు వ్యాపారస్తులకు సూచించారు.

## సర్...కు మరో 10 రోజుల గడువు..

**ఈనెల 24 వరకు ఇంటింటి సర్వేకు ఈసీ అవకాశం.**

**జిల్లాలో ఇంకా పూర్తికావాల్సిన వేలాది ఫారాలు.**

ప్రతిపాడు, జూలై 14, ప్రభాతవార్త : రాష్ట్రంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియకు భారత ఎన్నికల సంఘం మరో 10 రోజుల గడువు పొడిగించింది. నేటితో ముగియాల్సిన ఇంటింటి సర్వేను ఈనెల 24 వరకు పొడిగిస్తూ ఎన్నికల సంఘం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బూత్ స్థాయి అధికారులు, ఎన్నికల యంత్రాంగానికి పెండింగ్‌లో ఉన్న ఫారాలను పూర్తి చేసేందుకు అదనపు అవకాశం లభించింది.

**ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం..**

ఇంటింటి సర్వే: జూన్ 15 నుంచి జూలై 24 వరకు, ఈనెల 24 లోగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఈనెల 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లైమ్ లు, సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాల పరిష్కారం, అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందని ఈసీ వెల్లడించింది. జిల్లాలో సర్ ప్రక్రియ వేగంగా సాగుతున్నప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో ముగియలేదు. అధికారికంగా ఇప్పటివరకు సుమారు 90 శాతానికి పైగా ఎన్యూమరేషన్ పూర్తయింది. మిగిలిన 10 శాతం ఫారాలు, ఇంటింటి సందర్శనలు పూర్తి చేయాల్సి ఉంది. ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లు అందుబాటులో లేకపోవడం, కొన్ని కుటుంబాలు ఇంట్లో లేకపోవడం, పట్టణ ప్రాంతాల్లో వలస జనాభా అధికంగా ఉండటం వల్ల కొంత పని పెండింగ్‌లో ఉంది.

**..గడువు పెంపుతో లక్ష్యం సాధ్యమేనా!..?**

ఈ నెల 24 వరకు అవకాశం రావడంతో పెండింగ్ పనిని పూర్తి చేయగలమనే విశ్వాసాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రత్యేక బృందాలు, మండల ప్రత్యేక అధికారులు, ఎన్నికల సిబ్బంది పర్యవేక్షణలో సర్వే కొనసాగుతోంది. చివరి దశలో ఫారం6, 7, 8లకు సంబంధించిన వివరాల సేకరణ, ధృవీకరణపై దృష్టి సారించనున్నారు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే మరోసారి గడువు పొడిగించే అవకాశం తక్కువగానే కనిపిస్తోంది. ఎన్నికల సంఘం ఇప్పటికే పది రోజుల అదనపు సమయం ఇవ్వడంతో ఈ వ్యవధిలోనే సర్వే పూర్తి చేయాలని అధికార యంత్రాంగానికి స్పష్టమైన సూచనలు ఇచ్చింది. అయితే వాతావరణ పరిస్థితులు, భారీ వర్షాలు లేదా అనివార్య పరిస్థితులు ఏర్పడితే మాత్రమే భవిష్యత్తులో మార్పులపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. జిల్లాల్లో ఇంటింటి సర్వే పూర్తికాకపోవడం, ఎక్కువ మంది ఓటర్లు అందుబాటులో లేకపోవడం, అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. ఒక్క అర్హుడూ ఓటు హక్కు కోల్పోకుండా, తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ గడువు పెంపు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

**..బిఎల్‌వోలపై ఒత్తిడి..**

ఒక బిఎల్‌వో పరిధిలో వందలాది మంది ఓటర్ల వివరాలను ధృవీకరించాల్సి రావడంతో చివరి దశలో పనిభారం పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ పెండింగ్ కనిపిస్తుంది. పట్టణాల్లో ఉద్యోగాలు, చదువుల కోసం బయటకు వెళ్లిన వారి కారణంగా ఇంటింటి సర్వే పూర్తి చేయడం సవాలుగా మారింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లో పనిచేస్తున్న ఓటర్ల వివరాల నిర్ధారణ ఆలస్యానికి కారణమవుతోంది.

**..డూప్లికేట్ ఓట్ల తొలగింపుపై ప్రత్యేక దృష్టి..**

ఒక ఓటర్ పేరు రెండు చోట్ల నమోదై ఉంటే వాటిని గుర్తించి తొలగించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతోంది. ముసాయిదా జాబితా విడుదల తర్వాత వచ్చే క్లెయిమ్‌లు, అభ్యంతరాలే తుది ఓటరు జాబితా నాణ్యతను నిర్ణయిస్తాయి. అందువల్ల రాజకీయ పార్టీలు కూడా ఈ దశపై దృష్టి సారించే అవకాశం ఉంది. నూరు శాతం ఎన్యూమరేషన్ పూర్తి చేయడంతో పాటు, ఒక్క అర్హుడి పేరు కూడా మిస్ కాకుండా అధికారులు ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశాల నేపథ్యంలో ఈ సవరణ ప్రక్రియ రాజకీయంగా కూడా అత్యంత కీలకంగా మారింది. ప్రజల సహకారంతో అధికారులు ఇంటికి వచ్చినప్పుడు అవసరమైన పత్రాలు చూపించి వివరాలు ధృవీకరించుకోవాలని ఎన్నికల సంఘం ప్రజలకు విజ్ఞప్తి చేస్తోంది.

# నేడు అవగాహన...లో మనమూ పాడుదాం రండి....

గుంటూరు కల్చరల్,జూలై 14,ప్రభాతవార్త : అవగాహన మనమూ పాడుదాం రండి బృంద సభ్యులైన గాయనీ గాయకులు గానకోకిల ఎస్.జానకి సంస్మరణ కార్యక్రమం,ఆ మహాగాయని పాటలు ఆలాపిస్తూ స్వరనీరాజనం కార్యక్రమం ఏర్పాటు చేశారని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.జూలై 15వ తేది బుధవారం సాయంత్రం 6గంటలకు సంస్థ కార్యాలయంలో నిర్వహించే సంస్మరణ కార్యక్రమంలో జిల్లా సంగీత కళాకారుల సంఘం అధ్యక్షులు,ఎస్.జానకీ సన్నిహితుడు అయిన మద్దు వెంకటస్వామి,అవగాహన సాంస్కృతిక కార్యక్రమాల కోఆర్డినేటర్ బిళ్లా అశోక్ తదితరులు పాల్గొంటారని,సంగీత ప్రియులందరూ హాజరై గాయనీ గాయకులు ఆలాపించే ఎస్.జానకి పాటల కార్యక్రమాన్ని,ఆమె సంస్మరణ కార్యక్రమాన్ని వీక్షించవలసిందిగా అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

# మరణశయ్యపై ముజ్తబా ఖమేనీ!



## ప్రస్తుత ఇరాన్ సుప్రీం లీడర్ 90% ప్రాణాలు కోల్పోయినట్లే..

### ఆదేశ సైనిక సామర్థ్యం పూర్తిగా నిర్వీర్యం : ట్రంప్

**వాషింగ్టన్,జులై 14:** అమెరికా-ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం మరింత వేడెక్కింది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఆ దేశ సైనిక సామర్థం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని, అగ్ర కమాండర్లందరూ హతమయ్యారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ ప్రస్తుత సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీ కూడా 90 శాతం ప్రాణాలు కోల్పోయినట్లే అని పేర్కొనడం అంతర్జాతీయంగా పెను సంచలనం రేపుతోంది. ఇరాన్ సైనిక పరిస్థితిపై ట్రంప్ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ఇప్పుడు ఇరాన్ వద్ద నావికాదళం లేదు, వైమానిక దళం లేదు అంతా శూన్యం. వారి యాంటీఎయిర్‌క్రాఫ్ట్ నిఘా వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వారి అగ్రనాయకులు, అత్యంత ప్రతిభావంతులైన కమాండర్లు అందరూ హతమయ్యారని ట్రంప్ వివరించారు. ఈ క్రమంలో ఆయన 1989లో మరణించిన ఇరాన్ విప్లవ నేత ఖొమేనీ పేరును ప్రస్తావించినప్పటికీ ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన మొదటి రోజే ఇరు దేశాల (అమెరికా, ఇజ్రాయెల్) దాడుల్లో మరణించిన సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీని ఉద్దేశించే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. తండ్రి మరణించిన అదే దాడుల్లో తీవ్రంగా గాయపడి, గత వారం జరిగిన అంత్యక్రియలకు కూడా హాజరుకాని ఆయన కుమారుడు ముజ్తబా ఖమేనీ 90 శాతం మరణ శయ్యపై ఉన్నారంటూ ట్రంప్ సంచలన విషయాలు బయటపెట్టారు. కొన్ని నెలల తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత, గత వారంనుండి అమెరికాతిరిగి ఇరాన్‌పై బాంబుల వర్షంకురిపిస్తోంది. ఈ మిలిటరీ యాక్షన్‌పై ట్రంప్ అధికారికంగా యుఎస్ కాంగ్రెస్‌కు కూడా నోటిఫికేషన్ పంపారు. ఇదే సమయంలో అంతర్జాతీయ నౌకల రాకపోకల విషయంలో వందల సంవత్సరాలుగా వస్తున్న అమెరికా స్వేచ్ఛా నౌకాయాన విధానానికి ట్రంప్ స్వస్తి పలికారు. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే ఇతర దేశాల వాణిజ్య నౌకలకు భద్రత కల్పిస్తున్నందుకు గానూ ఇకపై అమెరికా సురక్షిత ప్రయాణ రుసుము వసూలు చేస్తుందని స్పష్టం చేశారు. అమెరికా చర్యలను ఇరాన్ కూడా తీవ్రస్థాయిలో ప్రతిఘటిస్తోంది. బహ్రెయిన్‌తో పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)కి చెందిన రెండు చమురు రవాణా నౌకలపై ఇరాన్‌క్షిపణి దాడులు చేయడంతో, ఒక భారతీయ పౌరుడు మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ ఘటనతో అబుదాబి, దుబాయ్ వంటి సంపన్న నగరాలు కలిగిన యూఎఇసైతం ఇరాన్‌పై ప్రతీకార చర్యలకు సిద్ధమంటూ హెచ్చరికలు జారీ చేసింది. ప్రపంచ ముడిచమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు అమెరికా-ఇరాన్ పట్టుబడుతుండటంతో పశ్చిమాసియా ఇప్పుడు ఒక పేలడానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతంలా మారింది.



## హర్మూజ్‌లో ఎమిరేట్స్ నౌకపై దాడి..

# భారతీయుని మృతి

### మరో 8 మందికి తీవ్ర గాయాలు

**సనా,జులై 14:** పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికాల మధ్య రేగిన ఉద్రిక్తతలు ఇప్పుడు ఇతర దేశాల పౌరుల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఎఇ)కి చెందిన రెండు జాతీయ చమురు నౌకలపై ఇరాన్ జరిపిన భారీ క్షిపణి దాడిలో ఒక భారతీయ నౌకా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ఆరుగురు భారతీయులు, ఇద్దరు ఉక్రెయిన్ పౌరులు ఉన్నారని, వారిలో నలుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఈ దాడిని యుఎఇ రక్షణ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇది అంతర్జాతీయ చట్టాలను పూర్తిగా ఉల్లంఘించడమేనని, ప్రాంతీయ భద్రతకు తీవ్ర ముప్పని పేర్కొంది. తమ దేశ సార్వభౌమత్వాన్ని, పౌరులను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని, ఈ దుశ్చర్యకు తగిన రీతిలో బుద్ధి చెబుతామని యుఎఇ స్పష్టం చేసింది. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే అమెరికా సేనలు ఇరాన్‌పై వైమానిక దాడులను మరింత తీవ్రం చేశాయి. ఇరాన్ దాడుల సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకు తాము సరికొత్త వైమానిక దాడులను ప్రారంభించినట్లు యుఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. మేం ఇరాన్‌ను చాలా బలంగా దెబ్బతీస్తున్నాం. వారి దాడి చేసే శక్తినంతటినీ తుడిచిపెడుతున్నాం. హర్మూజ్ జలసంధిని మా అదుపులోకి తెచ్చుకుని, దిగ్బంధాన్ని కఠినతరం చేస్తున్నాం అని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్ ఓవల్ ఆఫీస్ నుండి ప్రకటించారు. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే వాణిజ్య నౌకల రక్షణ బాధ్యతను తామే చూసుకుంటున్నందున, దానికి ప్రతిఫలంగా ఆయా నౌకల నుంచి రక్షణ రుసుము వసూలు చేయబోతున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు.





## కొవిడ్ వ్యాక్సిన్‌తో రక్తం గడ్డకట్టే కేసులు పెరగలేదు - ఐసిఎంఆర్ నివేదిక

**న్యూఢిల్లీ,జులై 14:** కొవిడ్ వ్యాక్సిన్ వల్ల రక్తం గడ్డకట్టే కేసులు కానీ, గుండెపోటు కేసులు కానీ పెరగలేదని ఐసిఎంఆర్ తన స్టడీ నివేదిక విడుదల చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్, నేషనల్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ ఎపిడమాలజీ దేశ వ్యాప్తంగా సుమారు 25 ఆస్పత్రుల్లో ఆ స్టడీ నిర్వహించారు. కోవిడ్19 టీకాకు, రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే సంఘటనలతో ఎటువంటి సంబంధంలేదని ఐసిఎంఆర్ తన అధ్యయనంలో తేల్చింది. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వారిలో కోవిడ్ టీకాలతో గుండెపోటు కానీ రక్తం గడ్డకట్టే కేసులు నమోదు కాలేదని ఐసిఎంఆర్ తన రిపోర్టులో చెప్పింది. 2021-23 మధ్య కాలంలో భారత్‌లో చోటుచేసుకున్న త్రాంబాటిక్ సంఘటనలు, ఆస్పత్రుల్లో కేస్ స్టడీ అన్న టైటిల్‌తో సర్వే చేపట్టారు. త్రాంబాసిస్ అంటే రక్తం గడ్డకట్టే ప్రక్రియ. ఈ పరిస్థితి చాలా వరకు కేసుల్లో మెడికల్ లేదా లైఫ్ స్టైయిల్ రిస్క్ ఫ్యాక్టర్ల వల్ల వస్తున్నట్లు గుర్తించారు. కోవిడ్ కన్నా ముందు నుంచి సిగరేట్ అలవాటు ఉండడం కానీ, గతంలో ఏవైనా వ్యాధులు ఉండడం వల్లకానీ, కుటుంబీకుల్లో రక్త సమస్యలు ఉన్నవారిలో టీకా రిస్క్ ఉన్నట్లు గుర్తించారని స్టడీలోతెలిపారు. మే 2023 నాటికి సుమారు 97 శాతం అర్హులైన వారికి ఇండియాలో ఓ డోసు కోవిడ్ 19 వ్యాక్సిన్ ఇచ్చారు. ఇక అప్పటికే 90 శాతం మందికి రెండు దశల డోసు తీసుకున్నారు. ముందస్తుజాగ్రత్తగా హెల్త్‌కేర్ సిబ్బందికి మూడవ డోసు ఇచ్చారు. 60 యేళ్ల దాటిన వారికి, ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి కూడా మూడో డోసు ఇచ్చారు. వ్యాక్సినేషన్ వల్ల బెనిఫిట్స్ జరిగినట్లు స్టడీలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి భారత్‌తోపాటు విదేశాల్లోనూ విస్తృత ఆధారాలు ఉన్నట్లు స్టడీలో తెలిపారు.

## ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహ్మదీ నెజాద్‌తో ఇజ్రాయెల్ కుట్ర!



### ఖమేనీ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు వ్యూహం లీక్

**టెహ్రాన్,జులై 14:** ఇరాన్‌లో ప్రస్తుత ఇస్లామిక్ ప్రభుత్వాన్ని కూలదోసి, ఆ స్థానంలో అహ్మదీ నెజాద్‌ను ఇరాన్ అధినేతగా కూర్చోబెట్టేందుకు ఇజ్రాయెల్ ఒక భారీ రహస్య వ్యూహాన్ని రచించినట్లు అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ గూఢచారి వర్గాల ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ సంచలన కథనం ప్రచురించింది. ప్రస్తుతం ఈ కుట్ర ఇరాన్ నిఘావర్గాలకు తెలిసిపోవడంతో అహ్మదీ నెజాద్‌ను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) గృహనిర్బంధంలో ఉంచినట్లు తెలుస్తోంది. ఇరాన్ అత్యున్నత నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీతో వచ్చిన విభేదాలు, దేశ పతనంపై ఉన్న అసంతృప్తితోనే అహ్మదీనెజాద్ ఇజ్రాయెల్ ప్రతిపాదనలకు తలొగ్గినట్లు సమాచారం.

2024లో హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లోని లుడోవికా యూనివర్సిటీలో జరిగిన పర్యావరణ సదస్సు కేవలం ఒక ముసుగు మాత్రమేనని, అక్కడే ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొసాద్ అప్పటి చీఫ్ డేవిడ్ బార్నియా నేరుగా అహ్మదీనెజాద్‌తో సుదీర్ఘ చర్చలు జరిపారని కథనంలో పేర్కొన్నారు. ఇజ్రాయెల్ అధికారులతో చర్చలు జరిపేందుకు అహ్మదీ నెజాద్ ప్రయాణ, వసతి ఖర్చులను కూడా ఇజ్రాయెలే భరించిందని,

ఈ విషయాన్ని మొసాద్ సంస్థ అమెరికా సిఐఎకి కూడా చేరవేసిందని సమాచారం. ఇటీవల ఇరాన్ -అమెరికా మధ్య జరిగిన దాడుల సమయంలో ఈ వ్యూహం పతాక స్థాయికి చేరింది. ఇరాన్‌లోని అహ్మదీ నెజాద్ నివాసంపై ఇజ్రాయెల్ వైమానిక దాడి జరిగి ఆయన రక్షణ వాహనాలు ధ్వంసమైన వెంటనే, ఒక నల్లటి ప్యూజో కారు అక్కడికి చేరుకుని ఆయనను సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లింది. ఆ కారును నడిపింది మొసాద్ ఏజెంట్లని సమాచారం. ఇజ్రాయెల్ తనను మళ్లీ అధికారంలోకి తెస్తుందనే నమ్మకం సడలడం, ఆ రక్షణ చర్యలపై అనుమానాలు రావడంతో అహ్మదీ నెజాద్ ఆ సేఫ్ హౌస్ నుండి బయటకు వచ్చేశారు. ఆ తర్వాత ఫిబ్రవరి నుండి ప్రజల కంటపడని ఆయన గత వారం దివంగత సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియల వేళ మాత్రమే కొద్దిసేపు కనిపించారు.

2005 నుండి 2013 వరకు ఇరాన్ అధ్యక్షుడిగా ఉన్న కాలంలో అహ్మదీనెజాద్ ఇజ్రాయెల్, పాశ్చాత్య దేశాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడేవారు. కానీ పదవి నుంచి దిగిపోయాక అవినీతిని వ్యతిరేకిస్తూ తన గొంతు మార్చారు. ప్రస్తుత ఇస్లామిక్ వ్యవస్థ కుప్పకూలితే తాను దేశాన్ని నడిపించగలనని, ట్రంప్ హయాంలో కుదిరిన అబ్రహం ఒప్పందాల తరహాలోనే ఇజ్రాయెల్‌తో సంబంధాలను సాధారణ స్థితికి తెస్తానని ఆయన సన్నిహితుల వద్ద ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అయితే ఈ సంచలన ఆరోపణలపై అటు ఇరాన్ కానీ, ఇటు ఇజ్రాయెల్ కానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

# హర్మూజ్ టాక్స్ విత్‌డ్రా

### గల్ఫ్ దేశాలతో పెట్టుబడి, వాణిజ్య ఒప్పందాలకే ట్రంప్ మొగ్గు

**వాషింగ్టన్,జులై 14:** హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే సరుకు రవాణాపై 20 శాతం రుసుము విధిస్తామని చేసిన ప్రకటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తీసుకున్నారు. దానికి బదులుగా మధ్యప్రాచ్యంలోని గల్ఫ్ దేశాలు అమెరికాలో భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టడం, వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా ప్రయోజనం పొందాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ట్రూత్ సోషల్ వేదికగా స్పందించిన ట్రంప్ మధ్యప్రాచ్య దేశాల నాయకులతో అత్యంత ఫలప్రదమైన చర్చలు జరిపిన అనంతరం, అమెరికాకు చెల్లించాల్సిన 20 శాతం రీయింబర్స్‌మెంట్ ఫీజును రద్దు చేసి, దాని స్థానంలో గల్ఫ్ దేశాలతో భారీ పెట్టుబడి, వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలని నిర్ణయించానని పేర్కొన్నారు. ఈ పెట్టుబడులు అపార స్థాయిలో ఉంటాయని, అవి అమెరికాతో పాటు గల్ఫ్ దేశాల భవిష్యత్తుకూ ఎంతో ప్రయోజనకరంగా మారతాయని ట్రంప్ తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా అమెరికాలో కొత్త పరిశ్రమలు, తయారీ యూనిట్లు, ప్లాంట్లు, ఆధునిక పరికరాల తయారీ కేంద్రాలు చారిత్రక స్థాయిలో ఏర్పడతాయని, దాంతో లక్షలాది అధిక వేతనాల ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన చెప్పారు. అంతకుముందురోజే ట్రంప్ హర్మూజ్ జలసంధి గుండా రవాణా అయ్యే ప్రతి సరుకుపై 20శాతం రుసుము వసూలు చేస్తామని ప్రకటించారు. ప్రపంచంలోని అత్యంత కీలక సముద్ర మార్గాల్లో ఒకటైన హర్మూజ్ జలసంధి భద్రత కోసం అమెరికా భారీ వ్యయం చేస్తోందని, ఆ ఖర్చును భర్తీ చేసేందుకు ఈ రుసుము అవసరమని ఆయన పేర్కొన్నారు.అమెరికా ఇకపై హర్మూజ్ జలసంధి సంరక్షక దేశంగా వ్యవహరిస్తుందని, ఆ ప్రాంతంలో భద్రత, రక్షణ కల్పించేందుకు అయ్యే వ్యయాన్ని సరుకు రవాణాపై 20 శాతం రుసుము రూపంలో వసూలు చేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌పై కఠిన వైఖరిహోర్మూజ్ జలసంధి ఇతరదేశాలకు తెరిచి ఉన్నప్పటికీ, ఇరాన్‌కు మాత్రం అందుబాటులో ఉండదని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ నాయకత్వం హింసాత్మక, మోసపూరిత విధానాలను అనుసరిస్తోందని ఆరోపించిన ఆయన, ఇరాన్‌కు సంబంధించిన నౌకలు లేదా ఇరాన్ సరుకు రవాణా చేసే నౌకలపై పూర్తి దిగ్బంధనం అమలు చేస్తామని హెచ్చరించారు.

## కోడలికి మామ ఆస్తిలో పోషణహక్కు: సుప్రీంకోర్టు కీలక తీర్పు



**న్యూఢిల్లీ,జులై 14:** హిందూ కుటుంబాలలో కోడళ్ల హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది.మామ మరణించిన తర్వాత భర్త మరణించినప్పటికీ, కోడలు తన మామ ఆస్తి నుండి భరణం పొందేందుకు అర్హురాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ హక్కు హిందూ దత్తత మరియు నిర్వహణ చట్టం, (1956) ప్రకారం వర్తిస్తుందని కోర్టు పేర్కొంది. జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టి ధర్మాసనం ఈ తీర్పునువెలువరించింది. తీర్పులో కుటుంబ సభ్యులను ఆదుకోవడం కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా సామాజిక, నైతిక బాధ్యత కూడా అని పేర్కొంది. మనుస్మృతిలోని తల్లి, తండ్రి, భార్య మరియు కుమారుడినిఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టకూడదు. వారిని విస్మరించడం నైతిక నేరం అనే భావనను కూడా ప్రస్తావించింది. భర్త మరణించిన సమయాన్ని ఆధారంగా తీసుకుని కోడలికి భరణం నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. మామ బతికున్నప్పుడే భర్త మరణించి ఉండాలనే నిబంధన విధించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), ఆర్టికల్ 21 (గౌరవప్రదమైన జీవన హక్కు)లకు విరుద్ధమని స్పష్టం చేసింది. మహేంద్ర ప్రసాద్ 2021లో మరణించారు. అనంతరం ఆయన కుమారుడు రంజిత్ శర్మ 2023లో (తండ్రి మరణించిన తర్వాత) మరణించారు. రంజిత్ శర్మ భార్య గీతా శర్మ తన పోషణ కోసం మామ ఆస్తి నుండి భరణం కోరుతూ కోర్టును ఆశ్రయించారు. దిగువ కోర్టు, గీతా శర్మ మామ జీవించి ఉన్న సమయంలో విధవరాలు కాలేదనే కారణంతో ఆమె పిటిషన్‌ను తిరస్కరించింది. సుప్రీంకోర్టు ఆ నిర్ణయాన్ని రద్దు చేస్తూ, భర్త మరణించిన సమయాన్ని ఆధారంగా తీసుకుని భరణం నిరాకరించడం చట్టబద్ధం కాదని పేర్కొంది. గీతా శర్మకు మామ ఆస్తి నుండి భరణం పొందే హక్కు ఉందని తీర్పు ఇచ్చింది. మామ ఆస్తిని పొందిన వారసులు, చట్టం ప్రకారం ఆధారపడిన కోడలి పోషణ బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది భర్తకు స్వంత ఆస్తి లేకపోయినా, తనను తాను పోషించుకోలేని స్థితిలో ఉన్న కోడలికి భరణం కోరే హక్కు ఉంటుంది మహిళల గౌరవం, జీవన భద్రతను కాపాడే విధంగా చట్టాలను విస్తృతంగా అర్థం చేసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.



## లష్కరేచీఫ్ హాఫీజ్ సయీద్‌కు నాన్‌బెయిలబుల్ వారంట్

**న్యూఢిల్లీ,జులై 14:**లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌పై జమ్మూకశ్మీర్‌కు చెందిన ప్రత్యేక ఎన్ఐఎ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. పెహల్గామ్ ఉగ్రదాడితో లింకున్న కేసులో కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. జూలై 8వ తేదీన ఎన్ఐఎ కోర్టు ప్రత్యేక జడ్జీ ఆ ఆదేశాలు జారీ చేశారు. పెహల్గామ్ ఉగ్రదాడి కేసులో హాఫీజ్ సయీద్‌పై ఎన్ఐఎ నేరాభియోగం నమోదు చేసిన తర్వాత కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. భారత్, అమెరికా దేశాలు హాఫీజ్ సయీద్‌ను గ్లోబల్ ఉగ్రవాదిగా ప్రకటించిన విషయం తతెలిసిందే. 2008 ముంబై ఉగ్రదాడి కేసులో మాస్టర్‌మైండ్ కూడా. 76 ఏళ్ల సయీద్‌పై సప్లమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.

భారతీయ న్యాయ సంహితో పాటు యుఎపిఎ సెక్షన్ల కింద అతనిపై కేసు బుక్ చేశారు. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్సులోఉన్న సరోగ్దాలో సయీద్ ఉంటున్నట్లు ఎన్ఐఎ కోర్టుకు చెప్పింది. పెహల్గామ్ ఉగ్రదాడి నిందితుడైన హాఫీజ్.. ప్రస్తుతం అరెస్టు నుంచి తప్పించు కున్నట్లు కోర్టు పేర్కొన్నది. హాఫీజ్ అరెస్టు కోసం నాన్‌బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసిన ఎన్ఐఎ.. ఎట్టి పరిస్థితుల్లో అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నది. పెహల్గామ్ ఉగ్రదాడి కేసులో నిష్పాక్షిక దర్యాప్తు కోసం సయీద్‌ను కస్టడీలోకి తీసుకోవాలని ఎన్ఐఎ పేర్కొన్నది. నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ ఆదేశాలను జమ్మూ డీఐజీకి పంపినట్లు ఎన్ఐఎ కోర్టు తెలిపింది. 2025 ఏప్రిల్ 22వ తేదీన పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే.

## ప్రధానిమోడీకి కేతన్ అగర్వాల్ తల్లి సుదీర్ఘలేఖ





**పూణె,జులై 14:** పుణేకు చెందిన రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసులో న్యాయం చేయాలని కోరుతూ ఆయన తల్లి రాఖీ అగర్వాల్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి భావోద్వేగభరితమైన లేఖ రాశారు. తన కుమారుడి మరణంతో తమ ప్రపంచం శూన్యమైందని ఆవేదన వ్యక్తం చేసిన ఆమె, ఈ కేసును కేవలం మరో ఫైల్‌గా పరిగణించవద్దని ప్రధానిని వేడుకున్నారు. గత నెల 18న 26 యేళ్ల కేతన్ అగర్వాల్‌ను లోహగడ్ కోటపై నుంచి తోసి హత్య చేసిన ఉదంతం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ దారుణానికి కేతన్ కాబోయే భార్య సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇది పక్కా ప్రణాళికతో జరిగిన హత్యగా నిర్ధారించిన పోలీసులు, నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ప్రధానమంత్రికి పంపిన ఈమెయిల్‌లో రాఖీ అగర్వాల్ తన మనోవేదనను పంచుకున్నారు. ప్రతి తల్లిలాగే, నా కుమారుడు వివాహం చేసుకుని మా కళ్ల ముందే సంతోషంగా జీవించాలని కలలు కన్నాను. కానీ, విధి వైపరీత్యం వల్ల నా బిడ్డకు నేనే అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఈ కేసులో మరో విషాదం కూడా చోటుచేసుకుంది. కేతన్ మరణాన్ని తట్టుకోలేక, సుమారు 20 రోజుల తర్వాత అతని తాత దేవీచంద్ అగర్వాల్ (71) గుండెపోటుతో మరణించారు. కేవలం కొద్ది రోజుల వ్యవధిలోనే మా కుటుంబం రెండు తరాలను కోల్పోయిందని రాఖీ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎలాంటి సానుభూతిని లేదా ప్రత్యేక సహాయాన్ని కోరడం లేదని స్పష్టం చేసిన రాఖీ, న్యాయం జరగడంలో జాప్యం జరిగే కొద్దీ తమ బాధ రెట్టింపు అవుతోందని పేర్కొన్నారు. దయచేసి కేతన్ కేసును మరో ఫైల్‌గా మిగిలిపోనివ్వకండి. నాకు అతనే సర్వస్వం. ఏదో ఒకరోజు నా కుమారుడి చిత్రపటం ముందు నిలబడి నీకున్యాయం జరిగిందని చెప్పాలనుకుంటున్నానని ఆమె తన లేఖను ముగించారు. గత వారం కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి, విచారణను వేగవంతం చేయాలని విన్నవించారు.

## 14 యేళ్లకు.. పగతీర్చుకున్న ఏనుగు!




### ఓ కుటుంబాన్ని అంతం చేసిన నేపాల్ 'ధ్రుబే'

**ఖాట్మండు,జులై 14:** నేపాల్‌కు చెందిన ఒక ఏనుగు పగబట్టి ఓ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. పగబట్టి వెంటాడింది. ఈ క్రమంలో 14 యేళ్ల క్రితమే ఇద్దరిని చంపేసింది. దాంతో భయపడిన ఆ కుటుంబం ఊరి వదిలిపోయి వేరే ఊళ్లో మకాం పెట్టింది. అయినా ఆ కుటుంబాన్ని పసిగట్టి మరో ఇద్దరిని చంపేసింది. దాంతో ఆ ఏనుగు దాడిలో ఒకే కుటుంబానికి చెందిన నాలుగు ప్రాణాలు గాల్లో కలిసిపోయినట్లు అయ్యింది. ఈ హృదయవిదారక ఘటన నేపాల్‌లో చోటుచేసుకుంది. నేపాల్‌లోని చిత్వాన్ నేషనల్ పార్క్ సమీపంలో నివసించే శనిచర బోటే కుటుంబానికి ధ్రుబే అనే ఏనుగు రూపంలో మృత్యువు వేటాడింది. 2012 డిసెంబర్‌లో మాడి అనే పట్టణంలో ధ్రుబే ఏనుగు దాడిచేసి శనిచర తల్లిదండ్రులు ప్రాణాలు కోల్పోయారు. ఈ భయంకరమైన ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన శనిచర తన కుటుంబాన్ని ఈ ప్రమాదం నుంచి కాపాడుకోవాలని నిర్ణయించుకున్నాడు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాప్తి నది దాటి దాదాపు 9 మైళ్ల దూరంలోని జగత్‌పూర్‌కు తన నివాసాన్ని మార్చాడు. ఇకతమకు ఆ ఏనుగు నుంచి ఎలాంటి ప్రమాదం ఉండదని భావించాడు. అయితే విధి వారిని వెక్కిరించింది. 14 యేళ్ల తర్వాత అదే ధ్రుబే ఏనుగువాసనతో పసిగట్టి వారిని వెతుక్కుంటూ వచ్చింది.

ఈ నెల ఆరంభంలో జగత్‌పూర్‌లోని శనిచర ఇంటిపై దాడిచేసి, అతని 25 ఏళ్ల కోడలు ఆషికాబోటేను, 4 ఏళ్ల మనవడు భరత్ బోటేను అతి కిరాతకంగా చంపేసింది. నదులుదాటి ఇంత దూరం వస్తే మమ్మల్ని ఏమీ చేయలేదని అనుకున్నాం. కానీ ఇన్ని సంవత్స రాల తర్వాత అదే ఏనుగు మమ్మల్ని వెతుక్కుంటూవచ్చి నా కోడలిని, మనవడిని బలిగొంది. ఇక పారిపోవడానికి చోటు కూడాలేదు అంటూ ఆయన కన్నీరు మున్నీరయ్యారు. ధ్రుబే ఏనుగు నేపాల్‌లో అత్యంత ప్రమాదకరమైనదిగా పేరుగాం చింది. 2010 నుంచి ఇప్పటివరకు ఈ ఒక్క ఏనుగే 25 మందిని చంపినట్లు చిత్వాన్ నేషనల్ పార్క్ అధికారులు ధ్రువీకరించారు.

# సంక్షిప్త వార్తలు

## అభా విమానాశ్రయంపై హూతీల దాడి



**రియాద్, జులై 14:** అమెరికా - ఇరాన్ ఉద్రిక్తతలు సరిపోన్నట్లు.. ఇప్పుడు సౌదీ అరేబియా-హూతీల మధ్య మరోసారి ఘర్షణలు చెలరేగాయి. సౌదీలోని అభా అంతర్జాతీయ విమానాశ్రయంపై హూతీ తిరుగు బాటుదారులు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డారు. ఇరాన్ నుంచి హూతీ ప్రతినిధుల బృందాన్ని తీసుకువస్తున్న విమానాన్ని అడ్డుకునేందుకు సోమవారం సౌదీ మద్దతున్న యెమెన్ ప్రభుత్వం సనా అంతర్జాతీయ విమానాశ్రయంలోని రన్‌వేపై బాంబు దాడి చేయడంతో ఈ ఘర్షణలు ప్రారంభమయ్యాయి. దాదాపు నాలుగేళ్లుగా సౌదీ అరేబియా, ఇరాన్ మద్దతు ఉన్న హూతీ మధ్య ఉన్న ప్రశాంతతకు ఈ దాడులతో బ్రేకులు పడినట్లయింది.

## మూడు లక్షలకుపైగా అమర్‌నాథ్‌ను సందర్శించిన భక్తులు



**శ్రీనగర్,జులై 14:** పవిత్ర అమర్‌నాథ్ యాత్ర అత్యంత భక్తి శ్రద్ధలతో విజయవంతంగా కొనసాగుతోంది. యాత్ర ప్రారంభమైన తొలి 11 రోజుల్లోనే దర్శించుకున్న భక్తుల సంఖ్య 2.75 లక్షలు దాటి మూడు లక్షలకు చేరువైంది. యాత్రికుల తాకిడి రోజురోజుకు క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో మంగళవారం అమర్‌నాథ్‌ను దర్శించుకున్న భక్తుల సంఖ్య మూడు లక్షలు దాటే అవకాశం ఉంది. మంగళవారం జమ్మూ నుంచి 5,335 మంది భక్తులతో కూడిన మరో బృందం కట్టుదిట్టమైన భద్రత మధ్య అమర్‌నాథ్‌కు బయలుదేరింది.

## భోజ్‌శాలలో శుక్రవారం ప్రార్థనలకు సుప్రీం అనుమతి

**న్యూఢిల్లీ, జులై 14:** మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాలలో ఉన్న వివాదాస్పద సరస్వతీ దేవి గుడి స్థలం వద్ద శుక్రవారం పూట ప్రార్థనలు జరుపుకునేందుకు ముస్లింలకు సుప్రీంకోర్టు తాత్కాలిక ఊరట కల్పించింది. వివాదాస్పద ప్రాంతానికి పక్కలో ముస్లింలకు కొంత స్థలాన్ని ప్రార్థనల కోసం కేటాయించాలని సుప్రీం తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఆ స్థలంలో శుక్రవారం మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల మధ్య ముస్లింలు నమాజ్ చేసుకోవాలని కోర్టు సూచించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది.

## అవినీతి నిరోధకశాఖ డైరెక్టర్ ఆకస్మిక బదిలీ



**చెన్నై,జులై 14:** తమిళనాడు రాష్ట్ర అవినీతి నిరోధక విభాగం డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐపిఎస్ అధికారి ఎ. అరుణ్‌ను నియమించిన రెండు నెలల్లోనే విజయ్ ప్రభుత్వం ఆ పోస్టు నుంచి బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ర్యాంక్ అధికారిణి సి.మహేశ్వరిని డివిఎసి పూర్తి స్థాయి అదనపు బాధ్యతలతో కొత్త చీఫ్‌గా నియమిస్తూ అడిషనల్ చీఫ్ సెక్రటరీ కె.మణివాసన్ తక్షణ ఉత్తర్వులు జారీ చేశారు. ఎడిజిపి ర్యాంక్ అధికారి అయిన అరుణ్‌ను చెన్నైలోని తమిళనాడు పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా పంపారు. ఈ యేడాది అసెంబ్లీ ఎన్నికల తర్వాత మే నెల చివరి వారంలో విజయ్ ప్రభుత్వం అరుణ్‌ను డివిఎసి చీఫ్‌గా నియమించింది.

## ప్రశాంత్ కిశోర్ ఆస్తులు రూ. 96 కోట్లు!

**బంకిపూర్,జులై 14:** బీహార్‌లోని బంకిపూర్ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. ఆయన మొత్తం ఆస్తుల విలువ రూ.96 కోట్లకు పైగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో రూ.22.19 కోట్ల విలువైన చరాస్తులు, రూ.73.87 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయని తెలిపారు. ఆయన భార్య జాహ్నవి దాస్ పేరిట రూ.89.51 కోట్ల చరాస్తులు, రూ.12.42 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడైంది. నామినేషన్ దాఖలు చేసే ముందు సోన్‌పూర్‌లోని బాబా హరిహర్‌నాథ్ ఆలయంలో ప్రశాంత్ కిశోర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

15-7Pg6exHMNWJQE_15-7Pg6exHMNWJQE.qxd 14/Jul/26 11:56 PM Page 1



# అమరావతితోనే వైసిపి అంతం

## మతిపోయి 'మావిగన్' అంటున్న జగన్

### రాష్ట్ర సామాజిక సంక్షేమబోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య



**విజయవాడ.జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా రాజధాని అమరా వతిపై విషప్రచారం చేసినంత కాలం వైసీపీ పార్టీకి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రాజకీయ మనుగడ ఉండదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాల కోటయ్య వ్యాఖ్యానించారు. మంగళవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడిని చెరలు పెట్టినట్లు, ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాజధానిని, రాజధాని రైతులను చెరలు పెట్టి, చెరశాలల పాలు చేసి, మళ్లీ ఏమీ ఎరుగని రీతిలో అమ రావతిలో రైతులకు అన్యాయం అంటూ విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 28,881 మంది రైతులు 34,348 ఎకరాలను ఇస్తే, రైతులను స్వార్థపరులని, ఒక సామాజిక వర్గం అని, ఎడారి అని, స్మశానం అని, వార్తలొస్తాయి అని తప్పుడు ప్రచారం చేసి, ఇప్పుడు ఏ రైతుల గూర్చి మాట్లాడతారు? అని ప్రశ్నించారు. గత పన్నెండేళ్ళుగా భూ సమీకరణకు సహకరించకుడా కోర్టులకు వెళ్ళిన కొద్దిపాటి రైతులను ఆసరా చేసుకొని మళ్ళీ అమరావతిపై కొత్త దాడి చేసేం దుకు కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. గత ఐదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ, అనారోగ్యంతో మృతి చెందిన గుంటక పద్మనాభ రెడ్డి మృతిని రాజధానిలో ఆగిన రైతు గుండెగా సొంత మీడియాలో బాకా ఊదటం పట్ల మండి పడ్డారు. రాజధాని పనుల వేగవంతం కోసమే, ప్రభుత్వం భూ సేకరణ నోటీఫికేషన్ ఇచ్చిందని, కోర్టులకు వెళ్ళిన రైతులు ప్రభుత్వానికి సహ కరించాలని కోరారు. భూములు ఇవ్వాల్సిన ఉండ వల్లి , నవులూరు గ్రామాలలోని కొద్దిమంది వైసీపీని నమ్ముకుంటే, కుక్క తోక పట్టుకొని గోదావరి ఈదినట్లే అన్నారు. రాజధానికి కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వటంతో మతిపోయి జగన్ మావి గన్ మాట ఎత్తుకున్నారని ఎద్దేవా చేశారు. చింత చచ్చినా పులుపు చావలేదు అన్నట్లు అమ రావతి చేతిలో ఓడి చతికిల పడినా జగన్‌కు జ్ఞానోదయం కాలేదని బాలకోటయ్య అభిప్రాయపడ్డారు.



## అధికారులు సమన్వయంతో పని చేయాలి: కలెక్టర్

**విజయనగరం,జులై 14 ప్రభాతవార్త:** రెవెన్యూ, పోలీసు మరియు ఇతర ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో, సమిష్టి బాధ్యతతో పని చేయడం వల్లే విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టరు అండ్ జిల్లా మేజిస్ట్రేట్ ఎస్.రామసుందర రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వ హించిన జిల్లా అర్ధ సంవత్సర నేర సమీక్షా సమా వేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌మాట్లాడుతూ, జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వ యంతో ఒకే తాటిపై పనిచేస్తున్నాయని అభినం దించారు. అధికారులు ఇదే స్ఫూర్తిని మున్ముందు కూడా కొనసాగిస్తూ, జిల్లాను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాఖపట్నం రేంజ్ ఐజిపి గోపినాధ్ జట్టి మాట్లాడుతూ రాబోయే 5 నుండి 10 ఏళ్లలో నేరాల సరళి పూర్తిగా మారిపోతుందని భవిష్య త్తులో 60 శాతం సైబర్, సోషల్ మీడియా నేరాలే ఉంటాయని హెచ్చరించారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎం.బబిత మాట్లాడుతూ, జిల్లాలో పోక్సో కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు సమర్థవంతంగా పని చేస్తున్నారన్నారు. ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, మాట్లాడుతూ గత ఆరు నెలల్లో జిల్లా పోలీసు శాఖ సాధించిన ప్రగతిని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే మహిళలపై దాడులు, గ్రేవ్ కేసులు మరియు రహదారి ప్రమాదాలు తగ్గాయన్నారు. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతూ రూ.3.50 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేశామని, నిందితులపై నిఘాకు 360డిగ్రీస్ యాప్, సిసి కెమెరాలు, డ్రోన్లను వాడుతున్నామని ఎస్పీ వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎక్సైజ్, రవాణ, ఆర్టీసి, మున్సిపాలిటీ, విద్యుత్, మహిళా శిశు సంక్షేమ శాఖ, మెడికల్ అండ్ హెల్త్ తదితర వివిధ శాఖల ముఖ్య అధికారులు, డిఎస్పీలు ఎస్.రాఘవులు, ఆర్.గోవిందరావు, పివివి నర్సింహారావు, ఎం.వీరకుమార్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, పలువురు ఇన్‌స్పెక్టర్లు మరియు ఎస్ఐలు పాల్గొన్నారు.




## వర్షిత సౌమ్య, విజయశ్రీలకు తృతీయ బహుమతి

**చీపురుపల్లి, జులై 14 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్ పురుషుల మరియు మహిళల ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపి యన్‌షిప్-2026 పోటీలలో చీపురుపల్లికి చెందిన టి.వర్షిత సౌమ్య 69 కేజీల విభాగంలోనూ, 63 కేజీల విభాగంలో కె.విజయశ్రీలు తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. ఈ నెల 11, 12 తేదీలలో గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొన్నారు. చీపురుపల్లికి చెందిన రిపెక్స్ ట్రిమ్ జిమ్ కోచ్ వైవి ప్రసాద్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్న వీరిద్దరూ రాష్ట్రస్థాయిలో రజిత పథకాలు సాధించడం పట్లపలువురు అభినందనలు తెలియజేశారు. రాష్ట్రస్థాయిలో చీపురుపల్లికి గుర్తింపు తీసు కువచ్చిన వీరిని పలువురు అభినందించారు.

# జగన్ విలువలతో కూడిన మాటలు మాట్లాడాలి : మంత్రి కొండపల్లి



**విజయనగరం, జులై 14 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి విలువలతో కూడిన మాటలు మాట్లాడాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూ లన, ప్రవా సాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ బోటు గల్లంతులో అదృశ్యమైన వారి కుటుంబ ాలను పరామర్శకు వచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేయటం జగన్ రెడ్డికే చెల్లుబాటు అయిం దన్నారు. జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారులు, వారి సమస్యలు ఏనాడు గుర్తుకు రాలేదని కేవలం రాజకీయ లబ్ధి కోసమే జగన్‌కు ఇప్పుడు మత్స్యకారులు గుర్తుకు రావడం సిగ్గుచేటని మంత్రి విమర్శించారు. అబద్ధాలు ఆడడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని బోటు గల్లంతైన విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు నాలుగు రోజులు పాటు హెలీకాప్టర్లు, మెరైన్ బోట్లతో సిబ్బంది విస్తృతమైన గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం మాటల రూపంలో కాకుండా చేతలతో బాధిత కుటుంబాలకు తక్షణమే రు.10లక్షలు అందించిందని.. అదే గత వైసీపీ ప్రభుత్వంలో ఎందరో బాధితులకు పరిహారం ప్రకటించి ఎగ్గొట్టిన ఘనత కూడా జగన్ రెడ్డికే దక్కుతుందని మంత్రి విమర్శించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగించడం హర్షణీయం

**విజయవాడ,జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును జులై 24 వరకు పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం పట్ల సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేస్తున్నది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేసారు.ఓటర్లకు తగిన అవగాహన లేకపోవడం, అవసరమైన పత్రాలు సమర్పించడానికి తగిన సమయం కావాలని, గడువు పొడిగించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ గతంలోనే ఎన్నికల సంఘాన్ని కోరింది. అందుకనుగుణంగా గడువు పొడిగించడం వలన ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించడానికి మరింత వీలు కలుగుతుందని సిపిఐ(యం) భావిస్తున్నది. ఇప్పటికీ లక్షల ఫారాలు తిరిగి రావాల్సి ఉన్నందున అవసరమైతే మరికొంత కాలం గడువు పొడిగించాలని కోరుతున్నది.

# పొగాకు రైతుకు అండెవరు?

### ధరలు పెంచుతామన్న ప్రభుత్వ హామీలు ఏమయ్యాయి

### స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధం

### డీసీపల్లి వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడిన విక్రమ్ రెడ్డి



డిసిపల్లి పొగాకు వేలం కేంద్రాని సందర్శించిన మాజీ శాసన సభ్యులు విక్రమ్ రెడ్డి

**మర్రిపాడు (నెల్లూరు), జులై 14, ప్రభాతవార్త :** రాష్ట్రంలో వర్జీనియా పొగాకు రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నా ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని, ముఖ్యమంత్రి ధరలు పెంచాలని, తిరస్కరణలు ఉండకూడదని ఆదేశించిన కొద్ది రోజులకే పరిస్థితి మరింత దిగజారడం ఆందోళన కలిగిస్తోందని ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం చెబుతున్న కనీస ధర రూ.200 కూడా రైతులకు అందని పరిస్థితి ఎందుకు వచ్చిందన్నారు. మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని మంగళవారం విక్రమ్‌రెడ్డి సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేలం కేంద్రంలో రైతులతో నేరుగా మాట్లాడి పొగాకు ధరలు పడిపోవడం, అధిక తిరస్కరణలు, కొనుగోళ్ల మందగమనంతో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అంతకు ముందుగా డీసీపల్లి వేలం కేంద్రం నిర్వహణాధికారి సునీల్ కుమార్‌తో వేలం ప్రక్రియ జరుగుతున్న విధానం, ధరల తగ్గుముఖం తదితర విషయాలపై చర్చించారు. పొగాకు రైతులను ఆదుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం తీసుకునేలా చూడాలంటూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే పొగాకు ఉత్పత్తిలో భారతదేశం రెండవ స్థానంలో ఉందని, అయినా దానిని పండించే రైతు మాత్రం నష్టాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారన్నారు. డీసీపల్లి వేలం కేంద్రంలో 100 రోజులు పూర్తయినా కేవలం 17% శాతం పొగాకు మాత్రమే కొనుగోలు చేయడం ఆందోళనకరమన్నారు. ఇంకా 83% శాతం పొగాకు రైతుల గోదాముల్లోనే ఉండిపోవడం చూస్తే కొనుగోలు ప్రక్రియ ఎంత మందగించిందో అర్థమవుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు నెలల్లో కేవలం 32 మిలియన్ కిలోల పొగాకు మాత్రమే కొనుగోలు చేస్తే మిగిలిన పంటను ఎప్పుడు కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. వేలం కేంద్రాల్లో 50 శాతానికి పైగా బేళ్లను నో బిడ్ పేరుతో తిరస్కరి స్తున్నారని, రైతు శ్రమకు తగిన విలువ ఎందుకు దక్కడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ఏడాది బ్రైట్ పొగాకుకు రూ.280 నుంచి రూ.360 వరకు ధర లభించగా, ప్రస్తుతం రూ.160 వరకు పడిపోవడం రైతులను తీవ్రంగా నష్టపరుస్తోం దన్నారు. ప్రస్తుతం బ్రైట్‌కు సగటున రూ.243, మీడియంకు రూ.216, లో గ్రేడ్‌కు రూ.187 మాత్రమే వస్తోందని, కనీసం బ్రైట్‌కు రూ.300, మీడియంకు రూ.280, లో గ్రేడ్‌కు రూ.250 ధర వస్తేనే రైతు గట్టెక్కే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.1,000 కోట్ల ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి ప్రభుత్వమే లేదా రైతుల సహకార సంఘాల ద్వారా నేరుగా పొగాకు కొనుగోలు చేయాలని విక్రమ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## 3గ్రీన్ ఫీల్డ్ పోర్టుల విస్తరణకు ఆమోదం: మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి



**సచివాలయం,జులై 14,ప్రభాతవార్త :** రాష్ట్రంలో తీరప్రాంతాభివృద్ధిలో భాగంగా భవిష్యత్ అవసరాలు,పోర్టుల విస్తరణను దృష్టిలో పెట్టుకొని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 3గ్రీన్ ఫీల్డ్ పోర్టుల అభివృద్ధికి ఫేజ్-2లో భాగంగా భూసేకరణకు ఆమోదం తెలిపినట్లు రాష్ట్ర పెట్టుబడులు,మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. రామాయపట్నం, మూలాపేట,మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టుల రెండో దశ విస్తరణకు మొత్తంగా 6,248.54ఎకరాల భూసేకరణకు దాదాపు రూ.1638.52కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు సచివాలయంలోని ఆర్ అండ్ బి,ఐ అండ్ ఐ శాఖ కార్యాలయంలో మంత్రి వెల్లడించారు. మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టు ఫేజ్-2 అభివృద్ధిలో భాగంగా 1420.70 ఎకరాల భూసేకరణకు దాదాపు రూ.347కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. మూలాపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు ఫేజ్-2 అభివృద్ధిలో భాగంగా 1903.39ఎకరాల భూసేకరణకు దాదాపు రూ.440.50 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు ఇచ్చామన్నారు. ఉప్పు భూములతో కలపి దాదాపుగా ఈ 1903ఎకరాల భూముల్లో భూసేకరణ చేయనున్నామన్నారు. అలాగే ఆర్ అండ్ ఆర్ కూడా ఇందులోనే చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. రామాయపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టు ఫేజ్ 2 అభివృద్ధిలో భాగంగా 2924.45 ఎకరాల భూసేకరణకు దాదాపు రూ.851కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు ఇచ్చామ న్నారు.

# ఎస్సీ వర్గీకరణ పేరుతో రాజకీయ కుట్ర

### నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ మాల మహానాడు అండ్ రాక్స్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్




**తిరుపతి హెల్త్, జులై 14, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల పై దేశవ్యాప్తంగా రాజకీయ కుట్ర జరుగుతున్నదని, దీనిని రద్దు చేయాలనినేషనల్ ప్రెసిడెంట్ ఫర్ మాల మహానాడు అండ్ రాజ్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్లో చట్టం చేసేంతవరకు నిరంతరం శాంతియుత పోరాటం కొనసాగుతుంది అన్నారు. ఎస్సీ వర్గీకరణను మొదటగా పంజాబ్, హర్యానాలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే, వర్గీకరణకు బీజం వేస్తే, దేశం మొత్తం చేసిన వ్యక్తి నరేంద్ర మోడీ జీ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వల్ల వంద మందిలో ఒకరికి లేదా ఇద్దరికి న్యాయం జరుగుతోంది, సమన్యాయం, సామాజిక న్యాయం పేరుతో దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారు మోడీ? అని ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు,రేవంత్ రెడ్డి ఎలా పంచుతారు? ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా? అన్నారు. సామాజిక న్యాయం దళితులకు ఇచ్చే రిజర్వేషన్లలో మాత్రమేనా! దేశ సంపదలో అక్కర్లేదా? మోడీ, చంద్రబాబు, రేవంత్ రెడ్డి, క్యాబినెట్లో మంత్రి పదవుల విషయంలో సామాజిక న్యాయం అక్కర్లేదా? మాల వర్గం పై కుట్ర చేస్తుంటే,ఎస్సీ వర్గీకరణ చట్టాలు దేనికి అని,ప్రజల తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందే! తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తా ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం దేనికని ప్రశ్నించారు. మాల నాయకులు రాజకీయ పార్టీలకు విశ్వాసంగా ఉన్నారే తప్ప, జాతి పట్ల విశ్వాసంగా లేరన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కులం తన ఉనికిని కోల్పోఇందిని, శాంతియుత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొప్పెరా చిన చెన్నయ్య, దాసరి చిన్న లింగామయ్య, మహేష్, గణేష్, నానీ, చిన్నా తదితరులు పాల్గొన్నారు.


# జిల్లా టిడిపి కార్యాలయానికి లీజుకు ప్రభుత్వ స్థలం కేటాయింపు

### ఆయిల్ ఫెడ్ స్థలాన్ని 66 యేళ్లకు రెండు ఎకరాలు కేటాయింపు

### ఎకరాకు యేడాదికి రూ.1000

### నారాయణపురం వద్ద నేషనల్ హైవేకు ఆనుకునే ప్రభుత్వ స్థలం కేటాయింపు



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Agricultural Marketing Department - Allotment of 2.00 Acres of APOILFED land located at Narayanapuram Village, Anantapuramu Urban, Ananthapuramu District on long lease basis for Construction of Telugu Desam Party District office - Orders - Issued.

AGRICULTURE & COOPERATION (MKTG.III) DEPARTMENT

G.O.Ms.No:38. Dated:14.07.2026. Read:

From the VC&MD, APOILFED, Vijayawada, Lr.No.APOILFED/PU/ATP/ADMN/2018-19/7232, dt:25.05.2026.

ORDER:

In the reference read above, the Vice Chairman & Managing Director, Andhra Pradesh Oilseeds Growers' Federation Ltd., (APOILFED), Vijayawada has requested the Government for appropriate orders on the request of the District Collector, Ananthapuramu, for allotment land in Sy.No.211-2A1 extent 0.81 Acres and Sy.No.211-1A2 extent 1.19 Acres, total 2.00 Acres at Narayanapuram Village, Anantapuramu Urban, Ananthapuramu District, which is under the disposal of APOILFED, on long lease basis for construction of Telugu Desam party District office.

2. The Government after careful examination, hereby issued orders for allotment of land at Sy.No.211-2A1 extent 0.81 Acres and Sy.No.211-1A2 extent 1.19 Acres, total 2.00 Acres of land at Narayanapuram Village, Anantapuramu Urban, Ananthapuramu District which is under the disposal of APOILFED, for construction of Telugu Desam party District office, on lease basis for a period of (66) years, on payment of lease rent of Rs.1,000/- per acre per annum as per G.O.Ms.No.340, Revenue (Assign-I) Department, dated:21.07.2016 read with G.O.Ms.No.282, Revenue(Lands-I) Department, dated:15.05.2026 subject to the following conditions in addition to the normal conditions under Board Standing Orders:-

**అనంతపురం, జులై 14 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా కేంద్రంలో జాతీయ రహదారిని ఆనుకుని నారాయణపురం వద్ద కోట్లు విలువ చేసే ఆయిల్ ఫెడ్ స్థలంలో రెండు ఎకరాలను టిడిపి కార్యాలయం నిర్మాణానికి 66 ఏళ్ల లీజ్‌కింద రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎకరాకు రూ.1000 లీజు ప్రకారం చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. జీఓ ఎంఎస్ నెంబర్ 38 కింద ఈ నెల 14వ తేదిన రాష్ట్ర ప్రభుత్వ ఎక్స్ అఫిస్కో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆయిల్ సీడ్స్ గ్రోహెడ్స్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఏపి ఆయిల్ ఫెడ్) కార్యాలయం అనంతపురంలో జాతీయ రహదారి పక్కన ఉంది. ఎన్నో ఏళ్ల ఆ కార్యాలయం తరుపున రైతులతో వేరుశనగ విత్తనాలు కొనుగోలు చేయడం, ఆయిల్ ఉత్పత్తి చేయడంలో గుర్తింపు వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయిల్ ఫెడ్‌కు మంచి గుర్తింపు ఉండేది. అయితే కాల క్రమేనా, ఆయిల్ ఫెడ్ వ్యవహార శైలి, సరిగా లేక పోవడం, అవినీతి అక్రమాలు ఎక్కువ కావడం తదితర కారణాల వల్ల ఆయిల్ ఫెడ్ కార్యాలయం కొన్నేళ్లుగా మూత పడిందని చెప్ప వచ్చు. గతంలో ఆయిల్ ఫెడ్ స్థలాలను అమ్మకాలు చేస్తారని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అనంతపురంలో ఆయిల్ ఫెడ్ స్థలంలో రెండు ఎకరాలను టీడీపీ జిల్లా కార్యాలయం కోసం దీర్ఘకాలిక లీజు కింద కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేయడం విశేషం. సర్వే నెంబర్ 211-2ఎ కింద 0.81 ఎకరాలు, సర్వే నెంబర్ 211-ఎ2 కింద 1.19 ఎకరాలు కలిపి రెండు ఎకరాలను అనంతపురం అర్బన్ లోని నారాయణ పురం గ్రామం వద్ద ఆయిల్ ఫెడ్ స్థలాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. జిల్లా టిడిపి కార్యాలయం నిర్మాణం కోసం 66 ఏళ్ల పాటు పర్మినెంట్ లీజు, ఎకరా రూ.1000 లీజుతో కేటాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2016 సంవత్సరం జులై 21వ తేదిన రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 340 ప్రకారం, 2026 సంవత్సరం మే 15వ తేదిన రెవెన్యూ శాఖ కింద జీఓ ఎంఎస్ నెంబర్ 282 ప్రకారం ఈ స్థలాన్ని లీజు కింద కేటాయించినట్లు జీవోలో పేర్కొన్నారు. కోట్లు విలువ చేసే స్థలాన్ని నగరం నడి బొడ్డున జాతీయ రహదారికి ఆనుకుని రెండు ఎకరాల స్థలాన్ని జిల్లా టిడిపి కార్యాలయానికి కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. ఇదే విధంగా రాష్ట్రంలో మరికొన్ని ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ స్థలాలను లీజు కింద టిడిపి కార్యాలయానికి యిచ్చినట్లు తెలియవచ్చింది. వైసిపి ప్రభుత్వంలో అక్కడక్కడ వైసిపి జిల్లాకార్యాలయాలకు కోట్లు విలువ చేసే స్థలాలను లీజు కింద యిచ్చింది.

అనంతపురం లోని హెచ్‌ఎల్‌సి కాలనీలో కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని లీజు కింద కేటాయించి వైసిపి జిల్లా కార్యాలయాన్ని నిర్మించారు. ఈ విధంగా ఎంతో విలువైన స్థలాలను పార్టీ కార్యాలయాలకు కేటాయిస్తూ పోవడం ఎంత వరకు సబబని జనం నుంచి ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

## భక్తులను మోసం చేసిన టిటిడి మాజీ ఉద్యోగి అరెస్ట్

**తిరుమల,జులై 14ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో శ్రీవారి దర్శనం ,వసతి కల్పిస్తానని భక్తులను నమ్మించి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్న తిరుపతికి చెందిన టిటిడి మాజీ ఉద్యోగి టి. అరుణ్ కుమార్‌ను టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు గతంలో టిటిడి ఉద్యోగం నుండి తొలగించబడి 2023లో కూడా ఇదే తరహా మోసాల కేసులో అరెస్టైనట్లు తేలింది. ఇటీవల బెంగళూరుకు చెందిన రెండు కుటుంబాల నుంచి శ్రీవాణి, తోమాల సేవ, సుప్రభాత సేవ, విఐపి దర్శనం, గెస్ట్ హౌస్‌పేరుతో 3.20 లక్షలు వసూలు చేసినట్లు గుర్తించారు. నిందితుడి బ్యాంకు ఖాతాల్లో గత ఏడాది కాలంలో సుమారు 85 లక్షల రూపాయలు లావాదేవీలు జరిగినట్లు గుర్తించి, మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అతని వద్ద నుండి మొబైల్ ఫోన్, 99వేల రూపాయలు నగదు, మూడు బ్యాంక్ పాస్‌బుక్స్ స్వాధీనం చేసుకున్నారు.



## రాయలసీమకు జగన్ చేసిందేమిటో చెప్పాలి

### టిడిపి ఎన్ఆర్ఐ వింగ్ వేణుగోపాల్‌రెడ్డి

**విజయవాడ, జులై 14, ప్రభాతవార్త :** రాయలసీమబిడ్డని అని చెప్పుకునే మాజీముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమలో ఏఅభివృద్ధి చేసారో చెప్పాలని టిడిపి ఎన్ఆర్ఐ వింగ్ కార్యనిర్వాహక కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తండ్రీకుమారులు ఇద్దరూ ముఖ్యమంత్రులుగా పనిచేసినా రాష్ట్రానికి, రాయలసీమకు చేసింది శూన్యమన్నారు. మూడుసార్లు స్టీల్‌ప్లాంట్‌కు శంఖుస్థాపన చేసినా ఒక్క ఇటుక కూడా పెట్టలేదని మండిపడ్డారు. సీమ బిడ్డలమని చెపుతూ ప్రకృతి వనరులను దోచుకున్నారని ఆరోపించారు. అన్నమయ్య ప్రాజెక్టును ఏంచేసారో రాష్ట్రమంతా చూసారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తుంటే జగన్ ఓర్చుకోలేక పోతున్నారని మండిపడ్డారు. ఇటీవల చంద్రబాబు స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ చేసారని 2028నాటికి స్టీల్‌ప్లాంట్ పూర్తిచేస్తామన్నారు. జమ్మలమడుగులో గ్రీన్‌సిమెంటు కర్మాగారాన్ని లోకేష్ ప్రారంభించబోతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 20లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషిచేస్తుంటే జగన్ ఆండ్‌కో రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు కుట్రలు పన్నటం దారుణమన్నారు. దేశానికి వచ్చే పెట్టుబడులలో మన రాష్ట్రానికి 25శాతం పెట్టుబడులు వస్తున్నాయని జగన్‌మోహన్‌రెడ్డి తన కుట్రలు, కుతంత్రాలు మానేసి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని, రాష్ట్రఅభివృద్ధి ఇష్టం లేకపోతే చూస్తూ కూర్చోవాలని హితవు పలికారు. జగన్ చేసే కుట్రలకు అడ్డుకట్టవేస్తామని వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు.

## ముద్రగడ పద్మనాభం మరణవార్త నన్ను తీవ్రంగా కలచివేసింది: వైఎస్ జగన్

**విజయవాడ.జులై 14,ప్రభాతవార్తప్రతినిధి:** పితృ సమానులైన ముద్రగడ పద్మనాభంమరణవార్త నన్ను తీవ్రంగా కలచివేసిందని వైసిపి నేత. మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి వ్యాఖ్యానించారు.,'ఎక్స్' వేదికగా ఆయన ముద్రగడ మృతికి సంతాపం ప్రకటించారు.ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన క్రమంగా కోలుకుంటున్నారనే వార్త మాకు ఎంతో ధైర్యాన్నిచ్చింది. సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి మన మధ్యకు వస్తారని ఆశిస్తున్న సమయంలోనే ఆయన ఇలా శాశ్వతంగా దూరం కావడం అత్యంత బాధాకరం. ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎంపీగా, మంత్రిగా, ఎమ్మెల్యేగా ప్రజలకు చిరస్మరణీయమైన సేవలందించిన ముద్రగడ విలువలకు కట్టుబడి రాజకీయాలు చేశారు. పదవులకన్నా ప్రజలనే గొప్పగా భావించారు. తనజీవితాంతం పేదలబతుకుల్లో మార్పు కోసం తపించారు. ముఖ్యంగా కాపుసామాజికవర్గానికి పెద్దదిక్కుగా నిలిచి,వారి సంక్షేమం కోసం అలుపెరగని పోరాటం చేశారు. తాను నమ్మిన మాటకు కట్టుబడి నిలబడేతత్వం, మంచికోసం ఎంతదూరమైనా వెళ్లే ధైర్యం ఆయన సొంతం. ఆత్మగౌరవానికి, నిజాయితీకి, వ్యక్తిత్వానికి ఆయన నిలువెత్తురూపం. ముద్రగడ మరణం ఆయన కుటుంబానికేకాదు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఆయనను అభిమానించే లక్ష లాది మందికి తీరనిలోటు.ఈ విషాద సమయంలో ఆయన కుటుంబసభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని,ముద్రగడ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానన్నారు.

## ఐదుగురికి అడిషనల్ డైరెక్టర్లుగా పదోన్నతులు

**విశాఖపట్నం, జులై 14, ప్రభాతవార్త:** రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ లో కీలక విభాగంగా ఉన్న టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న ఐదుగురు అధికారులకు అడిషనల్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ పట్టణ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఈనెల 10 తేదీన జీవో విడుదల చేశారు.డిటిసిపి ఆర్ విద్యుల్లత పదోన్నతి పొం దిన అధికారులకు ప్రొసీడింగ్, పోస్టు ఉత్తర్వుల ఆదేశాలను 13వ తేదీ పేరుతో విడుదల చేశారు. అయితే అడిషనల్ డైరెక్టర్ లు గా ఆరుగురు పేర్లు సిఫార్సు చేసినప్పటికీ రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌లో సిటీప్లానర్‌గా పనిచేస్తున్న మూ ర్తికి ప్రస్తుతానికి ఆమోదం లభించలేదు. అక్టోబర్ లో జీవీఎంసీ సిసిపిగా పనిచస్తున్న ఏ ప్రభాకర్ రావు పదవి విరమణ చేశాక మూర్తికి అడిషనల్ డైరెక్టర్ గా అవకాశం లభిస్తుందని తెలిసింది. ప్రస్తుతం సీనియర్ అడిషనల్ డైరెక్టర్ లు గా బి సురేష్ కుమార్, ఏ ప్రభాకర్ రావు, యస్ వరప్ర సాద్ , సునీతలు ఉన్నారు. వీరితోపాటు తాజాగా మరో ఐదు మందికి అడిషనల్ డైరెక్టర్ హోదా లభించింది. వీళ్లకు పనిచేస్తున్న చోటే పదోన్నతి కల్పించి పోస్టింగ్ లను కొనసాగించారు. వి మీనా కుమారి కి అడిషనల్ డైరెక్టర్ హోదా కల్పిస్తూ కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కూడా) చీఫ్ అర్బన్‌ప్లానర్ గానియమించారు. గుంటూరు మున్సిపల్ కార్పొరే షన్ సిటీ ప్లానర్‌గా పని చేస్తున్న డిరాంబాబుకు అక్కడే పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇచ్చారు. విజ యవాడ మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ సిటీ ప్లానర్ గా విధులు నిర్వహిస్తున్న కెసంజయ్ రత్నకుమార్‌కు పదోన్నతి కల్పించి అక్కడే కొనసాగించారు. బొబ్బి లి అర్బన్ డెవ లప్మెంట్ అథారిటీ (బడా) లో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా వి శిల్పాకు పదోన్నతి కల్పించి నియమించారు. హిమబిందుకు పదోన్నతి కల్పించి నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ గా నియమించారు.

## పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌సి సమావేశం

చిలకలూరిపేట, జూలై 14, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా అధ్యక్షతన నిర్వహించిన



దీఆర్‌సి సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావులు పాల్గొన్నారు. ఈ నెల 17న నరసరావుపేట కేంద్రంగా నిర్వహించనున్న భారీ రుణమేళా కార్యక్రమం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. రుణమేళాకు ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ హాజరుకానున్న నేపథ్యంలో సభా ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఇతర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.

## రాయన్నచౌదరి మృతికి సంతాపం

చిలకలూరిపేట, జూలై 14, ప్రభాతవార్త:చిలకలూరిపేట నియోజకవర్గం, నాదెండ్ల మండలం, చిరుమామిళ్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోయ రాయన్న చౌదరి మంగళవారం ఉదయం స్వర్గస్తులైనారు. ఈ విషయం తెలుసుకొని చిరుమామిళ్ల గ్రామంలోని వారి స్వగృహం వద్ద ఉంచిన పార్థివదేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పరామర్శించారు.



## వాలీబాల్ క్రీడాకారునికి ఆర్థికసాయం

చిలకలూరిపేట, జూలై 14, ప్రభాతవార్త: చైనాలో జరగనున్న అంతర్జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడికి రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట నుంచి రూ.50,000 ఆర్థిక సహాయం



చిలకలూరిపేట, జూలై 12: రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో చైనాలో ఈ నెల 15వ తేదీ నుండి జరగనున్న అంతర్జాతీయ వాలీబాల్ లీగ్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించనున్న పల్నాడు జిల్లా, మైదవోలు గ్రామానికి చెందిన అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు నక్క శ్రీనివాసరావు గారికి ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ.50,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ విరాళాన్ని రోటరీ సభ్యులు రొటేరియన్ మిన్నెకంటి రవీంద్రబాబు గారు మరియు రొటేరియన్ ముత్తవరపు సురేష్ గారు సంయుక్తంగా అందించడం విశేషం. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు రొటేరియన్ బోడి రామసుబ్బారావు గారు నక్క శ్రీనివాసరావుకు నగదు అందజేసి, అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి, తెలుగు రాష్ట్రాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రోటరీ సభ్యులందరూ నక్క శ్రీనివాసరావు గారికి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, చైనా పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి రొటేరియన్ మానవ శ్రీనివాసరావు, పూర్వాధ్యక్షులు రొటేరియన్ జాషువా రంగారావు, రొటేరియన్ అన్నిరత్నం ప్రభాకర్ తదితర రోటరీ సభ్యులు పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులను ప్రోత్సహించడం రోటరీ సంస్థ సామాజిక బాధ్యతలో భాగమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని రోటరీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

## ఉచిత రక్తహీనత నిర్ధారణ శిబిరం

చిలకలూరిపేట, జూలై 14, ప్రభాతవార్త: మహిళలు, గర్భిణులు ,బాలికలు, వృద్ధులు, తరచూ అలసట చెందేవారు మరియు గుండె దడ గలవారు తప్పనిసరిగా రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్ సూచనల ప్రకారం మందులు వాడాలని చిలకలూరిపేట ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు తోటకూర రామసీత అన్నారు. స్థానిక సుబ్బయ్య తోటలోని డాక్టర్ ఉమాస్ హోమియో హాస్పిటల్ లో నాడు ఉచిత రక్తహీనత నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంలో



ఇన్నర్ వీల్ సభ్యురాలైన డాక్టర్ ఉమాదేవి సిద్ధ బత్తిన మాట్లాడుతూ ప్రజలు రక్తహీనతను గుర్తించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఏ ఎం జి ఎదురుగా డాక్టర్ విజయ కంటి హాస్పిటల్ లో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు . సభ్యురాలు నాగమణి సోదరి అయిన డాక్టర్ విజయ మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అంటూ కంటి విషయంలో ఎటువంటి శ్రద్ధ తీసుకోవాలో వివరించారు . ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు తోటకూర రామ సీత మాజీ అధ్యక్షురాలు నార్నే జయలక్ష్మి, కోశాధికారి తియ్యగోర రమాదేవి సభ్యులు డాక్టర్ ఉమ, డాక్టర్ విజయ, నాగమణి, సుగుణ, వైశాలి మొదలైన వారు పాల్గొన్నారు

## కాకుమాను వెంకట్‌కు రాష్ట్రస్థాయి పదవి



చిలకలూరిపేట, జూలై 14, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు కాకుమాను వెంకట్ గారు ఖీకన్జ్యూమర్ ఎఫైర్స్, ఫుడ్ అండ్ సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్‌ఖీ (వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ) రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియమితులైన అనంతరం మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారిని వారి నివాసం నందు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు,

## నూతన ప్రారంభం

చిలకలూరిపేట, జూలై 14, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని, నరసరావుపేట రోడ్డు నందు గల, గంగమ్మ తల్లి గుడి దగ్గర, పట్టణంలోని 24వ వార్డ్ కి చెందిన తెలుగుదేశం పార్టీ యాక్టివిస్ట్ పులికొండ ప్రేమ సాయి నూతన పిఎస్ఇవి మోటార్స్ సేల్స్ సర్వీస్ షోరూంను ప్రారంభించారు. శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు.



## రామ్‌చలపతికి భాజపా నేతల సత్కారం

చిలకలూరిపేట, జూలై 14, ప్రభాతవార్త: చిలకలూరిపేట భారతీయ జనతా పార్టీ ఆఫీస్ నందు నూతనంగా బిజెపి ఓబీసీ జిల్లా సెక్రటరీగా మరియు చిలకలూరిపేట ఓబిసి ఇన్చార్జిగా నియమింపబడిన



రామ్ చలపతి కుమార్‌ను భారతీయ జనతా పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఘనంగా ఆయనను సత్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మరియు చిలకలూరిపేట నియోజకవర్గంలో ఓ బి సి బలోపేతానికి తన వంతు తగినంత కృషి చేస్తానని తెలియజేశారు ముఖ్య నాయకులు రాష్ట్ర ఓబిసి మాజీ ఉపాధ్యక్షులు రాష్ట్ర నాయకులు అన్నం శ్రీనివాసరావు జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల శివ నాగేశ్వరరావు పట్టణ అధ్యక్షులు కోట పవన్ కుమార్ గాంధీ జిల్లా యువ మోర్చా అధ్యక్షులు పులుగుజ్జు మహేష్ పట్టణ ప్రధాన కార్యదర్శి కుప్పం కళ్యాణదుర్గారావు ఆఫీస్ సెక్రటరీ గుమ్మ బాలకృష్ణ మైనార్టీ మోర్చా చిలకలూరిపేట నాయకులు పోతవరం సుభాని మరియు ముఖ్య నాయకులు ఫణి ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయనకు అభినందనలు తెలియజేశారు

## 20న అమరవీరుడు సీఆర్ మోహన్ వర్ధంతి :హాజరుకానున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

చిలకలూరిపేట, జూలై 14, ప్రభాతవార్త: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కళాకారుడు సీఆర్ మోహన్‌రావు వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 20వ తేదీ నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ చెప్పారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరవీరుడు, కార్మిక ఉద్యమాల నిర్మాత సీఆర్ మోహన్‌రావు వర్ధంతి కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలి అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి ఎ మారుతీ వరప్రసాద్ తో పాటు రాష్ట్ర,జిల్లా నాయకులు తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ నెల 20న జరిగే సీఆర్ మోహనరావు సంస్మరణ సభకు ఆయన అభిమానులు, సానుభూతి పరులు, వివిధ విభాగాల్లో ఉన్న పార్టీ నాయకులు హాజరుకావాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో తిన్రీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ సుభాని,సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి బొంత ధనరాజు, పట్టణ కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, తిగిగేది ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు,వేలూరు గ్రామ సిపిఐ కార్యదర్శి ఏలిక శ్రీనివాసరావు, తిన్రీ నియోజకవర్గ కార్యదర్శి కే మల్లికార్జున్, బొంత నాసర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేచే నూతన ప్రారంభం



చిలకలూరిపేట, జూలై 14, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణం, చౌత్ర సెంటర్ నందు, పట్టణానికి చెందిన షేక్ రిజ్వాన్ నూతన కిచెన్ షోరూం పీజీయాన్ కిచెన్ అప్లయన్సెస్ ను శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మర్రి రాజశేఖర్‌ను కలిసిన కాకుమాను వెంకట్

చిలకలూరిపేట, జూలై 14, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణ సీనియర్ జర్నలిస్ట్, జనసేన పార్టీ నాయకులు కాకుమాను వెంకట్ కన్జ్యూమర్ ఎఫైర్స్, ఫుడ్ అండ్ సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా, మర్యాదపూర్వకంగా శాసనమండలి సభ్యులు



మర్రి రాజశేఖర్‌ను కలిశారు.ఈ సందర్భంగా కాకుమాను వెంకట్ గారిని హృదయపూర్వకంగా అభినందించి, శాలువాతో సత్కరించి వారి కొత్త బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ప్రభుత్వానికి, పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్. ఈ కార్యక్రమంలో వారితో సయ్యద్ హిదాయతుల్లా గారు,జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ మునీర్ హసన్ .జనసేన పార్టీ నాయకులు కోట సాంబ . గోలి నర్సింహారావు .తదితరులున్నారు

## హెచ్‌ఆర్‌సీఐ అధ్యక్షునిగా మణి

గురజాల, జూలై 14 ప్రభాతవార్త : హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్‌ఆర్‌సీఐ) మండల



అధ్యక్షునిగా పసుమర్తి నాగమణికంఠేశ్వరరావు (మణి) నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సామాజిక న్యాయం అందించాలనే ఉద్దేశ్యంతో ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఫౌండర్, చైర్మన్ చెన్నుపాటి శ్రీకాంత్ సారథ్యంలో సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు శ్రీకాంత్, రాష్ట్ర అధ్యక్షుడు దాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ముమ్మరంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం

మాచర్ల టౌన్..జూలై 14, ప్రభాతవార్త : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 101మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిని ఎన్నికల అధికారులు వెల్లడించారు. జూన్ నెల 15 నుంచి ప్రారంభమైన ఇంటింటి ధృవీకరణ కార్యక్రమాన్ని బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ముమ్మరంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నాటికి నియోజకవర్గంలోని మొత్తం 2,62,801 మంది ఓటర్లను బీఎల్‌వోలు 100 శాతం సందర్శించగా, వారిలో 2,36,302 మంది ఓటర్ల ధృవీకరణ పూర్తయింది. దీంతో మొత్తం ధృవీకరణ శాతం 89.92కు చేరుకుంది.మండలాల వారీగా పరిశీలిస్తే మాచర్ల గ్రామీణంలో 89.99 శాతం,మాచర్ల అర్బన్‌లో 84.29 శాతం, వెల్దుర్తిలో 91.50 శాతం,దుర్గిలో 92.62 శాతం, రెంటచింతలలో 90.50 శాతం, కారంపూడిలో 91.12 శాతం ధృవీకరణ పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు.ఇంకా మిగిలిన ఓటర్లను కూడా త్వరితగతిన కలుసుకుని ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని బీఎల్‌వోలకు అధికారులు సూచించారు. ప్రజలు ఇంటింటి ధృవీకరణ కార్యక్రమానికి సహకరించి అవసరమైన వివరాలను అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ వివరాలను 101మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి,పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆలయాల పునరుద్ధరణతోనే సనాతన ధర్మ రక్షణ : ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



వెల్దుర్తి, జూలై 14, ప్రభాతవార్త :వెల్దుర్తి, జూలై 14: ప్రాచీన ఆలయాల పునరుద్ధరణ ద్వారానే సనాతన ధర్మం వర్ధిల్లుతుందని మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. వెల్దుర్తి మండల పరిధిలోని రామచంద్రాపురం తండా గ్రామంలో వెలసిన శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి వారి



దేవస్థాన పునర్నిర్మాణ పనులకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై, శాస్త్రోక్తంగా భూమిపూజ మరియు శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కి చెందిన శ్రీవాణి ట్రస్ట్ నుండి మంజూరైన రూ.40 లక్షల నిధులతో ఈ ఆలయాన్ని పునర్నిర్మించ నున్నారు.

**బ్రహ్మాండమైన స్వాగతం.. గిరిజన నృత్యాల కోలాహలం**

ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి గిరిజనులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేకంగా బంజారా సంప్రదాయ వస్త్రధారణ ధరించిన ఎమ్మెల్యే అందరినీ ఆకట్టుకున్నారు. మహిళలు మంగళ హారతులతో ఎదురేగగా, గిరిజన యువకులు ఎమ్మెల్యేను తమ భుజాలపై ఎత్తుకుని ఆనందోత్సాహాల మధ్య పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. సాంప్రదాయ గిరిజన నృత్యాలు, డప్పు వాయిద్యాల మోతతో తండా పరిసరాలు మారుమోగాయి. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మధు, టిడీపీ రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి, మాచర్ల నియోజకవర్గ ఎస్.టి సెల్ అధ్యక్షుడు మూడవత్ వజ్రం నాయక్, జగన్ నాయక్, తులసీ నాయక్, బాలు నాయక్, రమావత్ శంకర్ నాయక్ గురుస్వామిలతో పాటు పెద్ద సంఖ్యలో గిరిజన ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## మందా డేవిడ్ కుటుంబానికి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరామర్శ

మాచర్ల టౌన్, జూలై14, ప్రభాతవార్త: మాచర్ల నియోజకవర్గం, మాచర్ల పట్టణం 8వ వార్డుకు చెందిన మందా డేవిడ్ అనారోగ్యంతో మృతి చెందడంతో, పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మందా డేవిడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి,ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.అనంతరం మృతుడి భార్య నాగరత్నమ్మకు వ్యక్తిగతంగా రూ.5,000 ఆర్థిక సహాయం అందజేసి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన బ్రహ్మయ్యను పరామర్శించిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల టౌన్, జూలై14, ప్రభాతవార్త: మాచర్ల నియోజకవర్గంలోని మాచర్ల పట్టణం 9వ వార్డుకు చెందిన దేరంగుల బ్రహ్మయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలుకు గాయమై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారని తెలుసుకున్న పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గారు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా బ్రహ్మయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని,మెరుగైన వైద్యం తీసుకోవాలని సూచించారు.త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. కుటుంబ



సభ్యులతో మాట్లాడి వారికి మనోధైర్యం కల్పించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## నిదానంపాటి అమ్మవారిని దర్శించుకున్న దొంగరి వెంకటేశ్వర్లు

దుర్గి ,జులై 14, ప్రభాతవార్త: దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలోని నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు మంగళవారం



దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల మధ్య ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు ఇచ్చారు. అనంతరం ఆలయ విశిష్టత, అమ్మవారి మహిమ గురించి అర్చకులు వివరించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు దొంగరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు తెలుగుదేశం పార్టీ నాయకుడు దేవరగట్టు బ్రహ్మయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని పూజలు

దుర్గి ,జూలై ,14,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని కోరుతూ దుర్గి గ్రామ ఆంజనేయస్వామి దేవాలయంలో



జనసేన నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు .మాచర్ల నియోజకవర్గ బసా రామాంజనేయులు సూచనల మేరకు, దుర్గి గ్రామ అధ్యక్షుడు రుద్రాల రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన, కూటమి నాయకులు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించి పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలం, దీర్ఘాయుష్షు కలిగి ఉండాలని పూజలు నిర్వహించారు .పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలోకి రావాలని జనసైనికులు ఆకాంక్షించారు.

## జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందించిన మాజీ ఎమ్మెల్యే కాసు

నరసరావుపేట, జూలై 14 ప్రభాతవార్త: ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా వైసీపీకి సానుభూతిపరుల ఓటర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయా అని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ గురజాల నియోజకవర్గంలో శనివారం వరకు ఖీసర్‌ఖీ ప్రక్రియ సజావుగానే సాగిందని ఐతే, పిడుగురాళ్ల మండలంలో ముఖ్యంగా కరాలపాడు, పోనంకి గ్రామాలలో ఎమ్మార్వో ఆదేశాల మేరకు బిఎల్వో లు ఓట్లను ఎన్యూమరైట్ చేసి డిజిటలైజేషన్ చేయటం ఆపేశారన్నారు. ఈ విషయం పిడుగురాళ్ల మండలంలో అందరికీ తెలిసిందన్నారు. ఈనెల 14 తేదీ సాయంత్రం వరకు సర్ ప్రక్రియ కొనసాగించాల్సి ఉండగా, మూడు



రోజులు ముందుగానే ఆపటం అనేది రాజకీయంగా అనేక పుకార్లకు తావిస్తుందని పేర్కొన్నారు. ఈ విషయమై కాసు మహేష్ రెడ్డి జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ స్పందించి, గురజాల ఆర్డీవో, ఎమ్మార్వోలని పిలిచి అడుగగా, ఈ విషయం తమ దృష్టికి రాలేదని వారు చెప్పారన్నారు. బిఎల్ఓలను పిలిచి మాట్లాడి ఈ నెల 14 వరకు సర్ ప్రక్రియ జరిగేలా చేస్తామని, అలాగే డిఎల్ఓలు ఎక్కడైనా అవకతవకలు పాల్పడితే ఎత్తి పరిస్థితిలో వదిలే ప్రసక్తే లేదని జిల్లా కలెక్టర్ చెప్పారన్నారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## ఏపీఓఎస్ఎస్ అడ్మిషన్స్ పోస్టర్ ను ఆవిష్కరించిన కలెక్టర్

రొంపిచర్ల,జూలై 14 ప్రభాతవార్త : నరసరావుపేట లో ఏ పీ ఓ ఎస్ ఎస్ 2026. 27 అడ్మిషన్స్ పోస్టర్ ను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా ఆవిష్కరించారు., పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి రామ రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. , పల్నాడు జిల్లా ఉన్నతాధికారులు . ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ బొనిగల



హైమారావు, పల్నాడు జిల్లా ఏ ఎం ఓ పూర్ణ చంద్ర రావు,పల్నాడు జిల్లా ।నిళిశి కో ఆర్డినేటర్ సెల్వరాజ్ పల్నాడు జిల్లా ఎ.ఐ కో ఆర్డినేటర్ లు పాల్గొన్నారు. అనంతరం పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి అధ్యక్షతన పల్నాడు జిల్లాలోని ఓపెన్ స్కూల్ సొసైటీ తి। సెంటర్ ల ప్రిన్సిపాల్స్ మరియు ప్రధానోపాధ్యాయులుకు ఓరియెంటేషన్ తరగతులు నిర్వహించారు. నరసరావుపేటలోని కొత్త రఘురామయ్య జూనియర్ కళాశాలలో జరిగినది. జిల్లా విద్యా శాఖ అధికారి పివిజె రామరావు మాట్లాడుతూ 2026.27 సంవత్సరం 10 వ తరగతి మరియు ఇంటర్మీడియట్ చదవడానికి ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా చదవడానికి ఇది సువర్ణ అవకాశం అన్నారు., జూలై 31 వ తేదీ లోపు అడ్మిషన్ పొందడానికి ఆఖరు తేదీ అని, ఆర్థిక పరిస్థితులతో చదువు మధ్యలో మానివేసిన విద్యార్థులు అడ్మిషన్స్ పొందవచ్చని తెలిపారు.

## డ్రగ్ స్మగ్లర్ల పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
### ప్రజా సంఘాల డిమాండ్

నరసరావుపేట క్రైమ్, జూలై 14 ప్రభాతవార్త: పల్నాడు జిల్లావ్యాప్తంగా యువతను మత్తుకు బానిసలు చేస్తున్న గంజాయి, డ్రగ్స్ స్మగ్లర్ల పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పిడిఎం నాయకులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఎత్తున స్కూళ్లు, కాలేజీలు, నరసరావుపేట పట్టణంలోని బరంపేట, ఇస్లాంపేట, రామిరెడ్డి పేట, ఎస్ఆర్కేటి తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున గంజాయి స్మగ్లింగ్ జరుగుతుందన్నారు. యువత ఈ గంజాయికి అలవాటుపడి రాత్రి సమయాల్లో పట్టణంలోని వివిధ ప్రాంతంలో గంజాయి సేవించి మత్తులో తల్వార్లతో వీరంగం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అనేక విద్యాసంస్థల్లో విద్యార్థులు గంజాయి సేవిస్తున్నారని, దీనివలన భావిభారత దేశానికి వెన్నెముక అయిన యువత నిర్వీర్యం అయిపోతుందని, చైతన్యం లేని మూర్ఖత్వపు సైన్యం ఏర్పడే ప్రమాదం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికార యంత్రాంగం కేవలం ప్రచారాలకే పరిమితం కాకుండా, ఎక్కడైతే గంజాయి డ్రగ్స్, మాదకద్రవ్యాలు స్మగ్లింగ్ జరుగుతుందో ఆయా ప్రాంతాలపై సోదాలు నిర్వహించి స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిడిఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ అక్రమ గంజాయి వ్యాపారంపై జోక్యం చేసుకొని యువతను కాపాడాలని అన్నారు. పిడిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ మాట్లాడుతూ గంజాయి డ్రగ్స్ వివిధ రకాల మత్తు పదార్థాలకు యువత బానిసలు కావద్దని సూచించారు. దాని వలన విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారుతుందని, కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. కోట నాయక్, షేక్. షరీఫ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దస్తావేజు లేఖర్లు నిరసన

గురజాల, జూలై 14 ప్రభాతవార్త : గురజాలలో దస్తావేజు లేఖర్లు మంగళవారం పెన్‌డౌన్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 396 రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సేవలు, కక్షిదారుల సొంత వ్యవహారమైన దస్తావేజుల తయారీ విధానం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తారన్నారు.



అనంతరం కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన జరిపారు. పెన్‌డౌన్‌తో కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ చిట్టెమ్మకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు, గుమస్తాలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్యే కాసు కృతజ్ఞతలు

గురజాల, జూలై 14 ప్రభాతవార్త : గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో పోటు వెంకటరెడ్డి ద్వితీయ వర్ధంతిని మంగళవారం కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహం, సమాధి వద్ద మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో రాజకీయంగా, వ్యాపారకంగా గుర్తింపు పొందిన వెంకటరెడ్డి మనమధ్య లేకపోయినా ఆయన జ్ఞాపకాలు పదిలంగా ఉన్నాయన్నారు. 2019లో మోహన్‌రెడ్డి నాజకత్వంలో నియోజకవర్గంలో సామాజిక దేవాలయాన్ని ప్రారంభించి



పల్నాడు ప్రాంతంలో చిరకాల కోరిక అయిన హాస్పిటల్‌ను పిడుగురాళ్ల ప్రాంతానికి తీసుకొచ్చారన్నారు. 2024కు అన్ని పనులు పూర్తయి సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం వలన హాస్పిటల్‌ను రెండు నెలల క్రితం ఓపెన్ చేశారన్నారు. అది కూడా చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలంటే సరైంది కాదని, ప్రతిపక్షంగా మేము పోరాడడం వలన టెండరున్న పాడుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదని, అలాగే పిడుగురాళ్ల పట్టణంలోని మెడికల్ కళాశాలను సెల్ఫీ ఛాలెంజ్ పెట్టి ప్రభుత్వాన్ని ఎండకడితే పనులు పూర్తి చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం 100



మెడికల్ కేటాయించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీధరరెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ పోలు పవన్మయి వీరారెడ్డి, కర్రా కోటేశ్వరరావు, వైసీపీ మండల అధ్యక్షుడు కొమ్మినేని బుజ్జి, బీసీ నేత గాంధీ, ఎంపీపీ చలమయ్య, అమరారెడ్డి, కోలా సతీష్, జక్కా సత్యం, మినుముల ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15-07pg10_15-07pg10.qxd 14/Jul/26 11:52 PM Page 1





# సెమీస్‌లో సూపర్ క్లాష్

## అర్జెంటీనా, ఇంగ్లాండ్ అమీతుమీ * నేటి అర్ధరాత్రి 12.30 గంటలకు

**అట్లాంటా, జులై 14:** ఫుట్‌బాల్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫిఫా ప్రపంచకప్ సెమీఫైనల్లో అర్జెంటీనా-ఇంగ్లండ్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి తర్వాత మ్యాచ్ ప్రారంభమవుతుంది. చరిత్ర, ప్రతిష్ఠ, భావోద్వేగాలు, స్టార్ ఆటగాళ్ల పోరు... ఇలా అన్నీ కలిసిన ఈ మ్యాచ్‌ను టోర్నీలోనే అత్యంత ఉత్కంఠభరిత సమరంగా మారింది. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా మరోసారి ప్రపంచకప్ ఫైనల్ చేరి వరుసగా టైటిల్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా, దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత ప్రపంచకప్ గెలవాలన్న కలతో ఇంగ్లండ్ బరిలోకి దిగుతోంది. ప్రపంచ ఫుట్ బాల్ చరిత్రలో అత్యంత ఉద్విగ్నమైన ప్రత్యర్థులుగా పేరొందిన ఈ రెండు జట్లు మరోసారి ప్రపంచకప్ వేదికపై తలపడుతుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విజేత నేరుగా ఫైనల్‌కు చేరుకోనుండగా, ఓడిన జట్టు మూడో స్థానం కోసం పోరాడాల్సి ఉంటుంది.

### మెస్సీపైనే అర్జెంటీనా ఆశలు

అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ మరోసారి జట్టుకు ప్రధాన బలంగా నిలుస్తున్నాడు. టోర్నీ మొత్తం అతని అనుభవం, నాయకత్వం, కీలక సమయాల్లో గోల్స్ సృష్టించే సామర్థ్యం అర్జెంటీనాను సెమీస్ వరకు తీసుకొచ్చాయి. పాసింగ్, దాడుల్లో వేగం, రక్షణలో క్రమశిక్షణ జట్టుకు ప్రధాన బలాలు. క్వార్టర్ ఫైనల్లో స్విట్జర్లాండ్‌పై సాధించిన విజయంతో అర్జెంటీనా పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ప్రత్యర్థి బలమైన ఇంగ్లండ్ అయినప్పటికీ, పెద్ద మ్యాచ్‌లలో ఒత్తిడిని జయించే అనుభవం తమకు కలిసివస్తుందని అర్జెంటీనా భావిస్తోంది. కోచ్ లియోనెల్ స్కలోనీ వ్యూహాలు కూడా జట్టుకు బలంగా మారాయి.

### బెల్లింగ్‌హామ్, కేన్‌లపై ధీమా

ఇంగ్లండ్ జట్టు యువ ఆటగాళ్లు, అనుభవజ్ఞుల సమన్వయంతో బలంగా కనిపిస్తోంది. కెప్టెన్ హ్యారీ కేన్ గోల్స్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుండగా, జూడ్ బెల్లింగ్‌హామ్ మిడ్ ఫీల్డ్‌లో జట్టుకు వెన్నెముకలా నిలుస్తున్నాడు. వేగవంతమైన కౌంటర్ అటాక్స్, సెట్‌పీస్‌లలో ఇంగ్లండ్ ప్రమాదకరంగా మారుతోంది. క్వార్టర్ ఫైనల్లో నార్వేపై సాధించిన విజయం జట్టులో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. కోచ్ రూపొందించిన వ్యూహాలను ఆటగాళ్లు సమర్థంగా అమలు చేస్తుండటంతో టైటిల్‌పై ఆశలు పెరిగాయి. ఇంగ్లండ్ జట్టు యువ స్టార్ జూడ్ బెల్లింగ్‌హామ్ అద్భుత ఫామ్‌లో ఉండగా, కెప్టెన్ హ్యారీ కేన్ అనుభవం జట్టుకు ప్రధాన బలంగా నిలుస్తోంది.

### హ్యాండ్ ఆఫ్ గాడ్

అర్జెంటీనా-ఇంగ్లండ్ పోరుకు దశాబ్దాల చరిత్ర ఉంది. 1966 ప్రపంచకప్ వివాదాల నుంచి 1986లో మారడోనా చేసిన "హ్యాండ్ ఆఫ్ గాడ్" గోల్, అదే మ్యాచ్‌లో చేసిన అద్భుత సోలో గోల్, ఆ తర్వాతి ప్రపంచకప్ పోటీలు ఈ ప్రత్యర్థిత్వాన్ని మరింతగా పెంచాయి. ఈ సెమీఫైనల్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. అర్జెంటీనా బంతిని ఎక్కువ సేపు తమ ఆధీనంలో ఉంచి అవకాశాలను సృష్టించడంలో నైపుణ్యం కలిగి ఉంది. మరోవైపు ఇంగ్లండ్ వేగవంతమైన దాడులు, ఎత్తైన క్రాస్‌లు, శారీరక దృఢత్వంతో ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టగలదు. మిడ్ ఫీల్డ్‌లో ఆధిపత్యం సాధించే జట్టే మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

అర్జెంటీనాకు అనుభవం, మెస్సీ నాయకత్వం ప్రధాన బలం కాగా, ఇంగ్లండ్‌కు యువ శక్తి, వేగవంతమైన ఆట, సమిష్టి ప్రదర్శన బలంగా ఉన్నాయి. చిన్న పొరపాటు కూడా మ్యాచ్ గమనాన్ని మార్చే అవకాశం ఉండటంతో అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మెస్సీ-బెల్లింగ్‌హామ్, మెస్సీ-కేన్ వంటి స్టార్ ఆటగాళ్ల మధ్య పోటీ ఈ మ్యాచ్‌కు మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. యంగ్ గన్స్ తమ ఛాన్స్ కోసం చూస్తున్నారు.

### హెడ్ టు హెడ్

| అంశం | అర్జెంటీనా | ఇంగ్లండ్ |
|---|---|---|
| ప్రపంచకప్ | 3 | 1 |
| బలం | బంతిపై ఆధిపత్యం | కౌంటర్స్ |
| స్టార్స్ | మెస్సీ | హ్యారీ కేన్ |
| యంగ్‌గన్స్ | ఎంజో | బెల్లింగ్‌హామ్ |


## శుభ్‌మన్ గిల్ కెప్టెన్ ఇన్నింగ్

# తొలి వన్డేలో గ్రాండ్ విక్టరీ

**బర్మింగ్హామ్, జులై 14:** ఇంగ్లాండ్ గడ్డపై అయిదు టీ20ల సిరీస్‌లో బోల్తా కొట్టిన టీమిండియా... వన్డేలకు వచ్చేసరికి అదరగొట్టింది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన తొలి వన్డేలో గ్రాండ్‌విక్టరీ అందుకుంది. ఇంగ్లాండ్‌పై ఆరు వికెట్ల తేడాతో నెగ్గి మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసింది. ఇంగ్లాండ్ విధించిన 259 రన్స్ లక్ష్యాన్ని టీమిండియా మరో 4.4ఓవర్లు మిగిలివుండగానే 4 వికెట్లు కోల్పోయి అందుకుంది.

### శుభ్‌మన్ గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్

ప్రారంభ ఓవర్ నుంచే శుభ్‌మన్(75 బంతుల్లో 80 రిటైర్డ్‌హర్ట్; 11 ఫోర్లు, ఓ సిక్స్) బ్యాట్‌కు పని పెట్టాడు. రోహిత్ శర్మకు ధాటిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించాడు. తొలి వికెట్‌కు 43రన్స్ అందించాడు. ఈ దశలో రోహిత్ శర్మ(11), విరాట్ కోహ్లీ(5) అయిదు పరుగుల తేడాతో అవుటవడంతో భారత్ కష్టాల్లో పడింది. క్రీజ్‌లోకి వచ్చిన శ్రేయాస్ అయ్యర్(53 బంతుల్లో 35) అండగా శుభ్‌మన్ స్కోరును ముందుకు నడిపాడు. ముఖ్యంగా గిల్ ఇంగ్లాండ్ బౌలర్లపై బౌండరీలతో 51బంతుల్లోనే అర్ధసెంచరీ చేశాడు. భారత్ స్కోరును 19.4 ఓవర్లలో వందకు చేర్చాడు. అలాగే మూడో వికెట్‌కు 101 బంతుల్లో సెంచరీ భాగస్వామ్యాన్ని నిర్మించాడు. 25.4 ఓవర్లకు భారత్ 149 పరుగులకు చేరింది. ఈ దశలో గిల్‌కు తొడకండరాలు పట్టేయడంతో ఇబ్బందిపడ్డాడు. రిటైర్డ్‌హర్ట్‌గా మైదానం వీడాడు.



### అక్షర్, వాషింగ్టన్ ఆల్‌రౌండ్ షో

149 పరుగుల వద్ద గిల్ రిటైర్డ్‌హర్ట్ కాగా... 11 పరుగుల తేడాతో శ్రేయాస్(35), రాహుల్(1) వెనుదిరిగాడు. ఈ సారి భారత్ ఇన్నింగ్స్‌ను ఆలౌరౌండర్లు అక్షర్ పటేల్(52 బంతుల్లో 57), వాషింగ్టన్ సుందర్(63 బంతుల్లో 52) ఆదుకున్నారు. అజేయ అర్ధసెంచరీలతో కదం తొక్కారు. 5వ వికెట్‌కు అజేయంగా 102రన్స్ జోడించడంతో 45.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

### బౌలర్లు విజృంభణ

అంతకుముందు టాస్ గెలిచిన ఇంగ్లాండ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. 47.5 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు బెతెల్(14), డకెట్(45 బంతుల్లో 43) దూకుడుగా ఆడుతూ తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించారు. గుర్నూర్ బ్రార్ ఒకే ఓవర్లో ఓపెనర్లిద్దరినీ అవుట్ చేసి వికెట్ల పతనానికి నాంది పలికాడు. ఇక బుమ్రా రెండో స్పెల్ తొలి బంతికే కెప్టెన్ హ్యారీ బ్రూక్(1)ను అవుట్ చేశాడు. మరోవైపు ప్రసిద్ధ్ కృష్ణ కూడా చెలరేగి బట్లర్(5), కుర్రాన్‌ను ఒకే ఓవర్లో అవుట్ చేశాడు. భారత బౌలర్ల దెబ్బకు 22 ఓవర్లలోనే ఇంగ్లాండ్ ఆరు వికెట్లను చేజార్చుకుంది. అయితే, లియామ్ డాసున్(68), జో రూట్(76 నాటౌట్) ఏడో వికెట్‌కు 121 పరుగులు జోడించి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను ఆదుకున్నారు. ఆఖర్లో మళ్లీ పుంజుకున్న భారత బౌలర్లు స్వల్ప వ్యవధిలో వికెట్లు తీసి ఇంగ్లాండ్‌ను ఆలౌట్ చేశారు. స్పిన్నర్ అక్షర్ పటేల్ నాలుగు వికెట్లు తీసి లోయర్ ఆర్డర్ పనిపట్టాడు.

## జపాన్ ఓపెన్ రెండో రౌండ్‌లో పివి సింధు

**టోక్యో, జులై 14:** జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఏస్ షట్లర్ పీవీ సింధూ శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో 21-14, 21-11తో మలేషియాకు చెందిన వోంగ్ లింగ్ చింగ్‌ను రెండు గేముల్లోనే చిత్తు చేసింది. అలవోక విజయంతో రెండో రౌండ్‌కు చేరింది. మ్యాచ్‌ఆరంభం నుంచి సింధూ ఆధిపత్యం ప్రదర్శించింది. ఆద్యంతం దూకుడును ప్రదర్శించిన సింధూ... బ్యాక్‌హాండ్, నెట్ డ్రిబిల్స్, డెఫ్ట్ డ్రాప్స్, హాఫ్ స్మాషస్ షాట్లతో చెలరేగి రెండు గేముల్లోనే ప్రత్యర్థిని చిత్తు చేసింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో ధ్రువ్ కపిలాతనీషా క్రాస్టో జోడీ 21-16, 21-14తో స్కాట్లాండ్‌కు చెందిన అలెగ్జాండర్ డున్ జూలీ మాక్‌ఫెర్సన్ జోడీని ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. మరో రోహన్ కపూర్, రుత్వికా శివాని తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టారు. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్-చిరాగ్ జోడీ గాయంతో టోర్నీ నుంచి వైదొలిగారు.




## 150 వికెట్ల క్లబ్‌లో బుమ్రా

**బర్మింగ్హామ్, జులై 14:** భారత స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా అద్భుత అరుదైన ఘనత అందుకున్నాడు. ఇంగ్లాండ్‌తో తొలివన్డేలో కెప్టెన్ హ్యారీ బ్రూక్ వికెట్ తీసి... వన్డేల్లో 150 వికెట్లు పూర్తి చేశాడు. కేవలం 90వ వన్డేలోనే ఈ మైలురాయి అందుకున్నాడు. భారత్ తరపున అత్యంత వేగంగా ఈఘనత సాధించిన మూడో బౌలర్‌గా నిలిచాడు. మహ్మద్ షమీ, కుల్దీప్ యాదవ్ అతనికంటే ముందున్నారు. అలాగే ఇంగ్లాండ్ గడ్డపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గానూ బుమ్రా మరో రికార్డు సాధించాడు. ఇంగ్లాండ్ గడ్డపై బుమ్రా ఇప్పటి వరకు 31 వికెట్లు తీశాడు. దీంతో జడేజా (30), భువనేశ్వర్(28), మదన్ లాల్ (27)ను బుమ్రా వెనక్కి నెట్టాడు. మూడు ఫార్మాట్లలోనూ 100 అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన భారత బౌలర్‌గా ఇప్పటికే బుమ్రా ఘనత సాధించాడు. వన్డేల్లో 150, టెస్టుల్లో 234వికెట్లు, టీ20ల్లో 121 వికెట్లను బుమ్రా పడగొట్టాడు.

# పశ్చిమాసియా ఎఫెక్ట్.. నష్టాల్లో స్టాక్ సూచీలు




**ముంబయి, జులై 14:** మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవడం, అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు, ముడిచమురు ధరలు భారీగా పెరగడం వంటి ప్రతికూల పరిణామాల నేపథ్యంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ఐటీ, ఆటో, బ్యాంకింగ్ రంగాల షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి కనిపించగా, ఫార్మా, మెటల్ రంగాల షేర్లు కొంత మద్దతుగా నిలిచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 561.46 పాయింట్లు పడిపోయి 77,054.94 వద్ద ముగియగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 158.95 పాయింట్లు కోల్పోయి 24,052.05 వద్ద స్థిరపడింది. వరుసగా మూడుట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 1.38 శాతం, సెన్సెక్స్ 1.45 శాతం క్షీణించాయి. నిఫ్టీ సూచీపై అత్యధిక ఒత్తిడి తీసుకొచ్చిన షేర్లలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.34 శాతం, లార్సెన్ అండ్ టూబ్రో(ఎల్ అండ్ టీ) 2.11 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.09 శాతం నష్టపోయాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో కూడా అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.54 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.08 శాతం తగ్గాయి. బీఎస్ఈలో మొత్తం 1,501 షేర్లు లాభపడగా, 2,737షేర్లు నష్టపోయాయి. 203 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి సంబంధించిన బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 3.49 డాలర్లు (4.19 శాతం) పెరిగి 86.79 డాలర్లకు చేరుకుంది.

విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే రూపాయి 96.2600 వద్ద ట్రేడవగా, గత సెషన్ ముగింపు95.6800గా నమోదైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు5, 2026గడువుగల బంగారం ఫ్యూచర్స్ ధర 0.54 శాతం పెరిగి 10 గ్రాములకురూ.1,41,060కు చేరుకుంది. బయోకాన్ షేరు6.34శాతం ఎగసి రూ.437కు చేరుకుంది. ల్యాండ్‌మార్క్ కార్స్ షేరు20శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేరు 4.63శాతం క్షీణించింది. కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాలను యథాతథంగా కొనసాగించడంతో పెట్టుబడిదారులు నిరాశ చెందారు. పీడీఎస్ షేరు 5.89శాతం లాభపడగా, ప్లాస్టిబ్లెండ్స్ ఇండియా1.39శాతం పెరిగింది. ఈఎంఎస్ షేరు 2.46 శాతం తగ్గింది. ఉత్తరప్రదేశ్ జల్ నిగమ్ (అర్బన్), వారణాసి నుంచి రూ. 105.82 కోట్ల విలువైన మురుగునీటి ప్రాజెక్టుకు అత్యల్ప ధరబిడ్డర్‌గా ఎంపికైనప్పటికీ షేరు ఒత్తిడిలోనే ముగిసింది. వెల్‌స్పన్ కార్ప్ 4.08 శాతం పెరిగింది. ఖైతాన్ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ 2.83 శాతం, కృష్ణ ఫాస్‌కెమ్ 1.19 శాతం చొప్పున పడిపోయాయి. ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ ఐపీఓకు మంగళవారం సాయంత్రం 4:24 గంటల వరకు 12.45 కోట్ల షేర్ల ఆఫర్‌కు గాను 8.16 కోట్ల షేర్లకు దరఖాస్తులు అందాయి. దీంతో ఈ ఇష్యూ 0.66 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓ జూలై 14న ప్రారంభమై ఈనెల 16న ముగియనుంది. షేరు ధరల శ్రేణి రూ.545-574గా నిర్ణయించారు. ఆల్పైన్ టెక్స్‌వర్ల్డ్ ఐపీఓకు కూడా మంగళవారం సాయంత్రం 4:24 గంటల వరకు 1.20 కోట్ల షేర్ల ఆఫర్‌కు గాను 32.52 లక్షల షేర్లకు మాత్రమే బిడ్లు వచ్చాయి. దీంతో ఈ ఇష్యూ 0.27 రెట్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓ జూలై 14న ప్రారంభమై ఈనెల 16న ముగియనుంది. షేరు ధరల శ్రేణి రూ.100-105గా నిర్ణయించారు.

## 62 పైసలు క్షీణించి 96.30కి చేరిక



**ముంబయి, జులై 14:** అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రరూపం దాల్చడంతో భారత రూపాయి మంగళవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే భారీగా బలహీనపడింది. ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారక మార్కెట్‌లో రూపాయి 62 పైసలు క్షీణించి డాలర్‌కు రూ.96.30వద్ద ముగిసింది. ప్రారంభంలో రూపాయి రూ.95.95 వద్ద ట్రేడింగ్ ప్రారంభించినప్పటికీ, రోజు మొత్తం విక్రయ ఒత్తిడి కొనసాగడంతో చివరకు 62 పైసలు నష్టపోయి 96.30 వద్ద స్థిరపడింది. విదేశీ మారక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ముడి చమురు ధరలు పెరగడం, పెట్టుబడిదారులు భద్రమైన పెట్టుబడుల వైపు మొగ్గుచూపడంతో అమెరికా డాలర్‌కు డిమాండ్ పెరగడం రూపాయిపై తీవ్ర ప్రభావం చూపాయి. ఆరు ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలాన్ని సూచించే డాలర్ ఇండెక్స్ 0.16 శాతం తగ్గి 101.07 వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర బ్యారెల్‌కు 86.42 డాలర్లకు చేరి 3.75 శాతం పెరిగింది.

### ఎన్ఆర్ఐ ప్రత్యేక డిపాజిట్ పథకానికి 10 బిలియన్ డాలర్లు

## రూపాయికి అండగా ఆర్‌బీఐ చర్యలు



**న్యూఢిల్లీ, జులై 14:** ఎన్ఆర్ఐలు కోసం రిజర్వు బ్యాంక్ ప్రవేశపెట్టిన ప్రత్యేక డిపాజిట్ పథకం ద్వారా ఇప్పటివరకు సుమారు 10 బిలియన్ డాలర్ల నిధులు భారత్‌కు వచ్చినట్లు వెల్లడి అయింది. విదేశీ మారక నిల్వలను బలోపేతం చేయడంతో పాటు రూపాయి విలువకు మద్దతు ఇవ్వాలనే లక్ష్యంతో ఆర్‌బీఐ చేపట్టిన ఈచర్యకు మంచి స్పందన లభించింది. ద్రవ్య విధాన సమీక్షలో ఎన్ఆర్ఐల నుంచి బ్యాంకులు సమీకరించే విదేశీ కరెన్సీ డిపాజిట్ల కోసం జీరోకాస్ట్ ఫారెక్స్ స్వాప్ సౌకర్యాన్ని ఆర్‌బీఐ ప్రకటించింది. దీంతో బ్యాంకులు ఎన్ఆర్ఐలకు మరింత ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను అందించే అవకాశం లభించింది. తర్వాత గతనెల 23న ఆర్‌బీఐ ఈ డిపాజిట్లపై రుణాలు ఇవ్వడానికి, వాటిపై లియన్ నమోదు చేసేందుకు బ్యాంకులకు అనుమతి కల్పించింది. దీంతో లీవరేజ్ వినియోగానికి అవకాశం ఏర్పడి, ఈ పథకం మరింత ఆకర్షణీయంగా మారింది. ఈ స్పష్టీకరణ అనంతరం గత వారం నుంచి నిధుల ప్రవాహం వేగం పెరిగిందని ఒక అధికారి తెలిపారు. సెప్టెంబర్ 30 వరకు బ్యాంకులు ఈ డిపాజిట్లను సమీకరించే గడువు ఉండటంతో, ఎక్కువ మొత్తంలో నిధులు చివరి దశలో వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే, మీడియాతో మాట్లాడేందుకు అనుమతి లేకపోవడంతో సంబంధిత అధికారులు తమ పేర్లను వెల్లడించేందుకు నిరాకరించారు. ఈ అంశంపై స్పందించాలంటూ పంపిన ఈమెయిల్‌కు ఆర్‌బీఐ తక్షణ స్పందన ఇవ్వలేదు. 30-60 బిలియన్ డాలర్ల వరకు నిధులు వచ్చే అవకాశంప్రస్తుతం సమీకరించిన 10 బిలియన్ డాలర్లు, ఈ పథకం ద్వారా వచ్చే మొత్తం అంచనా నిధుల్లో చిన్న భాగమేనని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.




## 6.51 లక్షల కోట్లకు ప్రత్యక్ష పన్నుల వసూళ్లు

**న్యూఢిల్లీ, జులై 14:** దేశంలో ఆర్థిక కార్యకలాపాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెలల్లో ప్రత్యక్ష పన్ను వసూళ్లు గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. జూలై 13, 2026 నాటికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 16.4 శాతం పెరిగి రూ.6.51 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈ మేరకు ఆదాయపు పన్నుశాఖ సోషల్‌మీడియా వేదిక ఎక్స్‌లో వెల్లడించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూలై 13 నాటివరకు స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు, రీఫండ్‌లు, నికర ప్రత్యక్ష పన్ను వసూళ్ల వివరాలను విడుదల చేసినట్లు తెలిపింది. వివరాల ప్రకారం, స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.6.66 లక్షల కోట్లతో పోలిస్తే 16.11 శాతం పెరిగి రూ.7.74 లక్షల కోట్లకు చేరాయి. ఇదే సమయంలో పన్ను చెల్లింపుదారులకు జారీ చేసిన రీఫండ్‌ల విలువ రూ.1.22 లక్షల కోట్లుగా నమోదైంది. ఇది గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 14.57శాతం అధికం. పన్ను చెల్లింపుదారుల రీఫండ్ క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరిస్తున్నట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. రీఫండ్‌లను మినహాయించిన తర్వాత నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.6.51 లక్షల కోట్లకు చేరుకోగా, గత ఏడాది ఇదే కాలంలో ఈ మొత్తం రూ.5.59 లక్షల కోట్లుగా ఉంది. ఈ వృద్ధికి కార్పొరేట్ పన్ను, కార్పొరేట్‌తర పన్ను వసూళ్లు రెండూ బలంగా పెరగడం ప్రధాన కారణమని ఆదాయపు పన్ను శాఖ తెలిపింది. ముఖ్యంగా వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు, సంస్థలు, వ్యక్తుల సంఘాలు, స్థానిక సంస్థలు, కృత్రిమ న్యాయ వ్యక్తులు చెల్లించే కార్పొరేట్‌తర పన్నులు ప్రత్యక్ష పన్ను ఆదాయంలో అత్యధిక వాటాను కొనసాగించాయి.

## భారత్‌లో టాప్100 బ్రాండ్ల విలువ

# 252.8 బిలియన్ డాలర్లు




**ముంబై, జులై 14:** భారత్‌లోని టాప్100 అత్యంత విలువైన బ్రాండ్ల మొత్తం బ్రాండ్ విలువలు252.8బిలియన్ డాలర్లకు చేరిందని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా 100-2026 నివేదిక వెల్లడించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 7 శాతం వృద్ధి సాధించినట్లు స్పష్టం అయింది. టాప్10 బ్రాండ్లలో తొమ్మిది బ్రాండ్లు తమ బ్రాండ్ విలువను పెంచుకోవడం భారతీయ కంపెనీల బలమైన స్థిరత్వాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపింది. కార్పొరేట్ సంస్థల్లో టాటా గ్రూప్ వరుసగా 10వ ఏడాది కూడా భారత్‌లో అత్యంత విలువైన బ్రాండ్‌గా నిలిచింది. టాటా బ్రాండ్ విలువ 7 శాతం పెరిగి 33.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇన్ఫోసిస్ 16.4బిలియన్ డాలర్ల బ్రాండ్‌విలువతో ఎలాంటి మార్పు లేకుండా నిలిచి, వరుసగా ఐదో ఏడాది దేశంలో రెండో అత్యంత విలువైన బ్రాండ్‌గా తన స్థానాన్ని కొనసాగించింది. ఎల్ఐసీ గ్రూప్ బ్రాండ్ విలువ 12శాతం పెరిగి 15.3బిలియన్ డాలర్లకు చేరింది. దేశవ్యాప్తంగా, ముఖ్యంగాగ్రామీణ ప్రాంతాల్లో విస్తృత నెట్‌వర్క్, ప్రపంచంలోనే అతిపెద్ద ఏజెంట్ వ్యవస్థ ఉండటం ఎల్ఐసీకి బలంగా మారిందని తెలిపింది. ప్రైవేట్ బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగంలో హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ బ్రాండ్ విలువ 2 శాతం తగ్గి 13.9 బిలియన్ డాలర్లకు చేరినా, దేశంలోని ప్రముఖ ప్రైవేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ బ్రాండ్లలో ఒకటిగా తన స్థానాన్ని కొనసాగించింది. రిలయన్స్ గ్రూప్ బ్రాండ్ విలువ 11 శాతం పెరిగి 10.8 బిలియన్ డాలర్లకు చేరింది.

రిటైల్, టెలికాం, డిజిటల్ సేవలు, ఇంధన రంగాల్లో విస్తరణతో పాటు వినియోగదారుల వ్యాపారాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, కంటెంట్, నూతన ఇంధన రంగాల్లో కొనసాగుతున్న పెట్టుబడులు రిలయన్స్ వృద్ధికి ప్రధానకారణాలనిపేర్కొంది. ఎస్‌బీఐ గ్రూప్ బ్రాండ్ విలువ 2 శాతం పెరిగి 9.8బిలియన్ డాలర్లకు చేరింది. భారతబ్యాంకింగ్ వ్యవస్థలోకీలకసంస్థగా ఎస్‌బీఐ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుందని నివేదిక తెలిపింది. హెచ్‌సీఎల్‌టెక్ బ్రాండ్ విలువ 9 బిలియన్ డాలర్ల వద్ద కొనసాగింది. విభిన్న రంగాల ఖాతాదారులు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులు, ఆధారిత సేవలకు పెరుగుతున్న డిమాండ్ కంపెనీ వృద్ధికి బలమని పేర్కొంది.

## 100 బిలియన్ డాలర్లకు టాటా ఆటోమొబైల్స్ టార్గెట్



**న్యూఢిల్లీ, జులై 14:** టాటా గ్రూప్‌కు చెందిన ఆటోమొబైల్ వ్యాపారాన్ని వచ్చేఐదేళ్లలో 100 బిలియన్ అమెరికన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాటా గ్రూప్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తెలిపారు. దేశీయ వ్యాపార విస్తరణ కోసం రూ.40వేల కోట్ల మూలధనం ఖర్చుచేస్తామని, జాగ్వార్ ల్యాండ్ రోవర్ కోసం సుమారు 20 బిలియన్ బ్రిటిష్ పౌండ్ల పెట్టుబడి ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 81వ ఏజీఎం లో వర్చువల్‌గా పాల్గొన్న చంద్రశేఖరన్, వాటాదారులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఈ వివరాలు వెల్లడించారు. ఎలక్ట్రిక్ వాహనాలవిభాగంలో ప్రస్తుతం ఉన్న సుమారు 42 శాతం మార్కెట్ వాటాను కొనసాగిస్తూ, భవిష్యత్తులో 40-45 శాతం మార్కెట్ వాటాను నిలబెట్టుకోవడమే కంపెనీ లక్ష్యమని చెప్పారు. కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా ఆకర్షణీయమైన కొత్త మోడళ్లను మార్కెట్లోకి తీసుకురావడంపై టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ దృష్టి సారిస్తుందని ఆయన తెలిపారు. 2030 నాటికి వాహనాల విక్రయాలను పది రెట్లు పెంచడంతో పాటు దేశీయ ప్యాసింజర్ వాహనాల మార్కెట్లో 20 శాతం వాటాను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్, టాటా మోటార్స్ లిమిటెడ్ రెండూ అత్యంత ప్రతిష్ఠాత్మక లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14